తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం 22.07.2026 | సంపుటి : 13 సంచిక : 02 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370
హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698




# మోదీ..రాజీనామా చెయ్



## వెంటనే విద్యార్థులకు క్షమాపణ చెప్పు
## వారిపై లాఠీఛార్జి దురదృష్టకరం
## ప్రధాని ఇంటి ముందు రాహుల్, ప్రియాంక మెరుపు ధర్నా

ఫలించని చర్చలు.. ఇరువురి అరెస్టు



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**భారత ప్రధాని నరేంద్ర మోదీ నివాసం దగ్గర కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ధర్నా చేపట్టారు. జంతర్‌మంతర్ వద్ద నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై ఆందోళన చేస్తున్న విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్‌కు నిరసనగా చేపట్టిన ఈ ధర్నాలో రాహుల్‌తో పాటు ఖర్గే, కేసీ, ప్రియాంక, పలువురు కాంగ్రెస్ ఎంపీలు పాల్గొన్నారు. కాంగ్రెస్ నేతలు చేతులకు సంకెళ్లు వేసుకుని నిరసన తెలిపారు.గూండాగిరి, నిరంకుశత్వం వద్దంటూ.. అణచివేత చర్యలు నడవవంటూ నిరసనకారులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్రధాని మోదీ రాజీనామా మిగతా 2లో..



జంతర్‌మంతర్ వద్ద నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై ఆందోళన చేస్తున్న విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్‌కు నిరసనగా మంగళవారం ప్రధాని మోదీ నివాసం ఎదుట రాహుల్, ప్రియాంక తదితరుల మెరుపు ధర్నా

> దేశంలో యువత పట్ల కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు ఏమాత్రం సరికాదు. దేశంలో యువతకు అవకాశాలు పూర్తిగా సన్నగిల్లాయి. వారికి ఉన్న ఏకైక మార్గమైన పోటీ పరీక్షల వ్యవస్థను సైతం నాశనం చేశారు. దిల్లీలో విద్యార్థులపై దాడి ఘటనపై ప్రధాని ఎందుకు మౌనంగా ఉన్నారు. ఈ ఘటనపై ప్రధాని వెంటనే విద్యార్థులకు క్షమాపణ చెప్పాలి. భారత్‌లో తమకు భవిష్యత్తే లేదన్న విద్యార్థుల ఆవేదన పూర్తిగా న్యాయమైనదే.. ఈ పరిస్థితులకు నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలి – రాహుల్

## యువత కోసం రాహుల్ పోరాటం

### ఎక్స్ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పోస్ట్



**హైదరాబాద్,జులై 21(జనంసాక్షి):**యువత భవిష్యత్ కోసం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పోరాటం చేస్తున్నారని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దిల్లీలో విద్యార్థులపై లాఠీఛార్జీకి బాధ్యత వహిస్తూ ప్రధాని మోదీ రాజీనామా చేయాలని రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ నేతలు ప్రధాని నివాసం వద్ద ధర్నా చేపట్టారు. మిగతా 2లో..

## చర్చలకు సిద్ధం!

### ఆందోళనకు శాంతియుత పరిష్కారం చూపే దిశగా కేంద్రం అడుగులు!

#### గాయపడిన విద్యార్థులను పరామర్శించిన కేంద్ర మంత్రి జేపీ నడ్డా

**న్యూఢిల్లీ,జూలై21(జనంసాక్షి):** నీట్ ప్రశ్నపత్రం లీక్, విద్యా వ్యవస్థలో లోపాల నేపథ్యంలో కాక్రోచ్ జనతా పార్టీ సోమవారం చేపట్టిన ’చలో పార్లమెంట్’ యాత్ర ఉద్రిక్తంగా మారిన నేపథ్యంలో సీజేపీ ఆందోళనకు శాంతియుత పరిష్కారం చూపే దిశగా కేంద్రం మిగతా 2లో..

## వాంగ్‌చుక్‌కు ఊరట..

ప్రైవేటు ఆసుపత్రికి తరలించేందుకు గ్రీన్ సిగ్నల్

జంతర్ మంతర్‌లో కొనసాగుతున్న

## నిరసన

వర్షాన్ని సైతం లెక్కచేయకుండా దీక్షా శిబిరంలో విద్యార్థుల బైఠాయింపు

2లో..

## నీట్ లీక్ బాధ్యులను కఠినంగా శిక్షిస్తాం: మోదీ

# తప్పుడు ప్రచారంతో లబ్ధికి బీఆర్ఎస్ కుట్ర

- సన్న వడ్ల కుంభకోణం గతంలో జరిగిందేమో?
- ఈ ప్రభుత్వంలో అలాంటిదేమీ జరగలేదు
- హరీశ్‌కు విమర్శలకు మంత్రి ఉత్తమ్ కౌంటర్



**హైదరాబాద్,జూలై21(జనంసాక్షి):** ఈ ప్రభుత్వంలో సన్న వడ్ల కుంభకోణం అనేది అవాస్తవమని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. దీనిపై మీడియా – సోషల్ మీడియాలో వస్తున్న వార్తల్లో నిజం లేదని అన్నారు. కొందరు కావాలని సన్న వడ్ల కుంభకోణం అంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో ఈ కుంభకోణం జరిగి ఉండవచ్చని ఆరోపించారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి పని పారదర్శకంగా జరుగుతుందని వివరించారు. ధరలు పెంచి టెండర్ కోడ్ చేస్తే.. ఎవ్వరూ ముందుకు రాలేదని అన్నారు. అందుకే మళ్ళీ పిలిచారని తెలిపారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు వచ్చి అబద్దాలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీటిపారుదలలో ఎక్స్‌పర్ట్ అయితే.. హరీశ్ రావును మంత్రి పదవి నుంచి కేసీఆర్ ఎందుకు తొలగించారంటూ ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి సందేహం వ్యక్తం చేశారు. ముందు టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పాలంటూ హరీశ్ రావుకు సూచించారు. దేవాదులలో 7 పంపులు నడుస్తున్నాయని.. నేడు మరో రెండు అందుబాటులోకి వస్తాయని అన్నారు. రూ.14 వందల కోట్ల సంగతి ఏమిటో ముందు సమాధానం చెప్పాలంటూ హరీశ్ రావును మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు.

**సర్ ప్రక్రియలో ఓటర్లంతా పాల్గొనాలి**

హుజూర్ నగర్ ఓటర్లు వందకు వంద శాతం సర్ ప్రక్రియలో పాల్గొనాలని మంతంరిచ నియోజకవర్గ ఎమ్మెల్యే ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు. ఈమేరకు ఆయన ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. నాకు ప్రాణ సమానులైన , ఎంతో ప్రియమైన హుజూర్ నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ కుటుంబ సభ్యులందరికీ , నా అన్నలు, తమ్ములు, అక్కలు, చెల్లెల్లు అందరకీ నమస్కారం. ఇప్పుడు మీ అందరికీ తెలిసిన విషయమే ఓటరు జాబితా సవరణ కొనసాగుతుంది. ఈ ప్రోగ్రాం లో రాష్ట్రస్థాయి నుండి గ్రామస్థాయి వరకు మిగతా 2లో..



## నలుగురు రైతులు చనిపోయినా బాధ్యత లేదా?

### కాంగ్రెస్ సర్కార్‌ను నిలదీసిన కేటీఆర్

**ఆదిలాబాద్(జనంసాక్షి):** ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల తెచ్చిన ధాన్యం 30 రోజులు, 60 రోజులైనా కొనేటోడు దిక్కు లేడు.. సంచులు ఇచ్చేటోడు దిక్కులేడు. ఈ దిక్కు దివానం లేని ప్రభుత్వంలో అన్నదాతకు దిక్కులేని పరిస్థితి వస్తే ఆ పంటను కాపాడుకునే ఆ కొనుగోలు కేంద్రం దగ్గరే కాపు కాసి ఉన్నప్పుడు గోడ కూలి నలుగురు రైతులు చనిపోయారని మిగతా 2లో..

# కొడంగల్ అభివృద్ధిపై సీఎం సుడిగాలి పర్యటన

ఇండస్ట్రియల్ పార్కుల కోసం భూ సేకరణ చేయండి • నిర్లక్ష్యం చేస్తే కలెక్టర్ల బదిలీలు

ముంబై - పూణె హైవే తరహాలో రోడ్ల అభివృద్ధి • కొడంగల్ ఎత్తిపోతల కోసం అదనపు పంపుసెట్లు

రంగారెడ్డి,వికారాబాద్,నారాయణపేట ఓఆర్ఆర్ కోసం డిజైన్లు రూపొందించండి : సీఎం రేవంత్ రెడ్డి

**వికారాబాద్ జిల్లా బ్యూరో జులై 22 (జనంసాక్షి):**

ఇండస్ట్రియల్ పార్కులకు అవసరమైన భూసేకరణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలనీ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.మంగళవారం వికారాబాద్ జిల్లా , కొడంగల్ నియోజకవర్గం ,దుద్యాల మండలం ఎడ్యుకేషన్ హబ్ లో కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధి పనుల పై రాష్ట్ర ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి మాట్లాడుతూ...ఇండస్ట్రియల్ పార్కుల భూసేకరణ పై జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. భూసేకరణ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే అవసరమైతే అక్టోబర్లో పనితీరు ఆధారంగా కలెక్టర్లను బదిలీ చేస్తామని కలెక్టర్ అన్నారు. జిల్లా కలెక్టర్లు క్షేత్ర మిగతా 2లో..



## అధికారులపై సీఎం సీరియస్..!!

- 7 నెలలు గడిచిన ముందుకు సాగని పనులు
- అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం చేస్తే సస్పెన్షన్ వేటు తప్పదు
- భూ నిర్వాహకులకు ఇంటి ప్లాట్స్ ఇవ్వకపోవడంపై ఆగ్రహం
- కొడంగల్ లో సీఎం అడుగడుగున అభివృద్ధి పనుల తనిఖీ

2లో..

## జమ్మూ కాశ్మీర్‌లో క్లౌడ్ బరస్ట్

- కొండ చరియలు విరిగి పడి పలువురు గల్లంతు
- అసోంను ముంచెత్తిన వరదలు
- పదిమంది మృతి..లక్షలాది మంది నిరాశ్రయులు
- సిక్కింలో నిర్మాణంలో ఉన్న సొరంగంపై విరిగిపడ్డ కొండచరియలు.. పదిమంది కార్మికుల దుర్మరణం



2లో..

## ఎడతెరిపి వర్షాలతో కేకే ఓసీలో స్తంభించిన బొగ్గు ఉత్పత్తి



4,100 టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం

50వేల క్యూబిక్ మీటర్ల మట్టి వెలికితీత పనులు నిలిపివేత

బొగ్గు సరఫరా ప్రణాళికలపైనా కొంత మేర ప్రభావం

**రామకృష్ణాపూర్/శ్రీరాంపూర్, జులై 21(జనంసాక్షి):** గత సోమవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మందమర్రి ఏరియాలోని కేకే ఓపెన్‌కాస్ట్ (కేకే ఓసీ) ప్రాజెక్టుపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. భారీ వర్షాల కారణంగా గనిలో నీరు చేరడంతో బొగ్గు ఉత్పత్తి, మట్టి వెలికితీత పనులు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో సింగరేణి సంస్థకు గణనీయమైన ఉత్పత్తి నష్టం వాటిల్లినట్లు అధికారులు తెలిపారు.కేకే ఓసీ ప్రాజెక్టు అధికారి రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం, ఒక్కరోజులోనే సుమారు 4,100 టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడిందని, 50 వేల క్యూబిక్ మీటర్ల ఓవర్‌బర్డెన్ (మట్టి) వెలికితీత పనులు కూడా వర్షాల కారణంగా నిలిచిపోయాయని తెలిపారు. దీంతో ఉత్పత్తి లక్ష్యాల సాధనపై ప్రతికూల ప్రభావం పడిందన్నారు.గనిలో భారీగా వర్షపు నీరు చేరడంతో డంపర్లు, ఎక్స్‌కవేటర్లు, మిగతా 2లో..

# ఇక సమరమే..



- అమెరికాపై పూర్తిస్థాయి యుద్ధం చేస్తున్నాం
- ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కీలక వ్యాఖ్యలు
- అమెరికా పౌరులు జాగ్రత్తగా ఉండాలి
- పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా అడ్వైజరీ జారీ

**టెహ్రాన్,జూలై21(జనంసాక్షి):** అమెరికా–ఇరాన్ మధ్య ఘర్షణల నేపథ్యంలో పశ్చిమాసియాలో పరిస్థితి మళ్లీ వేడెక్కింది. ఈ నేపథ్యంలో ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. తమ దేశం ప్రస్తుతం అమెరికాతో పూర్తి స్థాయి యుద్ధం చేస్తోందని ప్రకటించారు. ప్రస్తుతం కేవలం సైనిక పరంగానే కాకుండా ఆర్థిక రంగంలో కూడా తీవ్ర పోరాటం కొనసాగుతోందని, ప్రజల జీవనోపాధిని కాపాడటం ప్రభుత్వానికి అత్యంత కీలక బాధ్యతగా మారిందని ఆయన పేర్కొన్నారు. దేశం యుద్ధ పరిస్థితులను ఎదుర్కొంటున్నప్పటికీ, ప్రజల దైనందిన జీవితం దెబ్బతినకుండా చూడటమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పెజెష్కియన్ అన్నారు. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడం, ప్రజల జీవన ప్రమాణాలను కాపాడడం ప్రస్తుతం అత్యంత కీలకమని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం ఇరాన్ వ్యాప్తంగా అమెరికా దాడులు చేస్తోందని, ఆ పరిణామాలను దేశ ప్రజలు అంగీకరించాలని కోరారు. టీవల కొద్ది రోజులుగా అమెరికా–ఇరాన్ మధ్య వైమానిక దాడులు కొనసాగుతున్నాయి. హోర్ముజ్ జలసంధి ప్రాంతంలో మిగతా 2లో..

## ఇక సమరమే..

ఉద్రిక్తతలు పెరగడంతో ప్రపంచ చమురు సరఫరాపై కూడా ప్రభావం పడుతోంది. అయితే యుద్ధ వాతావరణం నెలకొన్నప్పటికీ, ఉద్రిక్తతలను తగ్గించేందుకు పలు దేశాలు దౌత్యపరమైన ప్రయత్నాలు కొనసాగిస్తున్నాయి. కానీ, ఇరు దేశాలు తమ తమ వైఖరిని మార్చుకోకపోవడంతో పరిస్థితి ఇంకా అనిశ్చితంగానే ఉంది.

## నలుగురు రైతులు చనిపోయినా బాధ్యత లేదా?

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంతో పంట కొనకపోవడం వల్ల గోడ కూలి ప్రాణాలు కోల్పోయిన నలుగురు రైతుల కుటుంబాలకు కేటీఆర్ ఆర్థిక సాయం అందించారు. మే 6న లక్షెట్టిపేట మండలంలో పంటలు కాపాడుకునేందుకు వెళ్లి మృత్యువాత పడిన నలుగురు రైతు కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ. 5 లక్షల చొప్పున మొత్తం రూ. 20 లక్షల ఆర్థికసాయాన్ని అందించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. నలుగురు రైతులు చనిపోతే వారికి న్యాయం చేయాలని మా బీఆర్ఎస్ నాయకులు జీవన్ రెడ్డి, దివాకర్ రావు 8 గంటలు ధర్నా చేసినా.. దున్నపోతు మీద వాన పడ్డట్లు ప్రభుత్వం నుండి స్పందన రాలేదు. చివరికి ఏదో మొక్కుబడిగా ఒప్పుకున్నారు.. చూస్తాం.. చేస్తాం అని ఒప్పుకున్నరు.. కానీ ఈ రోజు వరకు దాదాపు 2 నెలలు గడిచిపోయినా స్పందన లేదు. కనీసం మానవత్వం అనే ఆలోచన కూడా లేదు. ఈ నలుగురు జీవితాలు అర్థాంతరంగా ముగిసిపోయిన తర్వాత నాకు దివాకర్‌రావు, జీవన్ రెడ్డి కలిసి ఫోన్ చేశారు. అన్నా పార్టీ తరపున మనమైనా ఏమన్నా చెప్పాలే.. ఎందుకంటే రైతులు ఇలా ఇబ్బంది పడుతున్నారు.. వారికి అండగా నిలబడాలన్నారు.

## పార్లమెంట్లో ప్రతిపక్ష నేతలకు సమాధానం ఇవ్వరా?

**కేంద్ర ప్రభుత్వం తీరుపై మండిపడ్డ ఎంపీ చామల**

న్యూఢిల్లీ,జూలై21(జనంసాక్షి): పార్లమెంటులో ప్రతిపక్ష నేతలు అడిగిన అంశాలకు కేంద్రం ఎందుకు సమాధానం చెప్పట్లేదని కాంగ్రెస్ భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రశ్నించారు. మంగళవారం రామ్ మనోహర్ లోహియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సీజేపీ పార్టీ మద్దతుదారు, కార్యకర్తలను కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఎంపీలు పరామర్శించారు. ఈ సందర్భంగా ఎంపీ చామల మాట్లాడారు. ర్యాలీ సందర్భంగా సీజేపీ కార్యకర్తలపై ఢిల్లీ పోలీసులు లాఠీఛార్జ్ చేశారని అన్నారు. ఈ ఘటనలో పలువురు సీజేపీ కార్యకర్తలకు గాయాలయ్యాయని వెల్లడించారు. ఆర్ఎంఎల్ ఆస్పత్రిలో సీజేపీ కార్యకర్తలను రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో కలిసి పరామర్శించినట్లు ఎంపీ చామల చెప్పుకొచ్చారు. విద్యార్థులపై లాఠీఛార్జ్ చేసిన ఘటనకు బాధ్యత వహిస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎందుకు కాపాడుతున్నారని ప్రశ్నించారు. ధర్మేంద్ర ప్రధాన్‌తో ఎందుకు రాజీనామా చేయించట్లేదని ఎంపీ చామల నిలదీశారు. ప్రధాని మోదీని మూడోసారి ప్రజలు ఎన్నుకున్నారని తెలిపారు. ప్రజా సమస్యలను మోదీ పరిష్కరించే దిశగా ఎందుకు ముందుకు పోవట్లేదని నిలదీశారు. రైతులు హరియాణాలో ఆందోళన చేస్తున్నారని, వారిని ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నల వర్షం కురిపించారు.

# మోదీ.. రాజీనామా చెయ్

చేయాలని డిమాండ్ చేశారు. నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నేతలను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రజాస్వామ్యయుతంగా ఆందోళన చేస్తుంటే పోలీసులు దౌర్జన్యం చేస్తున్నారంటూ కాంగ్రెస్ ఎంపీలు ఆగ్రహం వ్యక్తం చేసారు. ధర్నా సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. నిన్న యువతపై లాఠీచార్జ్‌కు బాధ్యత వహిస్తూ ప్రధాని మోదీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నీట్ లీకేజీపై పార్లమెంట్‌లో చర్చకు అంగీకరించలేదని అన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వంలో జవాబుదారీతనం లేదని పేర్కొన్నారు. ప్రధాని మోదీ మౌనం వీడాలని, నీట్ అంశంపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ మార్చ్ సందర్భంగా ఢిల్లీ పోలీసులు విద్యార్థులు, నిరసనకారులపై లాఠీఛార్జ్ చేశారు. విద్యార్థులపై అణచివేతకు వ్యతిరేకంగా రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ, మల్లికార్జున ఖర్గేలతో పాటు కాంగ్రెస్ నాయకులు లోక్‌కళ్యాణ్ మార్గ్‌లోని ప్రధాని నివాసం ముందు ధర్నాకు దిగారు. ఈ ధర్నాలో పవన్ ఖేరా, పంజాబ్ కాంగ్రెస్ అధ్యక్షులు అమరీందర్ సింగ్ రాజా వారింగ్, దీపేందర్ హూడా, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ సహా పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు. విద్యార్థుల్ని బీజేపీ ప్రభుత్వం క్రూరంగా హింసించిందని, కానీ బాధ్యత వహించడానికి, పార్లమెంట్‌లో చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా లేదని రాహుల్ గాంధీ ఆరోపించారు. మంగళవారం మధ్యాహ్నం కాంగ్రెస్ నేతల ధర్నాతో ఒక్కసారిగా ఢిల్లీలో హైడ్రామా చోటుచేసుకుంది. రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్రమోడీ, కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉంటే, కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ కాంగ్రెస్ ధర్నా చేస్తున్న ప్రదేశానికి చేరుకుని రాహుల్ గాంధీతో చర్చిస్తున్నారు. భద్రతా కారణాల దృష్ట్యా ఆ ప్రాంతాన్ని వెంటనే ఖాళీ చేయాలని రాహుల్ గాంధీకి నచ్చచెప్పేలా ప్రయత్నిస్తున్నారు. రాహుల్‌తో పాటు కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గేతో చర్చించారు. మరోవైపు, కాంగ్రెస్ శ్రేణులు రాజీనామా చేయాలంటూ నినాదాలు చేస్తున్నారు.

**పోలీసుల అదుపులో రాహుల్ ముక్కు నుంచి రక్తం!**

ప్రధాని నరేంద్ర మోదీ నివాసం వద్ద కాంగ్రెస్ చేపట్టిన ఆందోళన తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నేతృత్వంలో ఆ పార్టీ ఎంపీలు, ముఖ్య నేతలు మెరుపు ధర్నాకు దిగారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో పాటు ఈ అంశాన్ని పార్లమెంట్‌లో చర్చించాలనే డిమాండ్లతో దాదాపు 3 గంటలకు పైగా ధర్నా కొనసాగింది. మరోవైపు, కాంగ్రెస్ ధర్నా చేసిన ప్రాంతాన్ని పోలీసులు ఖాళీ చేయించారు. రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీను అదుపులోకి తీసుకున్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, కర్ణాటక, కేరళ సీఎంలు డీకే శివకుమార్, సతీషన్‌తో పాటు ఇతర కాంగ్రెస్ ముఖ్య నేతలను పోలీసులు అదుపులోకి తీసుకొని బస్సుల్లో తరలించారు. ఈ క్రమంలో రాహుల్ గాంధీ స్వల్పంగా గాయడినట్లు సమాచారం. పోలీసులు అదుపులోకి తీసుకొని తరలించే క్రమంలో ఆయన ముక్కు నుంచి రక్తం కారుతున్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. రాహుల్ గాంధీ, ప్రియాంకను పోలీసులు వేర్వేరు స్టేషన్లకు తరలించారు. ఈ క్రమంలో మందిర్ మార్గ్ పోలీస్ స్టేషన్‌లో వున్న ప్రియాంకా గాంధీ వాద్రాను కలిసేందుకు కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ అక్కడికి చేరుకున్నారు. ఇదిలా ఉండగా.. రాహుల్‌ను మోడల్ టౌన్‌లోని ఛత్రసాల్ స్టేడియానికి పోలీసులు తరలించినట్లు కాంగ్రెస్ నేతలు వెల్లడించారు. అంతకుముందు కాంగ్రెస్ ధర్నా వద్దకు వచ్చిన కేంద్ర సహాయ మంత్రి, ప్రధాని కార్యాలయ బాధ్యతలు చూస్తున్న జితేంద్ర సింగ్, కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్.. రాహుల్‌తో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా కేంద్రం ముందు ఆయన ప్రధానంగా రెండు డిమాండ్లు ఉంచారు. ఎట్టిపరిస్థితుల్లో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, నిన్న విద్యార్థులపై లాఠీఛార్జి చేసిన ఘటనపై పార్లమెంటు ఉభయ సభల్లో కేంద్రం స్పందించాల్సిందేనని పట్టుబట్టారు. ఈ విషయంలో ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన వచ్చే వరకు తాము ఈ ఆందోళనలు ఆపేది లేదని, ఇక్కడి నుంచి కదిలేది లేదని రాహుల్ తేల్చి చెప్పారు. ఆ తర్వాత దిల్లీ పోలీసులతో పాటు ఆర్‌పీఎఫ్, ఆర్ఏఎఫ్ బలగాలు భారీగా మోహరించి ప్రధాని నివాసం ముందు ధర్నా చేస్తున్న నేతలందరినీ అదుపులోకి తీసుకోవడంతో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. డిమాండ్లపై రాహుల్‌గాంధీ మాట మార్చారని కేంద్రమంత్రి జితేంద్రసింగ్ విమర్శించారు. రాహుల్ సహా కాంగ్రెస్ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకోకముందు మీడియాతో ఆయన మాట్లాడారు. "నీట్ అంశంపై లోక్‌సభలో చర్చించాలని తొలుత రాహుల్ కోరారు. దానిపై హామీ ఇస్తే ధర్నా విరమిస్తామన్నారు. పార్లమెంట్‌లో చర్చిస్తామని హామీ ఇచ్చాం. ఇప్పుడు మాట మార్చి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతున్నారు. ప్రతిపక్ష నేత హోదాలో ఇలా మాట మార్చడం సరికాదు. రాహుల్ ప్రవర్తన, ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం. యాగీ చేయడమే ఆయన ఉద్దేశం. రాజకీయ లబ్ధి కోసమే రాహుల్ ప్రయత్నిస్తున్నారు. మా ప్రభుత్వం యువతకు అన్యాయం చేయదు"అని జితేంద్రసింగ్ అన్నారు.

**కేంద్రమంత్రి సంప్రదింపులు..**

మోదీ నివాసం వద్ద అనూహ్య రీతిలో కాంగ్రెస్ అగ్రనేతలు ధర్నాకు దిగడంతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. అక్కడకు చేరుకున్న కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ కాంగ్రెస్ నేతలకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. రాహుల్ గాంధీతో మాట్లాడి ఆందోళన విరమించాలని కోరారు. అయినప్పటికీ కాంగ్రెస్ నేతలు ఆందోళన విరమించలేదు. ఖర్గే, రాహుల్ గాంధీ సహా పలువురు కాంగ్రెస్ సీనియర్ నేతలు తమ చేతులకు సంకెళ్లు వేసుకొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలియజేశారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

## చర్చలకు సిద్ధం!

అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో విద్యార్థి ప్రతినిధులతో చర్చలకు సిద్ధమని కేంద్రం ప్రకటించినట్లు సమాచారం. ఈ సమస్యలకు చర్చల ద్వారానే పరిష్కారం లభిస్తుందని కేంద్రం ఆశాభావం వ్యక్తం చేస్తోంది. అందుకోసం ఆ దిశగా చర్యలు చేపట్టింది. విద్య మంత్రిత్వ శాఖ లేదా ఉన్నతాధికారుల స్థాయిలో విద్యార్థులతో సమావేశం నిర్వహించే ఆస్కారం ఉందని తెలుస్తోంది. దీంతో నీట్ నిర్వహించే పరీక్షా వ్యవస్థలో పారదర్శకతతో పాటు సంస్కరణల దిశగా ముందడుగు పడనుంది. సోమవారం చలో పార్లమెంట్ యాత్రలో విద్యార్థులు, యువతపై పోలీసులు లాఠీఛార్జ్ చేశారు. ఈ ఘటనలో గాయపడిన వారు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిని మంగళవారం కేంద్ర మంత్రి జేపీ నడ్డా పరామర్శించారు. అనంతరం విద్యార్థులతో కేంద్రం చర్చలకు సుముఖంగా ఉందనే ప్రచారం ప్రారంభమైంది. నీట్ ప్రశ్నపత్రం లీక్, పోటీ పరీక్షల్లో అవకతవకలతో పాటు పేపర్ లీకేజీ వ్యవహారంపై విద్యార్థి లోకం భగ్గుమంది. దీంతో జాతీయ స్థాయిలో విద్యార్థుల నిరసనలు, నిరాహార దీక్షలు ఉధృతమయ్యాయి. దాంతో విద్యార్థుల సమస్యల పరిష్కారానికి 'చర్చల కోసం తలుపులు తెరిచే ఉన్నాయని' కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. మరో వైపు ఈ అంశంపై ప్రధాని మోదీకి విద్యావేత్తలతో పాటు సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ లేఖ రాసిన సంగతి తెలిసిందే. ఒంకోవైపు నీట్ లీకేజీ వ్యవహారంపై ప్రధాని మోదీ తొలిసారి స్పందించారు. మంగళవారం న్యూఢిల్లీలో మంగళ్ మిలన్ పేరిట ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నీట్ పేపర్ లీక్ ఘోర పాపమని అన్నారు. ఇలాంటివి పునరావృతం కాకూడదని స్పష్టం చేశారు.

## దేశ యువత కోసం రాహుల్ పోరాటం

ఈ ఆందోళనకు మద్దతు తెలుపుతూ సీఎం రేవంత్‌రెడ్డి 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. దేశవ్యాప్తంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంకా గాంధీ మద్దతుగా నిలిచారని చెప్పారు. యంగ్ ఇండియాకు కాంగ్రెస్ అండగా ఉంటుందని సీఎం పేర్కొన్నారు.

## జంతర్ మంతర్‌లో కొనసాగుతున్న నిరసన

న్యూఢిల్లీ(జనంసాక్షి):మరోవైపు జంతర్‌మంతర్ వద్ద సీజేపీ కార్యకర్తలు నిరసన కొనసాగిస్తున్నారు. సోమవారం నాటి ఘర్షణల్లో గాయపడిన వారు కూడా వర్షాన్ని సైతం లెక్కచేయకుండా దీక్షా శిబిరంలో బైఠాయించారు. వీరిని ఆమ్‌ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్, ఎన్‌సీపీ (ఎస్‌పీ) నేత శరద్ పవార్, సుప్రియా సూలే తదితరులు పరామర్శించి మద్దతు తెలియజేశారు.

## నీట్ లీక్ బాధ్యులను కఠినంగా శిక్షిస్తాం

న్యూఢిల్లీ(జనంసాక్షి):నీట్ లీకేజీ వ్యవహారంపై ప్రధాని నరేంద్ర మోదీ తొలిసారి స్పందించారు పేపర్ లీక్ ఘోర పాపమని, ఇలాంటివి మళ్లీ జరగకూడదని వ్యాఖ్యానించారు. బాధ్యులకు కఠిన శిక్ష విధించాలని, ఇలాంటి లీక్‌లను నివారించడం జాతీయ బాధ్యత అని పేర్కొన్నారు. 'మంగళ్ మిలన్' పేరిట మంగళవారం జరిగిన ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఈ మేరకు ప్రధాని మాట్లాడారు. ఆయన మాట్లాడిన అంశాలను కేంద్రమంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. "పార్లమెంట్‌లో నిర్మాణాత్మక చర్చలు జరిగేలా విపక్షాలు సహకరించాలి. రాజకీయంగా విభేదాలు ఉండొచ్చు. కానీ దేశ భవిష్యత్తు, యువత సంక్షేమం కోసం కలిసి పనిచేయాల్సిన బాధ్యత ఎంపీలందరిపై ఉంది" అని ప్రధాని సూచించారు. "పిల్లలను రెచ్చగొట్టొద్దు. తప్పుడు మార్గంలోకి వెళ్లడం సులభం. కానీ తిరిగి సరైన మార్గంలోకి రావడం చాలా కష్టం. వారు సరైన మార్గంలో వెళ్లేలా చూసుకోవడం మనందరి బాధ్యత" అని పేర్కొన్నారు. దేశంలో ప్రధాన పోటీ పరీక్షల్లో ఒకటైన నీట్ మేలో నిర్వహించగా.. పేపర్ లీక్ ఆరోపణలతో జూన్‌లో మళ్లీ పరీక్ష నిర్వహించాల్సి వచ్చింది. సీబీఎస్ఈ 12వ తరగతిలో ఈ ఏడాది కొత్తగా ప్రవేశపెట్టిన ఆన్‌స్క్రీన్ మార్కింగ్ విధానంలోనూ లోపాలు వెలుగుచూశాయి. అలాగే మరికొన్ని లీకేజీ ఆరోపణలు వచ్చాయి.

# జమ్మూ కాశ్మీర్‌లో క్లౌడ్ బరస్ట్

**శ్రీనగర్,గౌహతి:జూలై21(జనంసాక్షి):**

జమ్మూకశ్మీర్‌లో మేఘ విస్ఫోటం కారణంగా సంభవించిన ఆకస్మిక వరదలు బీభత్సం సృష్టించాయి. భారీ వర్షాలతో కొండచరియలు విరిగిపడటం, వరదల కారణంగా సరిహద్దు జిల్లాలైన పూంఛ్, రాజౌరీల్లో ఇప్పటికే 12 మంది మృతి చెందగా.. పలువురు గల్లంతయ్యారు. రోడ్లు, ఇళ్లుసహా పలు ప్రభుత్వ, ప్రైవేటు మౌలిక సదుపాయాలు చాలావరకు దెబ్బతిన్నాయి. దీంతో ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా సోమవారం దిల్లీలో రాష్ట్ర హోదా కోసం తలపెట్టిన ఆందోళనను విరమించుకుని జమ్మూకు హుటాహుటిన బయల్దేరి వెళ్లారు. పూంఛ్ జిల్లాలోని సురన్‌కోట్ తెహసీల్ ప్రాంతంలో ఎక్కువ విధ్వంసం జరిగింది. ఇక్కడే అధికంగా 10 మరణాలు సంభవించాయి. 9 మృతదేహాలు లభ్యమైనప్పటికీ.. కనీసం 16 మృతి చెంది ఉండే అవకాశం ఉందని పూంఛ్ డిప్యూటీ కమిషనర్ అశోక్ కుమార్ శర్మ తెలిపారు. జమ్మూ కశ్మీర్‌లోని రియాస్ జిల్లాలో వర్షాలవల్ల మాతా వైష్ణోదేవి యాత్రను తాత్కాలికంగా నిలిపేశారు. సురన్‌కోట్ తెహసీల్ ప్రాంతంలో సంభవించిన మేఘ విస్ఫోటం మహమ్మద్ లతీఫ్ అనే ఒక వ్యక్తి జీవితంలో ఊహించనంత విషాదాన్ని నింపింది. భారీ వర్షం కారణంగా ఆయన తన వాహనాన్ని సురక్షిత ప్రాంతంలో పార్క్ చేయడానికి బయటకు వెళ్లి తిరిగి వచ్చేసరికి.. ఆయనకు చెందిన మూడంతస్తుల భవనం మట్టి, బురదలో కూరుకుపోయింది. దీంతో అందులోని 8 మంది కుటుంబసభ్యులు మరణించారు. లతీఫ్‌తో పాటు అతని పెద్ద కుమారుడు మాత్రమే బతికి బట్టకట్టారు. ప్రమాదం సమయంలో లతీఫ్ కుమారుడు జమ్మూలో ఉన్నారు.

**అసోంను ముంచెత్తిన వరదలు**

గౌహతి:అస్సాంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు జనజీవనం స్తంభించింది. భారీ వానల కారణంగా ఇప్పటివరకు 10 మంది మృతిచెందగా, లక్షల మంది నిరాశ్రయులయ్యారు. వర్షాలకు అస్సాం రాష్ట్రవ్యాప్తంగా 16 జిల్లాల్లో 794 గ్రామాలు ప్రభావితమయ్యాయి. శివసాగర్, చరైడియో, జోర్హాట్, దిబ్రూఘర్, సోనిత్‌పూర్, బిస్వనాథ్, గోలాఘాట్, ధేమాజీ, తిన్‌సుకియా, నాగావ్, కర్బీ అంగ్లాంగ్, కాచర్, ఉదల్‌గురి, చిరాంగ్, కమ్‌రూప్, కమ్‌రూప్ (మెట్రో) జిల్లాలు ఎక్కువగా దెబ్బతిన్నాయి. ఆయా జిల్లాల్లో మొత్తం 3.62 లక్షల మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సహాయక బృందాలు రంగంలోకి దిగి బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నాయి. అధికారులు 101 సహాయక శిబిరాలను ఏర్పాటు చేసి నిరాశ్రయులకు ఆశ్రయం కల్పిస్తున్నారు. మరోవైపు భారీ వర్షాలతో నదులకు వరదనీరు పోటెత్తుతోంది. నేమతిఘాట్ వద్ద బ్రహ్మపుత్ర, చెనిమారి (ఖోవాంగ్) వద్ద బుర్హిదిహింగ్, నాంగ్లామురాఘాట్ వద్ద దిసాంగ్, నుమాలిగఢ్ వద్ద ధన్‌సిరి (దక్షిణ), శివసాగర్ వద్ద దిఖౌ నదులు ప్రమాద స్థాయికి మించి ప్రవహిస్తున్నాయి. భారీ వర్షాలకు వరదనీరు జనావాసాల్లోకి వచ్చింది. ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే అనేక రోడ్లు దెబ్బ తిన్నాయి. వర్షాలకు రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. దాదాపు 19,100 హెక్టార్లలో పంటలు నీట మునిగాయి. మరోవైపు, అస్సాంలోని కొన్ని ప్రాంతాల్లో మరింత వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ మేరకు చెరువులు, నదుల నీటిమట్టాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. అలాగే ప్రమాదకర ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎప్పటికప్పుడు అధికారుల సూచనలను పాటిస్తూ సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచిస్తున్నారు.

**సిక్కింలో ఘోర విషాదం**

**నిర్మాణంలో ఉన్న సొరంగంపై విరిగిపడ్డ కొండచరియలు**

**పదిమంది కార్మికుల దుర్మరణం**

గ్యాంగ్‌టక్: సిక్కింలో ఘోర విషాదం చోటుచేసుకుంది. దక్షిణ సిక్కింలోని సమర్‌దుంగ్ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న సొరంగం వద్ద కొండచరియలు విరిగిపడటంతో ఘోర ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ఇప్పటివరకు పదిమంది మృతిచెందారు. వారి మృతదేహాలను వెలికితీసినట్లు అధికారులు వెల్లడించారు. మరో 20 మందికిపైగా కార్మికులు శిథిలాల కింద చిక్కుకుని ఉండవచ్చని అంచనా వేస్తున్నారు.

## తప్పుడు ప్రచారంతో లబ్ధికి బీఆర్ఎస్ కుట్ర

కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అందరూ శ్రద్ధతో పాల్గొనవలసిందిగా ఆదేశాలు ఇవ్వడం జరిగింది. ?నేను ఈ విజ్ఞప్తి ద్వారా హుజూర్ నగర్ నియోజకవర్గంలో ప్రతి నాయకుడికి, కార్యకర్తకి మరోసారి విజ్ఞప్తి చేస్తున్నాను. మీ వార్డులలో,మీ గ్రామాలలో, మీ పట్టణాలలో ఓటరు జాబితా సవరణ క్రింద నూటికి నూరు శాతం ఓటర్స్ ఎన్యుమరేషన్ ఫామ్స్ నింపి భర్తీ చేసే విధంగా మీరు ఈరోజు, రేపు కార్యక్రమం పూర్తి చేయవలసిందిగా మరోమారు విజ్ఞప్తి చేస్తున్నాను. ఇవాళ రాత్రి 8 గంటలకు నేను హుజూర్ నగర్ లోని నా కార్యాలయంలో మీ అందరితో, ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఈ విషయాన్ని సమీక్ష చేయబోతున్నాను. అప్పటివరకు మీరు పూర్తి చేయవలసిందిగా నా సవినయ విజ్ఞప్తి అంటూ ఉత్తమ్ కోరారు.

## ఎడతెరిపి వర్షాలతో కేకే ఓసీలో స్తంభించిన బొగ్గు ఉత్పత్తి

డ్రిల్లింగ్ యంత్రాలు పూర్తిస్థాయిలో పనిచేయలేకపోతున్నాయని అధికారులు తెలిపారు. భద్రతా కారణాల దృష్ట్యా కొన్ని ప్రాంతాల్లో పనులను పూర్తిగా నిలిపివేసినట్లు పేర్కొన్నారు. సోమవారం రాత్రి షిఫ్ట్‌తో పాటు మంగళవారం ఉదయం, మధ్యాహ్నం షిఫ్ట్‌లలో కూడా ఉత్పత్తి కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వర్షాలు ఇదే విధంగా కొనసాగితే రాత్రి షిఫ్ట్‌లపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాలు తగ్గిన వెంటనే గనిలో పేరుకుపోయిన నీటిని భారీ మోటార్ల సహాయంతో బయటకు పంపించి, యంత్రాలను తిరిగి పనిచేసేలా చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు. సాధారణ పరిస్థితులు నెలకొన్న వెంటనే ఉత్పత్తిని పునరుద్ధరించి, కోల్పోయిన ఉత్పత్తిని భర్తీ చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తామని వెల్లడించారు. వర్షాల కారణంగా ఉత్పత్తి నిలిచిపోవడం వల్ల సంస్థ ఆదాయంపై ప్రభావం పడటమే కాకుండా, బొగ్గు సరఫరా ప్రణాళికలపైనా కొంత మేర ప్రభావం చూపే అవకాశముందని గనుల వర్గాలు పేర్కొంటున్నాయి. వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తేనే ఉత్పత్తి పూర్తిస్థాయిలో పునరుద్ధరించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

**శ్రీరాంపూర్ లోనూ బొగ్గు ఉత్పత్తికి ఆటంకం**

రెండురోజులుగా కురుస్తున్న భారీ వర్షంతో శ్రీరాంపూర్ ఏరియా సింగరేణి ఎస్ఆర్పి ఓసీపీ 2, ఇందారం ఓసీపీల్లోని బొగ్గు ఉత్పత్తికి తీవ్ర ఆటంకం ఏర్పడింది. రవాణా రహదారులు బురదమయంగా మారడంతో ఓసీపీ క్వారీలోకి కాంట్రాక్టు సంస్థల వాహనాలు వెల్లలేని పరిస్థితితో మట్టి తీయలేని పరిస్థితి నెలకొంది. శ్రీరాంపూర్ ఓసీపీలో సోమవారం 2వ షిఫ్ట్ నుంచి బొగ్గు ఉత్పత్తి, మట్టి తొలగింపు నిలిచిపోయింది. మంగళవారం కూడా వర్షం తగ్గకపోవడంతో శ్రీరాంపూర్ ఓసీపీలో దాదాపురోజుకు 12వేల టన్నులు, ఇందారం ఓసీపీలో 60వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలిగింది. ఉత్పత్తి కొనసాగడానికి యాజమాన్యం నిల్వ నీటిని తరలింపుకు మోటార్ పంపులు ఏర్పాటు చేసి నీటిని ఉపరితలానికి తరలిస్తున్నారు.

# కొడంగల్ అభివృద్ధిపై సీఎం సుడిగాలి పర్యటన

స్థాయిలో కూర్చుని భూసేకరణ పూర్తి చేయాలని తెలిపారు. కొడంగల్ నియోజకవర్గంలో ఎడ్యుకేషన్ హబ్ ,ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేయడం వల్ల హైదరాబాద్ నుండి కూడా విద్యార్థులు ఇక్కడికి వచ్చి చదువుకునేందుకు అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. ఇందుకు రోడ్లు, మౌలిక సదుపాయాలన్ని కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. బొంబాయి -పూణే కనెక్టివిటీ మాదిరిగానే శంషాబాద్ ఎయిర్పోర్ట్ నుండి కొడంగల్ కనెక్టివిటీ రోడ్డు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. హకీంపేట్ ఎడ్యుకేషన్ హబ్ లో సుమారు 7 వేల మంది విద్యార్థులు చదివే అవకాశం ఉందని ఆయన అన్నారు. ఇండస్ట్రియల్ పార్కులు, ఎడ్యుకేషన్ హబ్ కు, అన్నింటికి సంబంధించి సెప్టెంబర్ 30 లోగా కనీసం 5 వేల నుండి 10000 ఎకరాల భూమిని సేకరించాలని అధికారులను ఆదేశించారు. మక్తల్ -నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకానికి సంబంధించి అదనపు పంపుల ఏర్పాటుకు అవసరమైన సివిల్ పనులన్నింటినీ వర్క్ ఆర్డర్ ఇచ్చి పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. భూసేకరణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, సెప్టెంబర్ లోగా భూసేకరణ పూర్తి చేయాలని అవసరమైతే ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి భూ సేకరణ పూర్తి చేయాలని ఆయన తెలిపారు. రంగారెడ్డి- వికారాబాద్- నారాయణపేట ఔటర్ రింగ్ రోడ్ల నిర్మాణంలో అన్ని శాఖల సమన్వయంతో చర్చించి డిజైన్లు రూపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రోడ్ కు సంబంధించిన భూసేకరణ సెప్టెంబర్ 2026 లోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. భూసేకరణ పూర్తయిన వెంటనే టెండర్ ప్రాసెస్ మొదలు పెట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. భూసేకరణలో భాగంగా రైతులను ఒప్పించి కాన్సెంట్ అవార్డుకు వెలితే రైతులకు ఎక్కువగా నిధులు వచ్చే అవకాశముందని విషయంపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లా కలెక్టర్లు ఈ విషయంపై రైతులను సమన్వయం చేయాలని ఆయన తెలిపారు. ఆగస్టు 15,2028 లోగా పనులు పూర్తి చేసి ప్రారంభానికి చర్యలు చేపట్టాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. నియోజకవర్గంలోని 8 మండలాలలో అవసరమైన ఆర్ అండ్ బి రహదారుల మంజూరుకు ఆర్ అండ్ బి ఇంజనీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రతిపాదనలు పంపించాలని, ఆర్ అండ్ బి రహదారుల మంజూరు పూర్తికి ప్రత్యేక అధికారిని నియమించి నెల రోజులు అన్ని మండలాలలో ని రహదారులు పర్యటించి ప్రతిపాదనలు పంపాలని ఇంజనీరింగ్ అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. జూన్ 2, 2028 తర్వాత నియోజకవర్గంలో ఆర్ అండ్ బి రోడ్లపై నిధులు ఖర్చు చేద్దామన్న అవకాశం ఉండనంతగా రోడ్లను అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించారు. తనకు నియోజకవర్గం లో అన్ని రోడ్లు తెలుసననీ అవసరమైతే సందు,సందు తిరుగుతాని, నియోజకవర్గంలోని ప్రతి తండాకు రోడ్డు ఉండాలని ఆయన తెలిపారు. ఎంపిపిలు, జెడ్ పిటిసి లు ఉన్నప్పుడు మండల సర్వసభ్య సమావేశాలు నిర్వహించినట్టుగానే వికారాబాద్, నారాయణ పెట్ 2 జిల్లాలలో ఎంపిడివో లతో మండల సర్వసభ్య సమావేశాలు నిర్వహించాలని

ఈ సమావేశాలకు సర్పంచులను పిలిచి వారికి అన్ని విషయాలపై అవగాహన కల్పించాలని ఆయన తెలిపారు. మండల స్థాయి అధికారులందరు హాజరు అయ్యేలా నెల రోజుల్లో మండల సమావేశాలు జరగాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధి పనులపై నిర్వహిస్తున్న సమీక్షకు హాజరైన పరిగి, తాండూరు ఎమ్మెల్యేలు రామ్మోహన్ రెడ్డి, బుయ్యాని మనోహర్ రెడ్డి. రాష్ట్ర పంచాయతీరాజ్ ఆర్ అండ్ బి స్పెషల్ చీఫ్ సెక్రటరీ దాన కిషోర్, ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా ,రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, హౌసింగ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వి.పి గౌతమ్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ సెక్రటరీ టికే శ్రీదేవి, వైద్య ,కుటుంబ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జెడ్ చోంగ్తు , ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, ఇరిగేషన్ అండ్ కమాండ్ ఏరియా డెవలప్మెంట్ సెక్రటరీ శ్రీధర్,టీజీఐఐసి బిసి మరియు ఎండి శశాంక, కడా స్పెషల్ ఆఫీసర్ వెంకట్ రెడ్డి, రాష్ట్రస్థాయి ఇంజనీర్ ఇన్ చీఫ్ లు, సంబంధిత శాఖల హెచ్ ఓ డి లు ఉన్నారు.

## వర్షాభావాన్ని ఎదుర్కొనేందుకు సమిష్టిగా కృషిచేద్దాం

**ఎల్‌నినో పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ : మంత్రి పొంగులేటి**

హన్మకొండ,జులై 21(జనంసాక్షి):రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో సాధారణం కంటే వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మంగళవారం హనుమకొండ కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్ర రవాణా / బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలసి ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, కంటింజెన్సీ ప్రణాళికల అమలుపై సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో వర్షాభావ ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, కంటింజెన్సీ ప్రణాళికలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. వర్షాభావ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రతి ఉమ్మడి జిల్లాకు ప్రత్యేక అధికారులను నియమించగా, ఉమ్మడి వరంగల్ జిల్లాకు సీనియర్ ఐఏఎస్ అధికారి దేవసేనను నియమించినట్లు తెలిపారు. వ్యవసాయం, తాగునీటి లభ్యత, భూగర్భ జలాలు, వర్షాభావ పరిస్థితులపై ప్రత్యేక అధికారులు నివేదికలు సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తారని చెప్పారు. సమగ్ర నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపించి అవసరమైన సహాయం కోరనున్నట్లు వెల్లడించారు. జిల్లాలో అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, భూగర్భ జలాల పరిస్థితి, తాగునీటి అవసరాలకు సరిపడా నీటి లభ్యతపై వెంటనే సమగ్ర నివేదికలు సిద్ధం చేసి అందించాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు పైస్థాయి అధికారుల నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు అందరూ సమన్వయంతో పనిచేయాలని, ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టడం ద్వారానే ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడగలమని మంత్రి అన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగిస్తూ, రైతులు, అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి సామాజిక బాధ్యతతో పనిచేస్తే వర్షాభావ పరిస్థితులను విజయవంతంగా అధిగమించవచ్చని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. సమావేశంలో రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, తెలంగాణ శాసనసభ డిప్యూటీ స్పీకర్ రాంచంద్రునాయక్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ రావు, దొంతి మాధవ రెడ్డి, కడియం శ్రీహరి, కె.ఆర్. నాగరాజు, డా. మురళి నాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాశ్, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేక అధికారి, రాష్ట్ర కళాశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేన, ఉమ్మడి వరంగల్ జిల్లా కలెక్టర్లు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## వాంగ్‌చుక్‌కు ఊరట..

న్యూఢిల్లీ(జనంసాక్షి):

విద్యా వ్యవస్థలో వైఫల్యాలపై 20 రోజులకు పైగా నిరాహార దీక్ష చేస్తోన్న పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్‌ను ప్రైవేట్ ఆసుప్రతికి తరలించేందుకు దిల్లీ హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆయన ఆందోళనను విస్మరించలేమని అభిప్రాయం వ్యక్తం చేసింది. సఫ్దర్‌జంగ్ ఆసుపత్రి నుంచి మేదాంతకు తీసుకెళ్లేందుకు అంగీకరించింది. ఈ నిర్ణయంపై వాంగ్‌చుక్ భార్య గీతాంజలి ఆంగ్మో హర్షం వ్యక్తం చేశారు. వాంగ్‌చుక్ ఆరోగ్యం విషమించే ప్రమాదం ఉందని.. ప్రైవేట్ ఆస్పత్రికి తరలించాలని ఆయన భార్య గీతాంజలి వేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేపట్టింది. ఆయనను ప్రైవేటు ఆసుపత్రికి ఎందుకు తరలించకూడదని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను కోర్టు ప్రశ్నించింది. దీనిపై కేంద్రానికి ఎలాంటి అభ్యంతరం లేదని ఆయన తెలిపారు. విద్యార్థులపై పోలీసులు బలప్రయోగం చేశారని దాఖలైన పిటిషన్‌ను అత్యవసరంగా విచారించేందుకు దిల్లీ హైకోర్టు నిరాకరించింది. ఇలాంటి అన్ని విషయాల్లోకి కోర్టును లాగొద్దు అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీకే ఉపాధ్యాయ, జస్టిస్ తేజస్ కారియాలతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ పిటిషన్‌ను జులై 22న విచారిస్తామని తెలిపింది. సోమవారం నాడు జంతర్‌మంతర్ వద్ద చోటుచేసుకున్న ఘర్షణలో 178 మంది గాయపడినట్లు దిల్లీ పోలీసులు వెల్లడించారు. వీరిలో 118 మంది పోలీసు సిబ్బంది, 60 మంది నిరసనకారులు ఉన్నట్లు చెప్పారు.



## బల్కంపేట ఎల్లమ్మకు పట్టువస్త్రాలు సమర్పణ

- వైవభంగా అమ్మవారి కల్యాణోత్సవం
- ముఖ్యమంత్రి సతీమణి గీతా రెడ్డితో పాల్గొన్న మంత్రి

**హైదరాబాద్ (జనంసాక్షి) :** హైదరాబాద్‌లోని బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి దేవాలయంలో నిర్వహించిన వార్షిక కళ్యాణ మహోత్సవంలో అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ తన కూతరు సుస్మితా పటేల్‌తో కలిసి అమ్మవారికి సంప్రదాయబద్ధంగా పట్టు వస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయానికి వచ్చిన మంత్రి గారికి దేవాలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, అమ్మవారి తీర్థప్రసాదాలు, వేద ఆశీర్వచనాలు అందించారు. అనంతరం తన కూతురితో కలిసి బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళ్యాణోత్సవానికి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సతీమణి గీతా రెడ్డిని మంత్రి కొండా సురేఖ మర్యాదపూర్వకంగా కలుసుకుని బోనాల శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ బల్కంపేట అమ్మవారి కళ్యాణోత్సవానికి లక్షలాదిగా భక్తులు తరలివచ్చి ప్రభుత్వం కట్టుదిట్టంగా చేసిన ఏర్పాట్ల మధ్య అమ్మవారిని సంతోషంగా దర్శించుకుంటున్నారని అన్నారు. వర్షాలతో రాష్ట్రం పాడిపంటలతో సస్యశ్యామలంగా, సుభిక్షంగా వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించారు.

## ట్రాన్స్‌ఫార్మర్ దొంగల ముఠా అరెస్టు

- దొంగలతో స్క్రాప్ షాపు యజమానుల కుమ్మక్కు




**ఆదిలాబాద్ ప్రతినిధి, (జనంసాక్షి) :** గుట్టు చప్పుడు కాకుండా దొంగలతో కుమ్మక్కు అయి దొంగతనాలు చేయిస్తున్న స్క్రాప్షా షాపు యాజమానుల అక్రమ దందాను గుట్టు రట్టు చేశారు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్. గత సంవత్సర కాలంలో ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మరియు మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని వ్యవసాయ భూములలో రైతులకు కష్టాలు, పంట నష్టాలు కలిగించేలా ట్రాన్స్ఫార్మర్లను దొంగతనం చేస్తున్న దొంగల ముఠాను అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్. మంగళవారం స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో వివరాలను వెల్లడించారు. నిందితులు ఐదుగురు అందులో ఒక బాల నేరస్థుడు కలిసి ఒక ముఠాగా ఏర్పడి రాత్రి సమయాలలో ట్రాన్స్ఫార్మర్లను దొంగతనం చేస్తూ తక్కువ ధరకు స్క్రాప్ దుకాణ యజమానులకు అమ్ముతూ నేరాలకు పాల్పడుతున్నారని విషయాన్ని తెలిపారు. ఈ ముఠాపై ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్లో 8 కేసులు మావల పోలీస్ స్టేషన్ నందు రెండు కేసులు నమోదు అయినట్లు తెలిపారు. గతంలో ఈ ముఠా సభ్యులు జైనథ్ నందు దొంగతనాలకు పాల్పడి జైలుకు సైతం వెళ్లి వచ్చినట్లు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ దొంగలను ఎలాగైనా పట్టుకోవాలని ఉద్దేశంతో గత కొద్ది రోజుల క్రితం ఎస్పీ ఆద్వర్యంలో ప్రత్యేకంగా రెండు బృందాలను ఏర్పాటు చేసి వీరిని ఈరోజు ఉదయం పట్టుకోవడం జరిగిందని సమావేశంలో వివరాలను వెల్లడించారు. బృంద సభ్యులు దొంగతనాలకు పాల్పడి ట్రాన్స్ఫార్మర్ లో ఉన్న రాగి తీగలను తీసి తక్కువ ధరకు స్క్రాప్ దుకాణ యజమానులకు అమ్ముతూ ఉండేవారని, ఈ దుకాణ యజమానులు తక్కువ ధరకు రాగి తీగలను కొనుగోలు చేసి సొమ్ము చేసుకునేవారని, కొన్ని సందర్భాలలో ఈ దుకాణ యజమానులే దొంగలతో కుమ్మక్కై దొంగతనాలు చేసేలా ప్రోత్సహించే వారిని వివరించారు. ఈ ట్రాన్స్ఫార్మర్ దొంగల వల్ల ప్రభుత్వానికి, విద్యుత్ శాఖ కు, మరియు రైతులకు పంట రూపంలో నష్టం జరుగుతుందని తెలిపారు. వీరి వద్ద నుండి 100 కిలోల రాగి తీగను (ఒక లక్ష 50 వేల విలువ చేసి), రెండు మొబైల్ ఫోన్స్ రెండు వాహనాలను స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. కేసును చేదించడంలో కీలక పాత్ర పోషించిన రూరల్ సీఐ, రూరల్ ఎస్సై, సిబ్బంది మంగళ్ సింగ్, కరీం లను సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, రూరల్ సీఐ రహీం పాషా, రూరల్ ఎస్సై వి విష్ణువర్ధన్, సిబ్బంది మంగల్ సింగ్ మరియు అబ్దుల్ కరీం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ప్రశ్నించే గొంతులను అణచలేరు

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్త

**హైదరాబాద్ (జనంసాక్షి) :** లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంకా గాంధీతో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులను పోలీసులు అరెస్టు చేయడాన్ని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్త తీవ్రంగా ఖండించారు. విద్యార్థుల సమస్యలపై ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించిన నిరసన కార్యక్రమాన్ని అడ్డుకోవడం, కాంగ్రెస్ నాయకులను అదుపులోకి తీసుకోవడం కేంద్ర ప్రభుత్వ అసహన వైఖరికి నిదర్శనమని ఆయన అన్నారు. ప్రజల తరఫున ప్రశ్నించే ప్రతిపక్షాన్ని పోలీసు బలంతో అణచివేయాలని ప్రయత్నించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకర సంకేతమని పేర్కొన్నారు. నీట్ పరీక్షల నిర్వహణలో చోటుచేసుకున్న అవకతవకలు, పేపర్ లీకేజీ ఆరోపణలతో దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. ఈ అంశంపై బాధ్యతాయుతంగా స్పందించి దేశ ప్రజలకు స్పష్టమైన వివరణ ఇవ్వాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లకు సమాధానం చెప్పాల్సిన ప్రభుత్వం, వారిపై లాఠీచార్జీ చేయడం, వారికి మద్దతుగా నిలిచిన ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేయడం అత్యంత దురదృష్టకరమని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును హరించడం రాజ్యాంగ స్ఫూర్తిని అవమానించడమేనని అన్నారు.

నీట్ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే అరెస్టు చేసిన కాంగ్రెస్ నాయకులను ఎలాంటి షరతులు లేకుండా వెంటనే విడుదల చేయాలని కోరారు. ప్రజల హక్కులు, విద్యార్థుల భవిష్యత్తు, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని ఉప్పల శ్రీనివాస్ గుప్త స్పష్టం చేశారు.

# వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలి

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- హనుమకొండ కలెక్టరేట్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా అధికారులతో సమీక్ష




**హన్మకొండ ప్రతినిధి, జులై 21 (జనం సాక్షి) :** రాష్ట్రంలో ఎల్‌నీనో ప్రభావంతో సాధారణం కంటే వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మంగళవారం హనుమకొండ కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర రవాణా ఢ బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలసి ఎల్‌నీనో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, కంటింజెన్సీ ప్రణాళికల అమలుపై సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, తెలంగాణ శాసనసభ డిప్యూటీ స్పీకర్ రాంచంద్రునాయక్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ రావు, దొంతి మాధవ రెడ్డి, కడియం శ్రీహరి, కె.ఆర్. నాగరాజు, డా. మురళి నాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాశ్, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేక అధికారి, రాష్ట్ర కళాశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేన, ఉమ్మడి వరంగల్ జిల్లా కలెక్టర్లు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఎల్‌నీనో పరిస్థితుల నేపథ్యంలో వర్షాభావ ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, కంటింజెన్సీ ప్రణాళికలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. వర్షాభావ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రతి ఉమ్మడి జిల్లాకు ప్రత్యేక అధికారులను నియమించగా, ఉమ్మడి వరంగల్ జిల్లాకు సీనియర్ ఐఏఎస్ అధికారి దేవసేనను నియమించినట్లు తెలిపారు. దేవాదుల ప్రాజెక్టు మోటార్లు ప్రతిరోజూ పూర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, ఏదైనా లోపం తలెత్తితే 24 గంటల్లో మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశించారు. దేవాదుల ద్వారా తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అవసరమైన నిధులను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ప్రజలు, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పరిస్థితిని ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన అన్ని చర్యలు చేపడుతుందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

## వరికి ప్రత్యామ్నాయ పంటల సాగుకు రైతులను సన్నద్ధం చేయాలి

- రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వరి పంటకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను సన్నద్ధం చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎల్‌నీనో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశాల నేపథ్యంలో రైతులకు తక్కువ నీటి అవసరమయ్యే ప్రత్యామ్నాయ పంటల సాగుపై వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా లెమన్ గ్రాస్ వంటి ఆదాయాన్ని అందించే ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని తెలిపారు. వర్షాభావ పరిస్థితుల్లో పశుసంవర్ధక రంగానికి కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, పశువులకు తాగునీరు, పశుగ్రాసం కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, భూగర్భ జలాల పరిస్థితి, తాగునీటి అవసరాలకు సరిపడా నీటి లభ్యతపై వెంటనే సమగ్ర నివేదికలు సిద్ధం చేసి అందించాలని సూచించారు. రైతులు, అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి సామాజిక బాధ్యతతో పనిచేస్తే వర్షాభావ పరిస్థితులను విజయవంతంగా అధిగమించవచ్చని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా కలెక్టర్ లు వరంగల్ పోలీస్ కమిషనర్ అడిషనల్ కలెక్టర్లు ఆర్డీవోలు తహసిల్దార్లు పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు

# ఉద్యమకారుల గుర్తింపులో జర్నలిస్టులకు ప్రాధాన్యత ఇవ్వాలి


- టీయుడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం జరిగిన మహా ఉద్యమంలో, క్రియాశీలక పాత్రను పోషించిన జర్నలిస్టులను ఉద్యమకా రులుగా గుర్తించి, వారి సేవలకు, త్యాగానికి తగిన గౌరవం ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయుడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ కోరారు. మంగళవారం నాడు ట్యాంక్ బండ్ లోని తెలంగాణ అమర జ్యోతిలో, తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, గౌరవం, సంక్షేమంపై, జర్నలిస్టులతో ఉద్యమ గుర్తింపు కమిటీ నిర్వహించిన సంప్రదింపుల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా విరాహత్ అలీ మాట్లాడుతూ ఉద్యమ సమయంలో జర్నలిస్టులు కేవలం వార్తలను సేకరించి ప్రచారం చేసే బాధ్యతకే పరిమితం కాలేదని, తెలంగాణ ప్రజల ఆకాంక్షను, ఆవేదనను, ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి తెలియజేస్తూనే, ప్రత్యేక రాష్ట్ర ఆవశ్యకతను, వాస్తవాలను ప్రజలకు చేరవేసి ఉద్యమానికి నైతిక బలం చేకూర్చడం వంటి కీలక బాధ్యతలను నిర్వర్తించారని ఆయన అన్నారు. తెలంగాణ ప్రాంత ప్రజలు ఎదుర్కొన్న వివక్షను, సామాజిక-ఆర్థిక అసమానతలను, ప్రాంతీయ అన్యాయాలను దేశవ్యాప్తంగా చర్చకు తీసుకువచ్చారన్నారు. అనేక ప్రాంతాల్లో జర్నలిస్టులు ఉద్యమకా రులతో కలిసి ర్యాలీలు, ధర్నాలు, నిరసన కార్యక్రమాల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నా రని, పలుచోట్ల ఉద్యమ జాయింట్ యాక్షన్ కమిటీలకు నాయకత్వం వహించారని ఆయన గుర్తుచేసారు. ఉద్యమ సమయంలో పోలీసులు జర్నలిస్టులపై లాఠీచార్జీలు జరిపిన సంఘటన లు ఎన్నో చోట్ల చోటుచేసుకు న్నాయని, ఉద్యమానికి కేంద్రంగా ఉన్న ఉస్మానియా యూనివర్సిటీతో పాటు పలు చోట్ల పోలీసులు కెమెరాలను ధ్వంసం చేయడం, వార్తా సేకరణను అడ్డుకోవడం, జర్నలిస్టులపై తప్పుడు కేసులు నమోదు చేయడం, బెదిరింపులకు పాల్పడడం, గాయపర్చడం వంటి అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నార న్నారు. అయినప్పటికీ విధినిర్వహణలో జర్నలిస్టులు వెనుకడుగు వేయలేదని, తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా ఉద్యమాన్ని ప్రపంచానికి చాటిచెప్పే బాధ్యతను నిర్వర్తించారన్నారు. అలాగే ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొన్నం దుకు పలువురు జర్నలిస్టులు తమ ఉద్యోగాలను కూడా కోల్పోయారని, కొందరు యాజమాన్యాల ఒత్తిళ్లను ఎదుర్కొన్నారని, మరికొందరు తెలంగాణ ఉద్యమానికి మద్దతు ఇచ్చినందుకు ఉద్యోగాలకు రాజీనా మా చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని, అయినా వ్యక్తిగత ప్రయోజనా లను పక్కనపెట్టి తెలంగాణ సమాజం కోసం తమ జీవితాలను అంకితం చేశారని విరాహత్ తెలిపారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ఉద్యమ కారుల ఎంపిక కమిటీ ఈ అంశాన్ని సానుభూ తితో పరిశీలించి, ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొని సేవలందించిన జర్నలిస్టులకు ఉద్యమకారు లుగా గుర్తింపు కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. తెలం గాణ ఉద్యమ చరిత్రలో జర్నలిస్టుల సేవలు, త్యాగాలు చిరస్థాయిగా నిలిచేలా కమిటీ న్యాయమైన నిర్ణయం తీసుకోవాలని ఆయన అభ్యర్థించారు. ఈ సందర్భంగా యూనియన్ వినతిపత్రాన్ని కమిటీ సభ్యులు ప్రొఫెసర్ కోదండరాం, రాములు నాయక్, శోభన్ రెడ్డిలకు అందించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

## సూపర్ స్టార్ అమితాబ్‌కు ఆరోగ్య సమస్య

- తాజా పోస్ట్‌పై అభిమానుల్లో ఆందోళన



**ముంబై, జూలై21 (జనంసాక్షి) :** అగ్రకథానాయకుడు అమితాబ్ బచ్చన్ తన ఆరోగ్యంపై పెట్టిన తాజా పోస్ట్ ఆయన అభిమానులను ఆందోళనకు గురి చేస్తోంది. 83 ఏళ్ల అమితాబ్ తాను ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్నట్లు తెలిపారు. ఐసీయూలో ఉండాల్సి వచ్చిందని వెల్లడించారు. అయితే, ఈ సర్జరీ ఎప్పుడు.. ఎందుకు జరిగిందనే విషయాలను మాత్రం ఆయన స్పష్టం చేయలేదు. హాస్పిటల్ వాతావరణం, వైద్యుల పర్యవేక్షణ గురించి పోస్ట్ పెట్టారు. శస్త్రచికిత్స.. ఐసీయూలో నిపుణులైన వైద్యులు.. వైద్య సిబ్బంది సంరక్షణ.. ఆ తర్వాత డిశ్చార్జ్.. ఇంటికి చేరుకోవడం.. అనే క్యాప్షన్ ఇచ్చారు. ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత కోలుకునే ప్రక్రియ అత్యంత కష్టమైనదని బిగ్‌బీ పేర్కొన్నారు. ఇంటికి చేరుకున్న తర్వాత ఎదురయ్యే సవాళ్లే అత్యంత కష్టమైనవి. శారీరకంగా, మానసికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాలి. మీరు ఒక గొప్ప విజేతగా నిలిచినా, ఏదో ఒకరోజు ఓటమి మిమ్మల్ని పలకరిస్తుంది. ఇది జీవితంలోనే అత్యంత కష్టమైన సమయం. కొందరు ధైర్యంగా దాన్ని ఎదుర్కొంటారు.. కొందరు లొంగిపోతారు. అందరూ ఆరోగ్యంగా, సంతోషంగా ఉండాలని తన బ్లాగ్‌లో రాసుకొచ్చారు. దీంతో ఆయన త్వరగా కోలుకోవాలంటూ అభిమానులు పోస్ట్‌లు పెడుతున్నారు. ప్రస్తుతం అమితాబ్ 'కల్కి' సీక్వెల్‌తో పాటు మరికొన్ని సినిమాల్లో నటిస్తున్నారు.

## రాజన్నకు ఇచ్చిన విరాళంలో తిరకాసు

- వృద్ధ దంపతుల రూ.7 లక్షల1116ల విరాళం
- అభ్యంతరం వ్యక్తం చేసిన కూతుళ్లు
- వెనక్కి ఇచ్చేయాలని అధికారులకు మొర

**వేములవాడ, జులై 21 (జనంసాక్షి) :** వేములవాడ రాజన్న ఆలయానికి అందజేసిన విరాళం విషయంలో గందరగోళం నెలకొంది. ఇచ్చిన విరాళం వెనక్కి ఇవ్వాలని ఓ వృద్ధ దంపతుల కూతుళ్లు ఆలయ అధికారులకు మొర పెట్టుకున్నారు. ఈ మేరకు డబ్బులు వెనక్కి ఇవ్వాలని కుటుంబ సభ్యులు ఆలయ అధికారులను కలిసి విన్నవించిన వ్యవహారం మంగళవారం చోటుచేసుకుంది. వేములవాడ పట్టణంలోని సుభాష్ నగర్ చెందిన పసుల లక్ష్మీనారాయణ-జనాభాయ్ వృద్ధ దంపతులకు ఏడుగురు కూతుర్లు ఉన్నారు. అయితే సోమవారం భీమేశ్వర స్వామి దర్శించుకునేందుకు వచ్చిన ఈ దంపతులు స్వామివారి నిత్య అన్నదాన సత్రానికి రూ. 7 లక్షల1116లను సోమవారం రాజన్న ఆలయ నిత్యాన్నదాన సత్రానికి విరాళంగా అందజేశారు. అయితే విరాళం అందజేసిన విషయం తెలుసుకున్న కూతుర్లు మంగళవారం కార్యాలయం చేరుకొని అభ్యంతరం వ్యక్తం చేశారు. తల్లి జనాభాయితో కలిసి కూతుర్లు ఆయన మతిస్థిమితం బాగా లేదని ఇంట్లో రూ. లక్ష మాత్రమే విరాళం అందజేస్తామని చెప్పి తీరా ఆలయానికి వచ్చాక రూ. 7 లక్షలు ఇచ్చారని పేర్కొన్నారు. ఆరోగ్య పరిస్థితి కూడా బాగా లేనందున ఆసుపత్రి ఖర్చులకు కూడా ఇంట్లో నయా పైసా లేదని అధికారులతో వాపోయారు. వృద్ధ దంపతులకోసం కనీసం మానవ కోణంలోనైనా విరాళంగా అందజేసిన డబ్బును తిరిగి ఇస్తే ఆసుపత్రికి తీసుకువెళ్లి వైద్య సేవలు అందిస్తామని కోరారు. ఇకముందు కూడా నగదు, బంగారంతో వస్తే దయచేసి మాకు సమాచారం అందించాలని, ఎట్టి పరిస్థితుల్లో ఆయననుండి ఎలాంటి విరాళాలు స్వీకరించవద్దని కూడా అధికారులను కోరారు. అయితే స్వామివారికి సమర్పించిన నగదు వెనక్కి ఇవ్వబడదని దానికి నిబంధనలు ఉంటాయని అధికారులు వారికి వివరించారు. వృద్ధ దంపతుల ఆరోగ్య అవసరాల కోసమైన నగదు ఇవ్వాలని వారు దరఖాస్తు చేసుకున్నారు.

## అత్యాచార కేసును ఛేదించిన పోలీసులు

- ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలింపు...
- చట్టం నుంచి ఎవరు తప్పించుకోలేరు : జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల...

**కడెం, జులై 21 (జనంసాక్షి) :** నిర్మల్ జిల్లా కడెం పోలీస్ స్టేషన్ లో ఓ మహిళ తమను చిన్న బెల్లాల్ గ్రామ శివారులో నర్సింగాపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు నిందితులు బలవంతంగా బలాత్కారం చేశారని కడెం పోలీస్ స్టేషన్లో సోమవారం రోజున ఫిర్యాదు చేసింది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిన్నబెల్లాల్ శివారులోని నది పరివాహక ప్రాంతంలో మహిళపై లైంగిక దాడి జరిగిన ఘటనకు సంబంధించి కడెం ఎస్సై సాయికిరణ్, ఖానాపూర్ సీఐ సత్యనారాయణ వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితులు పరారీలో ఉన్నందున జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్ ఆదేశాల మేరకు, నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బృందం వేగవంతంగా దర్యాప్తు చేపట్టి నిందితులను గుర్తించింది. దర్యాప్తులో భాగంగా నర్సింగాపూర్ (పర్కపల్లి) గ్రామానికి చెందిన బియ్యాల గంగన్న ఏ బాపన్న (తండ్రి: భూమన్న), వాలతపు పోషన్న (తండ్రి: రాజం)లను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారించగా, బాధితురాలిని బలవంతంగా సమీపంలోని చెట్ల పొదల్లోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడినట్లు అంగీకరించారు. ఈ ఘటనను గమనించిన స్థానికులు అక్కడికి చేరుకోవడంతో నిందితులు అక్కడి నుంచి పరారైనట్లు దర్యాప్తులో తేలింది. నిందితులను చట్టపరమైన ప్రక్రియ పూర్తి చేసి నేడు న్యాయస్థానం ముందు హాజరుపరచగా, న్యాయస్థానం వారిని రిమాండ్‌కు పంపించిందని పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసులు మాట్లాడుతూ... మహిళలపై నేరాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని, మహిళల భద్రతకు నిర్మల్ పోలీసులు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ఇటువంటి కేసుల్లో వేగవంతమైన దర్యాప్తుతో నిందితులను చట్టం ముందు నిలబెడతామని చట్టం నుంచి ఎవరు తప్పించుకోలేరని అన్నారు. ఎస్పీ డాక్టర్ జి.జానకి షర్మిల తో పాటు సిఐ సత్యనారాయణ, ఎస్సై సాయి కిరణ్ ఉన్నారు.

## సింగరేణి మెడికల్ బోర్డు ఫలితాలపై పునఃసమీక్ష

**కొత్తగూడెం, జులై 21 (జనంసాక్షి) :** ఈ నెల 17, 18 తేదీల్లో నిర్వహించిన కార్పొరేట్ మెడికల్ బోర్డు ఫలితాలపై పునఃసమీక్ష చేపట్టి బాధిత కార్మికులకు న్యాయం చేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) యాజమాన్యాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ పిలుపు మేరకు మంగళవారం సింగరేణి వ్యాప్తంగా అన్ని మైన్స్, విభాగాల్లో వినతిపత్రాలు సమర్పించారు. పిలుపులో భాగంగా కొత్తగూడెం ఏరియాలోని అన్ని గనులు, విభాగాల్లో ఏఐటీయూసీ నాయకులు వినతిపత్రాలు అందజేశారు.

# రక్షకుల చేతుల్లోనే రాళ్లు..?

## ప్రజాస్వామ్యానికి ప్రమాద ఘంటిక!

సంపాదకీయం

ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలు ప్రజల గొంతును వినాలి. పోలీసులు చట్టాన్ని అమలు చేయాలి. కానీ దేశ రాజధాని ఢిల్లీలో "చలో పార్లమెంట్" ఆందోళన సందర్భంగా చోటుచేసుకున్న పరిణామాలు అనేక ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. వైరల్ అవుతున్న వీడియోల్లో పోలీసులు రాళ్లు విసురుతున్నట్లు కనిపిస్తోందన్న ఆరోపణలు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీశాయి. మరోవైపు, ఆందోళనకారుల నుంచే రాళ్ల దాడి జరిగిందని పోలీసులు చెబుతున్నారు. ఈ పరస్పర ఆరోపణల మధ్య నిజం ఏదో తేల్చడం అత్యవసరం. ప్రజాస్వామ్యంలో రాజ్యాధికారం లాఠీతో కాదు, నైతికతతో నిలబడాలి. చట్టాన్ని అమలు చేసే చేతులే చట్టాన్ని అతిక్రమించాయనే అనుమానం కూడా ప్రజల విశ్వాసాన్ని కుదేలు చేస్తుంది. పోలీసులు రాళ్లు విసిరారా లేదా అన్నది దర్యాప్తు తేల్చాలి. కానీ అలాంటి అనుమానాలు ఎందుకు తలెత్తాయన్న ప్రశ్న నుంచి ప్రభుత్వం తప్పించుకోలేదు.

ప్రశ్నలు ఎన్నో ఉన్నాయి. రాళ్లు అక్కడికి ఎలా వచ్చాయి? పరిస్థితి అదుపు తప్పేంత వరకు ఎందుకు వెళ్లింది? టియర్ గ్యాస్, లాఠీచార్జ్ వంటి బలప్రయోగం తప్పనిసరి అయ్యిందా? ఉద్రిక్తతను తగ్గించే ఇతర మార్గాలు ఎందుకు ఉపయోగించలేదు? ఈ ప్రశ్నలకు సమాధానం లేకుండా "లా అండ్ ఆర్డర్" అనే ఒకే మాటతో అన్నింటినీ సమర్థించలేరు. ప్రజాస్వామ్యంలో నిరసన దేశద్రోహం కాదు. ప్రజల అసంతృప్తిని వినడం ప్రభుత్వ బాధ్యత. ప్రతి ఆందోళనను శత్రువుల దాడిలా, ప్రతి నిరసనకారుడిని అల్లరి మూకగా చిత్రీకరించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. నిరసనను అణిచివేయడానికి అధిక బలప్రయోగం జరిగిందా అనే అంశంపై స్వతంత్రంగా విచారణ జరగాలి. ఈ ఘటనపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో గానీ, హైకోర్టు మాజీ న్యాయమూర్తితో గానీ స్వతంత్ర న్యాయ విచారణ జరిపి, వైరల్ వీడియోలన్నింటినీ ఫోరెన్సిక్ పరీక్షలకు పంపాలి. తప్పు ఎవరిదైనా–పోలీసులదైనా, ఆందోళనకారులదైనా–చట్టం ముందు ఒకే కొలమానం ఉండాలి.

ప్రజాస్వామ్యంలో అధికారానికి మొదటి పరీక్ష జవాబుదారీతనం. చట్టాన్ని అమలు చేసే సంస్థలపై ఆరోపణలు వచ్చినప్పుడు వాటిని తోసిపుచ్చడం కాదు, పారదర్శకంగా విచారణకు ఆదేశించడం ప్రభుత్వ నైతిక బాధ్యత. ఈ ఘటనకు సంబంధించి కేంద్ర హోంశాఖ పరిధిలోని ఢిల్లీ పోలీసుల చర్యలపై తీవ్రమైన సందేహాలు తలెత్తిన నేపథ్యంలో, కేంద్ర హోం మంత్రి అమిత్ షా పార్లమెంట్‌కు , దేశ ప్రజలకు పూర్తి వివరణ ఇవ్వాల్సిన రాజకీయ బాధ్యత ఉంది. విచారణలో వ్యవస్థాపరమైన వైఫల్యం లేదా బాధ్యత నిర్ధారితమైతే, దానికి తగిన రాజకీయ, పరిపాలనా బాధ్యత వహించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి అనుగుణంగా ఉంటుంది. రాళ్లు విసిరింది ఎవరో తేలడం కంటే, చట్టంపై ప్రజల నమ్మకం దెబ్బతినకుండా కాపాడటం మరింత ముఖ్యమైనది. ప్రజాస్వామ్యంలో రాళ్లు కాదు... రాజ్యాంగమే చివరి మాట కావాలి.

# ప్రేక్షకులుగా మిగిలిపోయిన ఐక్యరాజ్యసమితి



ఫార్-రైట్, నియో-ఫాసిస్ట్, ఇస్లామోఫోబిక్ అయిన ట్రంప్ ఇరాన్‌పై చట్టవిరుద్ధమైన దురాక్రమణ యుద్ధాన్ని మళ్లీ ప్రారంభించాడు. ఇప్పుడు అది అత్యంత ఉగ్రవాద దశకు చేరుకుంది. పౌరులను మరియు ఇరాన్ చమురు ఉత్పత్తి సహా వ్యూహాత్మక మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకోవడం, ఇరాన్ ఓడరేవుల మరియు హోర్ముజ్ జలసంధి దిగ్బంధనం - ఇవన్నీ ఇరాన్‌పై భయంకరమైన విధ్వంసాన్ని కలిగిస్తున్నాయి.

ప్రపంచంలోనే అతిపెద్ద సైనిక యంత్రాంగానికి వ్యతిరేకంగా ఇరాన్ చేస్తున్న గర్వించదగిన ప్రతిఘటనలో భాగంగా, ఇరాన్ మధ్యప్రా చ్యం అంతటా ఉన్న అమెరికా సైనిక స్థావరాలపై ప్రతీకార దాడులు కొనసాగిస్తోంది. వాటికి భారీ నష్టం కలిగిస్తోంది. హోర్ముజ్ జలసంధిపై తనకు నియంత్రణ ఉందని ట్రంప్ చెప్పుకున్నప్పటికీ, ఇరాన్ దానిపై నియంత్రణను ఎన్నటికీ వదులుకోదని స్పష్టం. అంతేకాక, జూన్ 17న పాకిస్తాన్ మధ్యవర్తిత్వంతో అమల్లోకి వచ్చిన కాల్పుల విరమణ ఒప్పందంలో భాగంగా ఉన్న అన్ని మినహాయింపులను ట్రంప్ రద్దు చేశాడు.

ఇంతటి క్లిష్ట పరిస్థితిలో కూడా, ఇప్పటికే క్రియారహితంగా ఉన్న ఐక్యరాజ్యసమితి వ్యవస్థ ఒక నామమాత్రపు భవనంగా మిగిలిపోయింది. గల్ఫ్ రాచరికాలు అమెరికా సామ్రాజ్యవాదానికి, జియోనిజానికి వంతపాడే తొత్తులుగా బయటపడ్డాయి. సాధారణ యుద్ధ వ్యతిరేక ప్రకటనలకు మించి, అనేక దేశాల పాలక వర్గాలు ఏమీ చేయలేని అసమర్థులుగా బయటపడ్డాయి.

ఒకవైపు అమెరికా, మరోవైపు చైనా మరియు రష్యా మధ్య సామ్రాజ్యవాద వైరుధ్యాలు తీవ్రమవుతున్నప్పటికీ, ట్రంప్ ఇరాన్‌పై ఏకపక్ష దురాక్రమణ ఆగకుండా కొనసాగుతోంది. ఇరాన్‌కు రష్యా ప్రత్యక్షంగా సైనిక మద్దతు ఇస్తున్నట్లు నివేదికలు ఉన్నాయి. చైనా సాధారణ అమెరికా వ్యతిరేక వాక్చాటు ముసుగులో, తన స్వార్థంతోనే నడుస్తోంది. ఈ పరిస్థితిని ఉపయోగించుకుని ప్రాంతంలో తన ఆర్థిక స్థానాన్ని మరియు వాణిజ్య ప్రాప్యతను బలోపేతం చేసుకుంటోంది.

అంతర్జాతీయ కమ్యూనిస్ట్ ఉద్యమం మరియు ప్రగతిశీల శక్తులు బలహీనంగా ఉండి, అనేక ఎదురుదెబ్బలను ఎదుర్కొంటున్న ఈ అత్యంత ప్రతిచర్యాత్మక ప్రపంచ పరిస్థితిలో, ఈ అమెరికా సామ్రాజ్యవాద దాడిని ప్రపంచ కార్మిక వర్గం మరియు అణచివేతకు గురైన ప్రజల పోరాట ఐక్యతతో కూడిన రాజకీయ కార్యక్రమంతో కూడిన శక్తివంతమైన సామ్రాజ్యవాద వ్యతిరేక మరియు ఫాసిస్ట్ వ్యతిరేక ఉద్యమం ఉద్భవించడం ద్వారా మాత్రమే సవాలు చేయగలం. ఇలాంటి క్లిష్ట పరిస్థితిలో సామ్రాజ్యవాద వైరుధ్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నా, ప్రపంచ స్థాయిలో యుద్ధ వ్యతిరేక మరియు సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమం ఉండటం అత్యవసరం. స్పష్టంగా చెప్పాలంటే, ప్రపంచ కార్మిక మరియు అణచివేతకు గురైన ప్రజల పోరాటాలను సామ్రాజ్యవాదానికి మరియు వారి తొత్తులకు వ్యతిరేకంగా సమర్థవంతంగా సమన్వయం చేసి నడిపించగల రాజకీయ నాయకత్వం తప్ప మరో షార్ట్‌కట్ లేదు.

అమెరికా సామ్రాజ్యవాదం మరియు దాని తొత్తులు నశించాలి!
అన్ని రకాల సామ్రాజ్యవాదం నశించాలి!
ఇరాన్ ప్రజలతో సంఘీభావం!
ప్రపంచ కార్మికులారా, అణచివేతకు గురైన ప్రజలారా ఏకం కండి!

**అంతర్జాతీయ విభాగం**
**CPI (ML) రెడ్ స్టార్**



**చిదానందాలు**

సారా సరసం
విరహపు సు రసం
వంట్లో నీరసం
తగ్గిన పంట
వానలు లేనికాలం
రైతుల గోస
మత్తు మగువ
మకారాల మహిమ
జాగ్రత్త సుమ
భావి భారతం
విశ్వమానవ బస
శాంతి ప్రవాహం
మారణ కాండ
పసిపాపల గోడు
ఇరాన్‌లో చూడు

**రేడియమ్**
**9291527757**

# నీటి సంరక్షణే ఆహార భద్రతకు పునాది

నిన్నటి సంచిక తరువాయి



వాతావరణ మార్పుల ప్రభావం కేవలం వర్షపాతం తగ్గడానికే పరిమితం కావడం లేదు. భారత వాతావరణ శాఖ గణాంకాల ప్రకారం 1951-1980 మధ్య కాలంతో పోలిస్తే 2001-2025 మధ్య కాలంలో తీవ్రమైన వర్షాభావ సంవత్సరాల సంఖ్య గణనీయంగా పెరిగింది. 2002, 2009, 2015, 2018, 2023 సంవత్సరాల్లో దేశంలోని అనేక ప్రాంతాలు సాధారణం కంటే 15% నుంచి 25% వరకు తక్కువ వర్షపాతాన్ని నమోదు చేశాయి. అదే సమయంలో కొన్ని ప్రాంతాల్లో అతివృష్టి, మరికొన్ని ప్రాంతాల్లో అనావృష్టి ఏర్పడటం వ్యవసాయ రంగాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోంది. భారతదేశంలో మొత్తం సాగుభూమిలో సుమారు 52% భూమి ఇప్పటికీ వర్షాధార సాగుపైనే ఆధారపడుతోంది. అందువల్ల వర్షాలు విఫలమైతే ఆహార ఉత్పత్తి, రైతుల ఆదాయం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై వెంటనే ప్రభావం పడుతోంది.

ఐక్యరాజ్యసమితి ఆహార మరియు వ్యవసాయ సంస్థ అంచనాల ప్రకారం ప్రపంచ జనాభా 2050 నాటికి దాదాపు 970 కోట్లకు చేరుకునే అవకాశం ఉంది. ఈ పెరుగుతున్న జనాభాకు ఆహారం అందించాలంటే ప్రస్తుతంతో పోలిస్తే సుమారు 50%-60% ఎక్కువ ఆహార ఉత్పత్తి అవసరం అవుతుంది. అయితే భూగర్భ జలాలు తగ్గిపోవడం, సాగుభూమి విస్తీర్ణం క్షీణించడం, వాతావరణ మార్పులు, నేల సారవంతత తగ్గడం వంటి కారణాల వల్ల ఉత్పత్తి పెంచడం సవాలుగా మారుతోంది. ఒకవైపు సాగుభూమి తగ్గుతుండగా మరోవైపు జనాభా పెరుగుతుండటం భవిష్యత్తులో ఆహార భద్రతకు పెద్ద ప్రమాద సంకేతంగా మారుతోంది.

భారతదేశంలో తలసరి సాగుభూమి 1970లో సుమారు 0.34 హెక్టార్లు ఉండగా ప్రస్తుతం అది 0.12 హెక్టార్లకు పడిపోయిందని పలు అధ్యయనాలు సూచిస్తున్నాయి. ప్రతి సంవత్సరం లక్షల హెక్టార్ల వ్యవసాయ భూమి పట్టణీకరణ, పారిశ్రామికీకరణ, రహదారుల నిర్మాణం, గృహ నిర్మాణాల కోసం మారుతోంది. ఇదే సమయంలో భూగర్భ జలాల వినియోగంలో భారత్ ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉంది. దేశంలో వినియోగించే మంచినీటిలో సుమారు 85% వ్యవసాయ రంగానికే వెళ్తోంది. నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచకుండా, వర్షపు నీటి సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వకుండా భవిష్యత్తులో ఆహార సంక్షోభాన్ని నివారించడం కష్టసాధ్యమవుతుంది.

ఈ పరిస్థితులను ఎదుర్కోవడానికి పంటల వైవిధ్యీకరణ, నీటి నిర్వహణ, సూక్ష్మ నీటిపారుదల పద్ధతులు, వర్షపు నీటి సంరక్షణ, నేల ఆరోగ్య పరిరక్షణ, వాతావరణానికి అనుగుణమైన విత్తనాల అభివృద్ధి, రైతులకు శాస్త్రీయ అవగాహన వంటి చర్యలను అత్యవసరంగా అమలు చేయాల్సిన అవసరం ఉంది. లేకపోతే నేడు బీడుపడుతున్న భూములు రేపటి తరాలకు ఆహార కొరత, ధరల పెరుగుదల, పోషకాహార లోపం వంటి అనేక సమస్యలకు దారితీయవచ్చు.

భూమి మనిషికి వారసత్వంగా వచ్చిన ఆస్తి కాదు, భావితరాల నుంచి అప్పుగా తీసుకున్న అమూల్యమైన సంపద. వర్షాలు తగ్గడం, భూగర్భ జలాలు క్షీణించడం, సాగుభూములు బీడుగా మారడం వంటి పరిణామాలు కేవలం రైతుల సమస్యగా కాకుండా దేశ ఆర్థిక, సామాజిక, ఆహార భద్రతకు సంబంధించిన జాతీయ సవాలుగా గుర్తించాలి. నేడు వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేస్తే రేపు ఆహార కొరత, ధరల పెరుగుదల, పోషకాహార లోపం, నిరుద్యోగం, గ్రామీణ వలసలు మరింత తీవ్రరూపం దాల్చే ప్రమాదం ఉంది. భారతదేశంలో 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలనే లక్ష్యం విజయవంతం కావాలంటే వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడం తప్పనిసరి. నీటి నిర్వహణ, చెరువుల పునరుద్ధరణ, వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పరిరక్షణ, శాస్త్రీయ సాగు పద్ధతులు, వాతావరణ మార్పులకు అనుగుణమైన పంటల ప్రోత్సాహం, రైతులకు సాంకేతిక పరిజ్ఞానం అందించడం వంటి చర్యలను ప్రభుత్వాలు, శాస్త్రవేత్తలు, రైతులు, ప్రజలు సమిష్టిగా అమలు చేయాలి. ప్రతి చుక్క నీటిని ఆదా చేయడం, ప్రతి అంగుళం సాగుభూమిని కాపాడుకోవడం, ప్రతి రైతును నిలబెట్టడం ద్వారానే దేశ ఆహార భద్రతను శాశ్వతంగా పరిరక్షించగలం.

ప్రపంచ బ్యాంకు, ఐక్యరాజ్యసమితి, భారత వ్యవసాయ పరిశోధన మండలి వంటి సంస్థలు కూడా వాతావరణ మార్పులకు అనుగుణంగా వ్యవసాయ రంగాన్ని ఆధునికీకరించాలని సూచిస్తున్నాయి. భవిష్యత్తులో దేశ సంపద బంగారం, చమురు, ఖనిజాల్లో కాదు; సారవంతమైన నేల, స్వచ్ఛమైన నీరు, ఆహార ధాన్యాల నిల్వల్లోనే ఉంటుంది. అందువల్ల "రైతు బలపడితేనే దేశం బలపడుతుంది – వ్యవసాయం నిలబడితేనే ఆహార భద్రత నిలుస్తుంది" అనే సత్యాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించి ఆచరణలో పెట్టినప్పుడే భావితరాలకు ఆకలి లేని, సుస్థిరమైన భారతదేశాన్ని అందించగలుగుతాము.



**- డా. రక్కిరెడ్డి ఆదిరెడ్డి**
ప్రజా సంబంధాల అధికారి
యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల

ఆణి ముత్యాలు - కథ

# మాయ

నిన్నటి సంచిక తరువాయి



వాస్తవాలకూ భావాలకూ మధ్య లింకు కలుపుతూ అడిగారు ఆచార్య నాగార్జున. శంకరాచార్యగారికి తనలోని వైరుధ్యం తనకే తెల్సి వస్తూ ఉంది. కానీ తన విశ్వాసం సరైనదేనని అనిపిస్తోంది. ఆ విశ్వాసంలో ఏదో ఆదర్శం, అలౌకిక ఆనందం ఉన్నట్లుగా తోస్తోంది. దాన్ని మాటల్లో చెప్పలేకపోతున్నాడు. వంచిన తలఎత్తి విశ్వాసపూరితంగా అన్నాడు.

"నాగార్జునగారూ మీది తర్కం. కాకపోతే గతితర్కం. నాది విశ్వాసం. తర్కానికి వాస్తవిక హేతునిరూపణ అవసరం. అన్నిటినీ తర్కంతో రుజువుపరచలేం. తర్కం తాలూకు రూపానికి అందని భావాలు, వాటి ప్రమేయాలు ఉంటాయి. నేను మాయామోహాల్లో జీవిస్తున్నానన్నది వాస్తవం. అయితే ఇది మాయ అని తెలుసుకోవడం కూడా. ఈ జీవితంలో భాగంగానే సాధ్యపడింది కదా. ఆ మేరకు నేను నా ఆత్మకి భావాల్లో మాయ అంటే ఏమిటో ఎరుక కలిగే ఉన్నట్టే కదా!"

"ఆ ఎరుక కలిగినాక మీలో, మీ ఆచరణలో వచ్చిన మార్పేమీ లేకపోతే దాన్ని మీ మాటల్లోనే మాయ అంటాను. మీ జీవితం మాయ. మీ ప్రేమ మాయ. ఈ మాయ మీలోంచి తొలగిపోగానే మీ జీవితం శూన్యం అవుతుంది. మీరు శూన్యం అవుతారు. అంతేకాని ప్రేమమయంగా ఎలా మిగలగలరు?"

స్టాఫ్‌రూంలోకి గబగబా కొందరు చొచ్చుకు వచ్చిన సందడి వినిపిస్తోంది. ప్రేమ, మాయ ఆసక్తిగా వింటున్న ఆ సంభాషణ ఆగిపోయింది.

"ఇక్కడ గప్పాలు కొట్టుకుంటూ కూర్చోడానికేనా సార్ మీరు నెలనెలా జీతాలు తీసుకుంటున్నది. ఎవరో దురుసుగా వారిమీద కురికారు.

"లెక్చరర్ల దౌర్జన్యం నశించాలి" అని ఎవరో అరిచారు. స్టాఫ్‌రూం విద్యార్థులు అంటున్న ఆ నినాదంతో దద్దరిల్లి పోయింది.

"సారీ మాటల్లో పడి పదినిమిషాలు లేటైనందుకు సారీ" ఆచార్యులిద్దరూ లేచారు.

గోడవారగా నున్న ప్రేమ, మాయ అక్కణ్ణించి కదిలారు.

వారం రోజులు గడిచినా ప్రేమ మాయ గురించి, మాయ ప్రేమ గురించి ఆలోచిస్తూనే ఉన్నారు. తమకు తోచినట్టుగా చర్చిస్తూనే ఉన్నారు.

గాంధీ అంతటివాడికే నిష్కామకర్మ సాధ్యం కాలేదు. ఆయన నిష్కామంగా పనిచేస్తూ ఉంటే సుభాష్ చంద్రబోస్ కాంగ్రెసు అధ్యక్షుడైతే అంతగా అలకపాన్పు ఎక్కడం దేనికి? అంబేద్కర్ కోరి సాధించిన ఆ కమ్యూనల్ అవార్డు రద్దు చేయించి గాంధీ పూనా ఒప్పందం కోసం ఆమరణ నిరాహారదీక్ష ఎందుకు పూనుతాడు. జనకమహారాజు నిష్కామంగా రాజ్యం ఏలేవాడంటే సీతలా అందర్నీ ఎందుకు చేరదీసి సాదలేకపోయాడు. కృష్ణుడు ఏ ఒక్కరోజైనా నిష్కామకర్మ చేయగలిగాడా? అంతా ఆశాపాశాల పక్షపాత బుద్ధే గదా! ఆయన గీతలో నిష్కామకర్మ గురించి చెప్పడం హాస్యాస్పదం కాదా – వంటివెన్నో విషయాల్ని ప్రేమ, మాయ చర్చించుకున్నారు. అయినా వారికి సమాధానం దొరకలేదు.

ఒక సాయంత్రం పార్కులో కూర్చున్నారిద్దరూ! .

"ఆశయాలను నిష్కామంగా ఆచరించడమే నిష్కామకర్మ" అంది ప్రేమ.

అయితే నీ ఆశయాలను నిష్కామంగా నిర్ణయించుకున్నప్పుడే నీవన్నది కరెక్టవుతుంది" అంది మాయ. మళ్ళీ తనే అంది. "అయితే నిష్కామంగా ఆశయాల్ని నిర్ణయించుకోవడం సాధ్యమా! ఆశయం అనేదే ఒక ఆశాపాశాల కామకర్మ కదా!"

"అయితే ఏది నిష్కామకర్మ అని తెలుసుకోవడం ఎలా? బుద్ధుడు ఈ విషయంలో ఏం చెప్పాడు!" ప్రేమ మాయను అడిగింది.

"ఇలాంటి చర్చలు బుద్ధిలేని వాళ్ళ పండిత చర్చలు అని బుద్ధుడు ఈసడించాడు. ప్రేమ, ప్రజ్ఞ, కరుణ, అష్టాంగమార్గం జీవన విధానంగా ఉండాలన్నాడు." అని నిరాశగా అంది మాయ. ఆ నిరాశలో బుద్ధుడు చెప్పింది ఇంకా తనకు తృప్తిగా లేదనే భావన ఉంది.

"మనం పెళ్ళి చేస్కొన్నాక మన భర్తలకు ఈ ప్రశ్నలు వేస్తే ఏం జవాబు చెప్తారంటావు?" ఆసక్తిగా అడిగింది ప్రేమ.

భళ్ళున నవ్వింది మాయ. పార్కులో చుట్టుపక్కల కూర్చున్నవాళ్ళు ఆశ్చర్యంగా వాళ్ళవైపే చూశారు. మాయ సిగ్గుపడిపోయింది. గొంతు తగ్గించి యిలా అంది.

'వాళ్ళ మూడ్‌ని బట్టి, స్వభావాన్ని బట్టి వాళ్ళు ఏమైనా అనవచ్చు. ఏమి ప్రియా నా మీద ప్రేమ తగ్గిందా అని అడగవచ్చు. లేదా నా ప్రేమలో మాయామోహాలే తప్ప ప్రేమ లేదంటావ్ – హూ! అని ఈసడించవచ్చు. లేదా యింకేదైనా అనవచ్చు. అంతేగానీ నాలాగ నీలాగ ప్రశాంత చిత్తంతో చర్చించకపోవచ్చు. నా ఉద్దేశంలో మగవాళ్ళకు అలాంటి హృదయం ఉండకపోవచ్చుననుకుంటాను. ఉంటే చలం రమణాశ్రమానికి ఎలా వెళ్తాడు, మాయామోహం తీరినాకనైనా నిష్కామ ప్రేమ వైపు ఎదిగి ఉండేవాడు."

"మనం ఈ విషయంలో నాగార్జున సార్‌తో చర్చిస్తే మంచిదేమో" అంది ప్రేమ.

"నాకూ అదే ఆలోచన వస్తోంది" అంది మాయ.

ఓ రోజు కాలేజీ స్టాఫ్ రూంలో అడిగి టైం తీసుకుని సాయంత్రం నాగార్జున ఇంటికి వెళ్ళారు ఇద్దరూ. పదో తరగతి చదువుతున్న మేధ వారిని నవ్వుతూ పలకరించింది. వారిని కూర్చోపెట్టి అమ్మా అంటూ లోనికి ఉరికింది. సార్‌లేనట్టున్నాడు అనుకున్నారుద్దరూ. వారికి టీ యిచ్చి వారితో పాటు తనూ కూర్చుంది మేధ. మేధ తల్లి మహామాయ చేతులు తుడుచుకొని వారి ఎదుట కూర్చుంది. తనూ టీ తీసుకుంది.

"మీరేదో ప్రేమ గురించి చర్చిస్తున్నారట కదా!" నవ్వింది మహామాయ.

"సార్ మీక్కూడా చెప్పాడా ఆంటీ" అని సంతోషపడింది ప్రేమ.

"ఆయన ఏదో అర్జెంటు పనిమీద బయటకు వెళ్ళారు ఆయన. ఈ లోపు మనని చర్చించుకోమన్నారు. వెంటనే వస్తానన్నారు" అంది మహామాయ.

"ప్రేమంటే ఏమిటి?" ప్రేమ చర్చను ప్రారంభించింది.

"ప్రేమంటే ప్రేమే" అని నవ్వింది మేధ.

"ఏది మాయో తేల్చుకుంటే ఆ తర్వాత మిగిలేది ప్రేమ అన్నట్లు మాట్లాడారు శంకరాచార్య గారు" అంది ప్రేమ.

"ఏది మాయో తేల్చుకుంటే తెలిసేది మహామాయ అవుతుంది గానీ ప్రేమ ఎలా తెలుస్తుంది?" మహామాయ అంది.

"అసలు శంకరాచార్య మాయ అనే పదాన్ని వాడాలని ఎందుకనుకున్నారు" అడిగింది ప్రేమ.

"పుట్టబోయే ముందు మనుషులు తల్లి మాయలో తొమ్మిది నెలలు జీవిస్తారు. శిశువు పిండాకృతి ధరించి ప్రాణం పోసుకొని ఆరోగ్యంగా బయటి ప్రపంచానికి ప్రసవం రూపంలో వచ్చేందుకు సహకరించేది మాయ" అంది మహామాయ.

బీజం, పిండం, మాయ, ఉమ్మనీరు ప్రసవం ఎలా జరుగుతుంది అనే విషయాల మీద కొంతసేపు చర్చ సాగింది. తిరిగి ప్రేమ మీదికి చర్చ మళ్ళింది. ఆచార్య నాగార్జున లేటయినందుకు సారీ అంటూ బాత్రూంలోకి వెళ్ళాడు. అంతదాకా చర్చించిన విషయాలు అతడు వుంటే సాధ్యమై ఉండేది కావు. చర్చ సాగడానికి కావాలనే కొంతసేపు అలా వెళ్ళినట్లున్నారు అని అనుకుంది మాయ.

"శిశువుకు తల్లి కడుపులో రక్షణ యిచ్చి పెంచి పోషించేది మాయే. మనుషులు మాయా మోహాల్లో పరస్పరం కలుసుకోవడం, సహకరించుకోవడం కూడా మాయే. ఈ రెండు మాయలూ ఒకేలా ఉన్నట్టున్నాయి" ఏదో తెలిసోయినట్టు సంతోషంతో అరిచినట్లుగా అంది ప్రేమ.

"మాయ విషయం మగవాళ్ళకు అర్థం కావడం కష్టం అని నేననలేదా? శంకరాచార్య మగవాడు కనకే ఆయనకు మాయ అర్థం కాకుండా పోయింది" అంది మాయ.

నాగార్జున ముఖం తుడుచుకుంటూ వచ్చి వారితో కలిసాడు.


"మాయ అన్నదాన్లో వాస్తవం ఉంది. శంకరాచార్యకు మాయ గురించి తెలియదనుకుంటాను. ఎందుకంటే ఆయన మాయా మోహాల్లో చిక్కుకోలేకపోవడం వల్లనే ఈ సంసారిక జీవన బంధాలన్నీ మాయ అని అనడం జరిగి ఉంటుంది. ఈ మాయ మోహాల్లో చిక్కుకొని ఉంటే యిదే వాస్తవం అని ఉండేవాడేమో" అన్నాడు నాగార్జున.

"ఇంతకూ మాయ అంటే మీరేమనుకుంటున్నారు" మాయ నాగార్జునకేసి చూస్తూ అడిగింది.

"సమాజాన్ని, సామాజిక సంబంధాలను నడిపించే శక్తే మాయ. ప్రతిసామాజిక సంబంధంలో మాయ ఉంటుంది. మాయ వల్లే మనుషుల మధ్యసంబంధాలు ఆకర్షణీయం, ఆసక్తికరం అవుతున్నాయి. మాయ మనుషులను నడిపే జీవశక్తి. మాయ అనేది అయస్కాంతంలో ఉండే ఆకర్షణ వంటిది." అన్నాడు నాగార్జున.

"భక్తమీరాబాయి ప్రేమ – మాయా? ప్రేమా?" హఠాత్తుగా అడిగింది మాయ. మళ్ళీ తనే అంది. ఎందుకంటే ఆమె ఏమీ కోరుకోలేదు. మీరన్న ఆకర్షణీయ మాయలో పడలేదు. కాని భక్తితో ప్రేమించింది.

మిగితా తరువాయి
రేపటి సంచికలో..



**- బి ఎస్ రాములు**
సామాజిక తత్వ వేత్త
ఫో: 8331966987

# పత్తాలేని పిఆర్‌సి



"వాగ్దానాలు వినిపిస్తున్నాయి... సమావేశాలు జరుగుతున్నాయి... ప్రకటనలు వస్తున్నాయి... కానీ పి.ఆర్.సి. మాత్రం కనిపించడం లేదు." నేడు తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల మనసులో వినిపిస్తున్న నిశ్శబ్ద ఆవేదన ఇదే. ఒకప్పుడు ప్రతి వేతన సవరణ ఉద్యోగుల జీవితంలో కొత్త ఆశలను నింపేది. కానీ ఇప్పుడు పి.ఆర్.సి. అనే మాట ఆశ కంటే అనిశ్చితికే ప్రతీకగా మారుతోంది.

ప్రభుత్వ యంత్రాంగం సమర్థవంతంగా నడవాలంటే ఉద్యోగులే ప్రధాన బలం. "పల్లె పాఠశాల నుంచి రాష్ట్ర సచివాలయం వరకు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి జిల్లా కలెక్టర్ల కార్యాలయం వరకు ప్రభుత్వ సేవలను ప్రజలకు అందించేది ఉద్యోగులే." ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉంటూ వారి కృషి వల్లే ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరుతున్నాయి. అలాంటి ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన పి.ఆర్.సి. నిరవధికంగా ఆలస్యం కావడం సహజంగానే ఆందోళనకు దారితీస్తోంది.

గత కొన్నేళ్లుగా జీవన వ్యయం గణనీయంగా పెరిగింది. మరి ముఖ్యంగా ఇరాన్ ఇరాక్ అమెరికా యుద్ధం పరిణామాల నేపథ్యంలో నిత్యావసర వస్తువుల ధరలకు రెక్కలొచ్చి వేతన జీవి తలపై కరాల నృత్యం చేస్తున్నాయి. విద్యా ఖర్చులు, వైద్య వ్యయాలు, గృహ అద్దెలు–ప్రతి కుటుంబం ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటోంది. అయితే ఉద్యోగుల ఆదాయం మాత్రం అదే వేగంతో పెరగడం లేదు. వేతన సవరణ ఆలస్యం కావడంతోపాటు పెరుగుతున్న ద్రవ్యోల్బణం అనుగుణంగా ప్రభుత్వం ఇవ్వాల్సిన ఆరు డి ఏ లు పెండింగ్లో ఉన్నాయి. ఈ ఆరు డి. ఎ.లు మొత్తం కలిపితే పిఆర్సి ఫిట్మెంట్లో 50 శాతం వరకు ఉంటుంది. రావలసిన వీటి లోటుతో మధ్యతరగతి కుటుంబాలపై అదనపు భారం పడుతోంది.

పి.ఆర్.సి. అనేది ప్రభుత్వం ఇచ్చే దాతృత్వం కాదు. ఉద్యోగుల సేవలకు కాలానుగుణంగా ఇచ్చే న్యాయమైన గుర్తింపు. ఉద్యోగుల కొనుగోలు శక్తిని కాపాడటం, ద్రవ్యోల్బణ ప్రభావాన్ని తగ్గించడం, సేవా ఉత్సాహాన్ని పెంపొందించడం దీని ప్రధాన ఉద్దేశ్యం. కాబట్టి దీన్ని ఆలస్యం చేయడం అనేది వేలాది కుటుంబాల ఆర్థిక ప్రణాళికలను ప్రభావితం చేసే అంశం.

ఉద్యోగ సంఘాలు పలుమార్లు ప్రభుత్వ దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లాయి. వినతిపత్రాలు సమర్పించాయి. చర్చలు జరిపాయి. అయినప్పటికీ స్పష్టమైన కాలపట్టిక లేకపోవడం ఉద్యోగుల్లో అసంతృప్తిని పెంచుతోంది. అనిశ్చితి ఎప్పుడూ అసంతృప్తికి దారి తీస్తుంది; అసంతృప్తి పని సామర్థ్యాన్ని ప్రభావితం చేసే అవకాశం ఉంటుంది.

ప్రభుత్వం కూడా తనవైపు ఆర్థిక పరిమితులు, సంక్షేమ పథకాల భారం, ఆదాయ-వ్యయ సమతుల్యత వంటి సవాళ్లను ఎదుర్కొంటుందనేది వాస్తవం. కానీ ఆర్థిక క్రమశిక్షణ పేరుతో ఉద్యోగుల న్యాయమైన ఆశలను నిరవధికంగా వాయిదా వేయడం సరైన పరిష్కారం కాదు. పరిపాలనలో ఉద్యోగులు భాగస్వాములు; వారిని భాగస్వాములుగానే చూడాలి.

ప్రభుత్వం-ఉద్యోగుల సంబంధం విశ్వాసంపై నిలబడాలి. ఆ విశ్వాసాన్ని బలపరచేది పారదర్శకత. పి.ఆర్.సి.పై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ, కాలపట్టిక, అమలు విధానాన్ని ప్రకటిస్తే ఉద్యోగుల్లో ఉన్న అనిశ్చితి తొలగుతుంది. నిర్ణయం ఆలస్యం కావడం కంటే, స్పష్టత లేకపోవడమే ఎక్కువ ఆందోళన కలిగిస్తోంది.

ప్రస్తుత ప్రభుత్వం గత అసెంబ్లీ ఎన్నికల ముందు తమ ఎన్నికల మేనిఫెస్టోలో తమ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆరు నెలలోనే పిఆర్సి ని అమలు చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. కానీ ప్రభుత్వం ఏర్పడి సుమారు మూడు సంవత్సరాలు దగ్గర పడుతున్న కేవలం కమిషన్ వేసి ఎంతో ఆర్భాటంగా ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలతో సలహాలు సూచనలు లిఖితపూర్వకంగా తీసుకొని కనీసం కమిషన్ రికమండేషన్స్ కూడా బహిర్గతం చేయకపోవడం ఉద్యోగ ఉపాధ్యాయ వర్గాల్లో అనుమానాలకు తావిస్తుంది. ఈ విధంగా ప్రభుత్వాలు పిఆర్సీలు ఆలస్యం చేయడం వల్ల సుమారుగా ప్రతి ప్రభుత్వ ఉద్యోగి తమ ఉద్యోగ జీవితంలో రెండు పీఆర్సీలను కోల్పోవాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. "పత్తాలేని పి.ఆర్.సి." అనే పదబంధం కేవలం ఒక శీర్షిక కాదు; వేలాది ఉద్యోగుల మనోభావాలకు అద్దం పట్టే మాట. ఈ పరిస్థితి ఎంత త్వరగా ముగిస్తే అంత మంచిది. ఉద్యోగి గౌరవం కాపాడబడితేనే ప్రభుత్వ పరిపాలన మరింత బలపడుతుంది. ఉద్యోగి సంతృప్తిగా ఉంటేనే ప్రజా సేవలు మరింత సమర్థవంతంగా అందుతాయి. చివరగా, ఉద్యోగులు కోరేది అసాధారణమైన వరం కాదు. సమయానికి రావాల్సిన వేతన సవరణ, స్పష్టమైన నిర్ణయం, నమ్మకాన్ని పెంచే చర్యలు మాత్రమే. ప్రభుత్వం, ఉద్యోగ సంఘాలు పరస్పర చర్చల ద్వారా త్వరితగతిన పరిష్కారానికి చేరుకోవాలని ప్రతి ఉద్యోగి, ప్రతి కుటుంబం ఆశిస్తోంది. "ప్రస్తుతం ఎలినోన్ వాతావరణ పరిస్థితి ద్వారా ఏ విధంగా వేడి ఉక్క పోతతో సతమతం చేస్తుందో అదేవిధంగా పిఆర్సి కూడా ఉద్యోగ ఉపాధ్యాయ కుటుంబాలలో తీవ్ర నిరాశ వేడిని రగులుస్తుంది. ఉద్యమాల ద్వారా తెలంగాణ సాధించుకున్న ఉద్యోగ ఉపాధ్యాయ వర్గం వారికి కావలసిన పి ఆర్ సి ని కూడా ఉద్యమాలు నిర్మించి సాధించుకునే దిశగా అడుగులు ముందుకు వేస్తున్నట్టు సూచనలు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. పి.ఆర్.సి. ఫైళ్లలో కాకుండా ఉద్యోగుల జీవితాల్లో నగదు జీతం రూపకంగా కనిపించిన రోజే వారి నిరీక్షణకు నిజమైన ఫలాలు లభిస్తాయి.



**బొల్లం సునీల్ కుమార్**
రాష్ట్ర కార్యదర్శి,
తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్)

# తమిళనాడు యాత్రలో ఘోర విషాదం

**వనపర్తిలో విషాద వాతావరణం**
**ట్రక్ లారీని ఢీకొన్న ఎస్‌యూవీ ఎర్టిగా కారు**
**ఒకరి మృతి, పలువురికి గాయాలు**
**వైయంపట్టి పోలీసుల కేసు నమోదు..**



**వనపర్తి బ్యూరో (జనంసాక్షి) :** తమిళనాడుకు ఆధ్యాత్మిక యాత్రకు వెళ్లిన వనపర్తి జిల్లాకు చెందిన బృందానికి సోమవారం ఉదయం సుమారు 7గంటల ప్రాంతంలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. తిరువణ్ణామలై దర్శనం అనంతరం పలనికి వెళ్తుండగా తిరుచ్చి-దిండిగల్ జాతీయ రహదారిపై మనప్పారై సమీపంలోని వైయంపట్టి వద్ద వారు ప్రయాణిస్తున్న ఎస్‌యూవీ ఎర్టిగా (టీ ఎస్ 32 జి 6561) రోడ్డు పక్కన నిలిపి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వనపర్తి పట్టణానికి చెందిన శ్యామ్ సాగర్ (స్వామి) తీవ్రంగా గాయపడి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు.మరో ఇద్దరికీ తీవ్ర గాయాలైనట్లు, మిగతా ముగ్గురికి స్వల్ప గాయపడినట్లు సమాచారం. స్థానికులు వెంటనే అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో క్షతగాత్రులను సమీప ఆస్పత్రులకు తరలించారు. వనపర్తి మాజీ మున్సిపల్ చైర్మన్ మహేష్ తలకు, ఛాతీ భాగంలో గాయాలు కాగా, వెనుక సీటులో ఉన్న జ్ఞానేశ్వర్ తలకు గాయాలైనట్లు తెలిసింది. మిగతా వారికి స్వల్ప గాయాలు అయ్యాయని సమాచారం. తమిళనాడు పోలీసుల వివరాల ప్రకారం.. తంజావూరు నుంచి ఉడుమలై వైపు గడ్డివాముతో వెళ్తున్న ట్రక్ పొన్నంబలపట్టిలోని టోల్ ప్లాజా సమీపంలో ఆ ట్రక్కు నిలిపి ఉంచినప్పుడు, వెనుక నుంచి వచ్చిన ఒక ఎస్‌యూవీ ఎర్టిగా దానిని ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు కారు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది. తిరువారూర్ జిల్లాలోని పుదుప్పత్తూరుకు చెందిన ఎస్. సుజిత్ రాజ్ (21)ను లారీ డ్రైవర్‌గా పోలీసులు గుర్తించారు. అతనిపై అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా వాహనం నడపడం, ప్రాణాలకు ముప్పు కలిగించడం, నిర్లక్ష్యం కారణంగా మరణానికి దారితీయడం వంటి ఆరోపణలపై భారతీయ న్యాయ సంహిత (బి ఎన్ ఎస్) సెక్షన్లు 281, 125(ఏ), 106(1) కింద వైయంపట్టి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# అధికారులపై సీఎం సీరియస్..!

**అభివృద్ధి పనులపై అధికారులకు సీఎం దిశ నిర్దేశం**
**7 నెలలు గడిచిన ముందుకు సాగని పనులు**
**అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం చేస్తే సస్పెన్షన్ వేటు తప్పదు**
**భూ నిర్వాహకులకు ఇంటి ప్లాట్స్ ఇవ్వకపోవడంపై ఆగ్రహం**
**కొడంగల్ లో సీఎం అడుగడుగున అభివృద్ధి పనుల తనిఖీ**



**వికారాబాద్ జిల్లా బ్యూరో/ దుద్యాల జులై 22 (జనం సాక్షి)** వికారాబాద్ జిల్లా ,కొడంగల్ నియోజకవర్గం ,దుద్యాల మండలం ఎడ్యుకేషన్ హబ్ పనులను రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ.రేవంత్ రెడ్డి పరిశీలించారు. హకీంపేట్ ఎడ్యుకేషన్ హబ్ లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనుల పురోగతిని పరిశీలించిన అనంతరం సీఎం అధికారులపై సీరియస్ అయ్యారు.నిర్మాణ పనులు నిదానంగా సాగడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు .పనులు వేగవంతం చేయాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు.ఎడ్యుకేషన్ హబ్ లో ప్రతీ ప్రాజెక్టుకు సంబంధించి నెలవారీ పురోగతిని ఎప్పటికప్పుడు తనకు తెలియజేయాలని ఆదేశించారు.పనుల్లో అలసత్వం వహించే అధికారులపై చర్యలు తప్పవని సీఎం అధికారులను హెచ్చరించారు.నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సస్పెన్షన్ కు వెనకాడొద్దన్న సీఎం ఉన్నతాధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనులు ప్రారంభమై ఏడు నెలలు గడుస్తున్న పురోగతి లేదని ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ హబ్ మేనేజింగ్ డైరెక్టర్ గణపతి రెడ్డి పై మండిపడ్డారు. భూములు కోల్పోయిన రైతులకు ప్లాట్ల కేటాయింపులో జాప్యంపై అధికారులపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు.వచ్చే వారంలోగా ప్లాట్ల పట్టాలు లబ్ధిదారులకు అందజేయాలని ఆదేశించారు.వెటర్నరీ కళాశాల నిర్మాణ పనులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారు . ఎడ్యుకేషన్ హబ్ లో ఇంజనీరింగ్ కళాశాల, హాస్టల్స్ నిర్మాణ పనులను సీఎంపరిశీలించారు. వికారాబాద్ జిల్లా ,కొడంగల్ నియోజకవర్గం ,దుద్యాల మండలం ఎడ్యుకేషన్ హబ్ లో కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధి పనుల పై సమీక్షను ప్రారంభించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్షించారు. ముందుగాఇరిగేషన్ పై సమీక్ష ప్రారంభించారు.

కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధి పనులపై నిర్వహిస్తున్న సమీక్షకు హాజరైన పరిగి ఎం ఎల్ ఏ రామ్ మోహన్ రెడ్డి,తాండూరు ఎం ఎల్ ఏ బుయ్యాని మోహన్ రెడ్డి. రాష్ట్ర పంచాయతీరాజ్ ఆర్ అండ్ బి స్పెషల్ చీఫ్ సెక్రటరీ దాన కిషోర్,ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా ,రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, హౌసింగ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వి.పి గౌతమ్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ సెక్రటరీ టికే శ్రీదేవి, వైద్య ,కుటుంబ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జెడ్ చోంగ్తు , ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, ఇరిగేషన్ అండ్ కమాండ్ ఏరియా డెవలప్మెంట్ సెక్రటరీ శ్రీధర్,టీజీఐఐసి బిసి మరియు ఎండి శశాంక, కడా స్పెషల్ ఆఫీసర్ వెంకట్ రెడ్డి, రాష్ట్రస్థాయి ఇంజనీర్ ఇన్ చీఫ్ లు, సంబంధిత శాఖల హెచ్ ఓ డి లు ఉన్నారు. అనంతరం మక్తల్ -నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకానికి సంబంధించి అదనపు పంపుల ఏర్పాటుకు అవసరమైన సివిల్ పనులన్నింటినీ వర్క్ ఆర్డర్ ఇచ్చి పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. భూసేకరణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి. సెప్టెంబర్ లోగా భూసేకరణ పూర్తి చేయాలి. అవసరమైతే ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి భూ సేకరణ పూర్తి చేయాలి-రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు కచ్చితంగా ఆదేశాలు ఇచ్చారు.

# సీఎంఆర్ బకాయిల చెల్లించని మిలర్ల పై కొరడా

**మిల్లర్ల నుంచి రూ. 240.92 కోట్ల వసూలు**

**మెదక్ బ్యూరో, జులై 21 (జనం సాక్షి):** కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)ను పూర్తిస్థాయిలో ప్రభుత్వానికి అప్పగించని రైస్ మిల్లర్లపై ప్రభుత్వం కఠిన చర్యలకు సిద్ధమైంది. మిల్లుల వద్ద నిల్వ ఉన్న ధాన్యానికి సంబంధించిన బకాయిలను నిర్ణీత గడువులోగా చెల్లించాలని గత మే నెలలో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జీవో-7 ప్రకారం 25 రోజుల గడువులోగా జిల్లాలోని మిల్లర్ల నుంచి రూ.240.92 కోట్లకు పైగా వసూలు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. బకాయలు చెల్లించని మిల్లర్లపై అధికారులు కొరడా ఝులిపించనున్నారు.

**68 వేల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ మాత్రమే అప్పగింత:**

2022-23 రబీ సీజన్‌లో జిల్లాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా సుమారు 2.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం సేకరించింది. ఈ ధాన్యాన్ని అప్పట్లో జిల్లాలోని 80 రైస్ మిల్లులకు కస్టమ్ మిల్లింగ్ కోసం కేటాయించింది. నిబంధనల ప్రకారం మిల్లర్లు ధాన్యాన్ని బియ్యంగా మార్చి సీఎంఆర్ రూపంలో ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉండగా, ఇప్పటివరకు కేవలం 68 వేల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ మాత్రమే అందజేసినట్లు అధికారిక సమాచారం.

**ఈ-టెండర్ విక్రయంపై వివాదం:**

సీఎంఆర్ అందకపోవడంతో మిల్లుల వద్ద నిల్వ ఉన్న ధాన్యాన్ని ప్రభుత్వం 2024 జనవరిలో ఈ-టెండర్ ద్వారా క్వింటాలుకు రూ.1,991 చొప్పున విక్రయించింది. టెండర్ దక్కించుకున్న గుత్తేదారులు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కొంతమేర ధాన్యాన్ని మాత్రమే తరలించారు. కొందరు మిల్లర్ల వద్ద అదనంగా క్వింటాలుకు రూ.200 చొప్పున వసూలు చేసి ధాన్యం తరలించినట్లు ఆరోపణలు కూడా వెలువడ్డాయి. అయినప్పటికీ గుత్తేదారులు పూర్తిస్థాయిలో ధాన్యాన్ని తరలించలేకపోయారు. దీంతో మిగిలిన ధాన్యాన్ని తరలించేందుకు ప్రభుత్వం క్వింటాలుకు రూ.2,263.81 చొప్పున చెల్లించాలని నిర్ణయించింది. అయితే ఈ ధరను మిల్లర్లు వ్యతిరేకిస్తున్నారు.

**ధర విషయంలో కోర్టు ఆశ్రయించిన మిల్లర్లు:**

క్వింటాలుకు రూ.2,263.81 చెల్లించలేమని, నాలుగేళ్ల క్రితం నిల్వ ఉన్న ధాన్యానికి అంత ధర నిర్ణయించడం సరికాదని జిల్లాకు చెందిన 58 మంది రైస్ మిల్లర్లు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ముందుగా 15 శాతం మొత్తాన్ని చెల్లించాలని కోర్టు ఆదేశాలు ఇచ్చిందని మిల్లర్ల సంఘం ప్రతినిధులు పేర్కొంటున్నారు. గత నాలుగేళ్ల కాలంగా ధాన్యాన్ని కాపాడుకుంటూ వచ్చామని, గోదాముల అద్దెలు, హమాలీ చార్జీలు, నిర్వహణ ఖర్చులు భరించామని తెలిపారు. క్వింటాలుకు రూ.1,450 కంటే తక్కువ ధర నిర్ణయించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని చెప్పారు.

**వేలం ప్రక్రియకు అధికారులు సిద్ధం:**

సీఎంఆర్ అప్పగించని మిల్లర్ల నుంచి బకాయిల వసూళ్ల కోసం అవసరమైతే వేలం ప్రక్రియ చేపట్టేందుకు పౌరసరఫరాల శాఖ అధికారులు సమాయత్తమయ్యారు.జిల్లాలోని 80 రైస్ మిల్లుల నుంచి మొత్తం రూ.243.42 కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. ఇందులో ఆరుగురు డిఫాల్టర్ మిల్లర్లపై రూ.49.60 కోట్ల బకాయిలు ఉండగా, మిగిలిన 74 మిల్లుల నుంచి రూ.183.81 కోట్ల బకాయిలు వసూలు చేయాల్సి ఉంది. జీవో-7 ప్రకారం వచ్చే నెల 6వ తేదీలోగా మొత్తం బకాయిలు వసూలు చేయాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడంతో, సంబంధిత మిల్లర్లకు ఇప్పటికే అధికారులు తాఖీదులు జారీ చేసినట్లు సమాచారం.

## కొల్చారం శ్రీ సత్యసాయి ఆగ్రో ఇండస్ట్రీస్‌లో సుమారు ఏడు కోట్ల రూపాయల ధాన్యం మాయం





**సత్య సాయి ఆగ్రో రైస్ మిల్ ఇండస్ట్రీస్ లో సుమారు ఏడు కోట్ల రూపాయల విలువైన ధాన్యం మాయం :**

**జిల్లా పౌర సరఫరాల అధికారి నిత్యానంద**

విజిలెన్సు అండ్ ఎన్ఫోర్స్మెంట్ టీం, రామచంద్రాపురం, మెదక్ జిల్లా పౌర సరఫరల అధికారి, అసిస్టెంట్ పౌర సరఫరల అధికారి, ఇన్స్పెక్టర్ (సివిల్ సప్లై) వారు సంయుక్తంగా కలిసి జిల్లా లోని కొల్చారం మండలం ఉ గ్రామం లో గల శ్రీ సత్య సాయి ఆగ్రో రైస్ మిల్ ఇండస్ట్రీస్ లో తనిఖీలు చేయగా ఖరిఫ్ (2025-26) సీజన్ కి సంబదించిన 3029.960 మెట్రిక్ టన్నుల ధాన్యం (75, 749 బ్యాగులు) తక్కువగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. తక్కువగా ఉన్న 3029.960 మెట్రిక్ టన్నుల ధాన్యం యొక్క విలువ 7,17,79,752.40/- తదుపరి సదరు రైస్ మిల్ యజమాని అయిన డి . శ్రీనివాస్ పై ఈ సి యాక్ట్ -1955 కింద 6-ఏ కేసు నమోదు చేసి, తదుపరి చర్యల కొరకు మెదక్ జిల్లా కలెక్టర్కు నివేదిక సమర్పించడం జరిగిందనీ మంగళవారం ఒక ప్రకటన తెలిపారు.

# సూర్యాపేటకు రైల్వే లైన్ సాధించడమే లక్ష్యం

**రైల్వే లైన్ ఉద్యమ నిర్వహణకై నూతన కమిటీ విస్తరణ**



**సూర్యాపేట (జనంసాక్షి) :** సూర్యాపేటకు రైల్వే లైన్ సాధించాలనే లక్ష్యంతో ఏర్పాటైన రైల్వే సాధన సమితి మంగళవారం పూర్తిస్థాయి కన్వీనింగ్ కమిటీని ప్రకటించారు. ఇంతకుముందు ప్రకటించిన విధంగానే దేగల జనార్ధన్ కన్వీనర్ గా, కో కన్వీనర్ గా రాచూరి ప్రతాప్, గౌరవ సలహాదారులుగా డాక్టర్ వి.రామ్మూర్తి, లింగంపల్లి భద్రయ్య, ఎన్.అయోధ్య, చింతలపాటి చిన్నశ్రీరాములు, గౌరవ అధ్యక్షులుగా డాక్టర్ కె.రంగారెడ్డితో పాటుగా 29 మందితో సామాజికంగా వివిధ రంగాల్లో పనిచేస్తున్న వారితో రాజకీయాలకతీతంగా ఈ కమిటీని వేసినట్లు కన్వీనర్ దేగల జనార్ధన్ ప్రకటించారు.కన్వీనింగ్ కమిటీలో నూకల సుదర్శన్ రెడ్డి, డాక్టర్ ఏ.రమేష్ చంద్ర, కర్నూరపు రాజేందర్, నీల శ్రీనివాస్, గుండా హరి నారాయణ, నల్లపాటి అప్పారావు, భయ్యా మల్లికార్జున్, మామిడి అంజయ్య, బొమ్మిడి లక్ష్మీనారాయణ, అంతటి విజయ్, గండూరి కృపాకర్, అప్పం శ్రీనివాస్, యామా ప్రభాకర్, పిట్టల వెంకటేశ్వర్లు, బోనాల రవీందర్, వీరేశం సికేరా, విజయ డయాగ్నస్టిక్ శ్రీనివాస్ రెడ్డి, వెన్న చంద్రారెడ్డి, సూపర్ సైదులు, చెరుకు వెంకన్న, అన్నపర్తి పద్మ, తోట శ్యామ్ సుందర్, తల్లమల్ల హసేన్, తీకుల్ల సాయిరెడ్డి, మతకాల చలపతిరావు, యాతాకుల రాజన్న, కార్యాలయ బాధ్యులుగా అక్కినేపల్లి రాము నియమితులయ్యారు.ఈ సందర్భంగా డాక్టర్ పూర రామ్మూర్తి మాట్లాడుతూ సూర్యాపేటకు రావలసిన రైలు దారి మళ్ళించడం వల్ల ఉద్యమాలు ప్రారంభమయ్యాయని, సూర్యాపేటకు రైలు వచ్చేవరకు ఈ పోరాటాలు కొనసాగుతాయని అన్నారు.డాక్టర్ కె.రంగారెడ్డి మాట్లాడుతూ సూర్యాపేట ప్రధాన వాణిజ్య కేంద్రం అందువల్ల రైలు సాధన అవసరాన్ని మొత్తం సమాజం గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. గౌరవ సలహాదారు లింగంపల్లి భద్రయ్య మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన అధికారాన్ని వినియోగించుకోవడంలో భాగంగానే రైల్వే లైన్ ను హక్కుగా భావించాలని కోరారు.సూర్యాపేట పట్టణానికి ఉన్న ప్రాధాన్యత అన్ని రాజకీయ పక్షాలు గుర్తించాలన్నారు.కో కన్వీనర్ ప్రతాప్ మాట్లాడుతూ రెండు రకాల రైళ్లు సూర్యాపేటకు రావాల్సిందేనని అన్నారు.ఈ నెల 24న సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వాణిజ్య భవన్ చౌరస్తాలో పదివేల సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

# మట్టి డబ్బులు లక్షలు..లక్షలు మింగి మీదికేని బెదిరింపులు

**అధికారులు స్పందించి న్యాయం చేయండి**

**శివంపేట జూలై 21 జనంసాక్షి :** శివ్వంపేట మండలం సికింద్లాపూర్ గ్రామంలోని చెరువు మట్టి విక్రయానికి సంబంధించిన నగదు విషయంలో ప్రస్తుతం వివాదాలు చెలరేగుతున్నాయి. సికింద్లాపూర్ మాజీ ఉప సర్పంచ్ రామారం నర్సింలు మరికొందరు గ్రామస్తులు మంగళవారం మాట్లాడుతూ గ్రామ శివారులోని దేవుని చెరువు మట్టిని రెండున్నారా సంవత్సరాల క్రితం బయట వ్యక్తులకు విక్రయించడం జరిగిందని తెలిపారు. ఇదే చెరువులో నుంచి గ్రామానికి చెందిన దొంతిరెడ్డి రామచంద్రారెడ్డి 5 లక్షల రూపాయల మట్టిని కొనుగోలు చేశారని తెలిపారు. అదేవిధంగా మరికొంత మట్టిని బయట వ్యక్తులకు విక్రయించగా అట్టి వ్యాపారులు అప్పటి సర్పంచ్ సుధాకర్ రెడ్డికి 11 లక్షల రూపాయలు మట్టి డబ్బులు అప్పగించడం జరిగిందని తెలిపారు. ఈ నగదును తాము అడిగితే ఒక్క రూపాయి కూడా ఇవ్వం.. ఏం చేసుకుంటారో చేసుకోండి అంటూ బెదిరింపులకు పాల్పడ్డారని మాజీ ఉపసర్పంచ్ రామారం నర్సింలు, గ్రామస్తులు ఆరోపించారు. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు వెంటనే విచారణ చేపట్టి, చెరువు మట్టి విక్రయానికి సంబంధించిన ఆదాయం, ఖర్చుల వివరాలను బహిర్గతం చేసి గ్రామానికి న్యాయం చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. లేనియెడల ఎంపీడీవో కార్యాలయం, ఆ తర్వాత కలెక్టరేట్ లను ముట్టడిస్తామని గ్రామస్తులు హెచ్చరించారు.

# కబ్జాలో ఉన్న బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటాం



**కబ్జాలో ఉన్న బాధితులు వ్యవసాయతర భూమిగా మార్చుకోవాలి**
**మోమిన్‌పేట తహసిల్దార్ మునీరుద్దీన్**

**మోమిన్ పేట జూలై 21.( జనం సాక్షి) :** కబ్జాలో ఉన్న బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తాసిల్దార్ మునీరుద్దీన్ తెలిపారు. మంగళవారంమండలవరిదిలోని టేకులపల్లి గ్రామంనుఆయన సందర్శించి పరిశీలించారు. గత 50 సంవత్సరాల నుండి సర్వేనెంబర్ 437, 438, 4:40 నంబర్లలో సుమారు 50 మంది కబ్జాలో ఉన్నారు. గత 50 సంవత్సరాల క్రితం పట్టాదారు వద్ద కొనుగోలు కొనుగోలు చేశారు. అయినప్పటికీ అప్పటినుండి ఇప్పటివరకు పట్టాదారుల పేర్ల మీదనే ఆన్లైన్లో ఉండటం వల్ల, వారి వారసులు కబ్జాలో ఉన్న వారిని బెదిరించి డబ్బులు కావాలని మమ్మల్ని డిమాండ్ చేస్తున్నారని బాధితులు తాసిల్దార్ దృష్టికి తీసుకువెళ్లారు. అందుకు తాసిల్దార్ కబ్జాలో ఉన్న బాధితులు వ్యవసాయేతర భూమిగా మార్చుకోవడం వల్ల పట్టాదారులకు రైతుబంధు గాని ఎలాంటి రావు కాబట్టి బాధితులకు అట్టి భూమి పైన హక్కు ఉంటుందని, అందుకోసం బాధ్యులకు న్యాయం చేసేందుకు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ ద్వారా పంచనామా నిర్వహించి, సర్వే నిర్వహించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని రైతులకు ఆయన భరోసా ఇచ్చారు. ప్రభుత్వం నుండి అర్హులైన పేద ప్రజలకు మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శి పి ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో మీకు ఎవరైనా ఫిర్యాదు చేస్తే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన అన్నారు. గ్రామంలో సమస్యలు తలెత్తకుండా గ్రామస్తుల సమక్షంలో శాంతి యుతంగా సమన్వయంతో పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మన్మోహన్ గౌడ్, మాజీ ఎంపిటిసి భాస్కర్, జిపిఏ శ్రీనివాస్ రెడ్డి, మహేందర్ చారి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కుమార్, నరేందర్ గౌడ్, ఫయాజ్, రహమత్ అలీ, మాణిక్యం, కబ్జాలో ఉన్న బాధితులు తదితరులు పాల్గొన్నారు.

# అవమానకర వ్యాఖ్యలతో బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య



**రాజేంద్రనగర్, జూలై21 (జనంసాక్షి) :** అధ్యాపకుడు చేసిన అవమానకర వ్యాఖ్యలు, తోటి విద్యార్థులు, కళాశాల సిబ్బంది నుంచి ఎదురైన వేధింపులతో మనస్తాపానికి గురై బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వాసవి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్న వి. శ్రేయ (20) జూలై19, 20 మధ్య రాత్రి పుప్పాలగూడలోని తన నివాసంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఘటనపై నర్సింగి పోలీసులు క్రైమ్ నెం.1366/2026గా సెక్షన్ 194 బీఎన్ఎస్ఎస్ కింద కేసు నమోదు చేశారు. సంఘటనా స్థలంలో రెండు పేజీల ఆత్మహత్య లేఖను స్వాధీనం చేసుకున్న పోలీసులు, అందులో పరీక్ష సమయంలో అధ్యాపకుడు చేసిన అవమానకర వ్యాఖ్యలు, కళాశాల సిబ్బంది, తోటి విద్యార్థుల నుంచి ఎదురైన వ్యక్తిగత వేధింపుల వల్ల తీవ్ర మానసిక క్షోభకు గురై ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నట్లు తెలిపారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

**శంషాబాద్ సమీపంలోని ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డుపై ఎయిర్‌పోర్ట్ కాలనీ బ్రిడ్జి వద్ద సంచిలో వదిలివేసిన నవజాత ఆడశిశువును ఆర్జీఐఏ పోలీసులు కాపాడారు. డయల్-100 సమాచారంతో ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు ఒకటి లేదా రెండు రోజుల వయస్సు ఉన్నట్లు భావిస్తున్న శిశువును శంషాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం అమీర్‌పేటలోని శిశు విహార్‌కు పంపించారు**

# జర్నలిస్టులకు ప్రత్యేక గుర్తింపు, గౌరవం కల్పించాలి

**తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న**

**తెలంగాణ అస్తిత్వ మీడియా సంస్థలను ప్రోత్సహించాలి: అల్లం నారాయణ**





**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కలంతో కెమెరాలతో, వార్తల ద్వారా ఒకపక్క పోరాడుతూనే మరోపక్క ప్రత్యక్ష ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమ జర్నలిస్టులను గుర్తించి వారికి తగిన గుర్తింపు, గౌరవం, సంక్షేమం పథకాలు అమలు చేయాలని తెలంగాణ జర్నలిస్టు ఫోరమ్ అధ్యక్షుడు అల్లం నారాయణ కోరారు. సెక్రటేరియట్ ఎదురుగా ఉన్న తెలంగాణ అమర వీరుల స్మారక కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన తెలంగాణ ఉద్యమ కారుల గుర్తింపు కమిటీకి మంగళవారం టీజే ఎఫ్ పలు డిమాండ్లు, సూచనలతో కూడిన ఒక వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా టీజే ఎఫ్ అధ్యక్షుడు అల్లం నారాయణ మాట్లాడుతూ సమైక్యాంధ్రలో ఆంధ్రా యాజమాన్యాలు, హెచ్ ఓడిల కింద పనిచేస్తూనే, ఉద్యోగాలను సైతం ఫణంగా పెట్టి తెలంగాణ జర్నలిస్టులు తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పనిచేశారని అన్నారు. ఎన్నో అవమానాలు, వత్తిడులు, ప్రభుత్వ, పోలీసుల నిర్బంధాలను ఎదుర్కొని జర్నలిస్టులు పనిచేశారు అన్నారు. ఉద్యోగం ఉంటుందో, పోతుందో తెలియని పరిస్థితుల్లో కూడా జర్నలిస్టుల పోరాటం మరువలేనిది అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 ఏళ్లు పూర్తయినా, ఇంకా ఆంధ్రా భావజాల మీడియానే తెలంగాణలో రాజ్యమేలుతుందని, తెలంగాణ అస్తిత్వంతో కూడిన మీడియా సంస్థలను ఏర్పాటు చేయాలని, ఆదిశగా ప్రభుత్వం ఆలోచించాలని అల్లం నారాయణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీని కోరారు. అల్లం నారాయణ నాయకత్వంలో తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీకి తెలంగాణ జర్నలిస్టుల ఫోరం ప్రాధానమైన ఐదు అంశాలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు.

తెలంగాణ ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొన్న జర్నలిస్టులను అధికారికంగా తెలంగాణ ఉద్యమకారులుగా గుర్తించి, వారికి ఇళ్లు, ఇళ్ల స్థలాలు, అక్రిడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు ఇతర సంక్షేమ పథకాలు త్వరితగతిన అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకునే విధంగా సిఫారసు చేయాలని కోరారు. మీడియా రంగంలోకి కొత్తగా వచ్చే యువ జర్నలిస్టుల వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలను నిరంతరం నిర్వహించి, మీడియా అకాడమీ ద్వారా వాటిని మరింత బలోపేతం చేసేలా సిఫారసులు చేయాలన్నారు. ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన సీనియర్ జర్నలిస్టులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు కల్పించడం ద్వారా కొత్తగా ఏర్పడే మీడియా సంస్థల్లో అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సిఫారసు చేయాలని కోరారు. ఇది జర్నలిస్టుల సంక్షేమానికి దోహదపడటమే కాకుండా తెలంగాణ ప్రయోజనాల పరిరక్షణకు కూడా ఉపయోగపడుతుందని వినతిపత్రంలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాలు గడిచినా తెలంగాణ మీడియా మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందని, ఉద్యమంలో ముందుండి పోరాడిన సీనియర్ సంపాదకులు, జర్నలిస్టుల నేతృత్వంలో తెలంగాణ మీడియా హౌస్‌ల స్థాపనకు ప్రభుత్వం రూ.1,000 కోట్ల ప్రత్యేక కార్పస్ ఫండ్ ఏర్పాటు చేసేలా ప్రభుత్వానికి సిఫారసు చేయాలని కోరారు. తెలంగాణ ఉద్యమంలో కలంతో, కెమెరాతో పోరాడిన జర్నలిస్టుల సేవలకు తగిన గౌరవం, గుర్తింపు, భద్రత కల్పించడం ద్వారా మాత్రమే తెలంగాణ ఉద్యమ స్ఫూర్తికి నిజమైన గౌరవం చెల్లించినట్లవుతుంది. ఈ వినతులను సానుకూలంగా పరిశీలించి ప్రభుత్వానికి తగిన సిఫారసులు చేయాలని కోరారు. ఉద్యమ కారుల గుర్తింపు కమిటీకి వినతిపత్రం ఇచ్చిన వారిలో అల్లం నారాయణతో పాటు సీనియర్ సంపాదకులు కె.శ్రీనివాస్, టీజెఎఫ్ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, టీజెఎఫ్ రాష్ట్ర నాయకులు ఎ.రమణ కుమార్, టీయూడబ్ల్యూ జె రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతీ సాగర్, కోశాధికారి పి.యోగనంద్, తెలంగాణ ఫోటో జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్, ప్రధాన కార్యదర్శి యాదగిరి గౌడ్ లతో పాటు పలువురు జర్నలిస్టు సంఘం నాయకులు పాల్గొన్నారు.

# శంషాబాద్‌లో డీజిల్ దొంగల కలకలం

**శంషాబాద్, జూలై21(జనం సాక్షి) :** శంషాబాద్ ఆటోనగర్‌లో డీజిల్ దొంగతనం ఘటన శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.పోలీసుల వివరాల ప్రకారం.. ఆటోనగర్‌లోని షానవాజ్ అహ్మద్ మెకానిక్ షెడ్‌లో మరమ్మతుల కోసం నిలిపిన అశోక్ లేలాండ్ టిప్పర్ టిఎస్15యుఇ6336 నుంచి గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులు సుమారు 150 లీటర్ల డీజిల్‌ను దొంగిలించారు. అర్ధరాత్రి శబ్దం విని బయటకు వచ్చిన షెడ్ నిర్వాహకుడు వారిని ప్రశ్నించగా, వారు ఏపి30ఎఎ4816 నంబర్ గల కారులో పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు శంషాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# రాంగ్ రూట్లో లారీ.. డ్రైవర్ పట్టివేత




**శంషాబాద్, జూలై21 (జనంసాక్షి) :** తప్పు దిశలో ఆర్ఎంసీ లారీ నడిపిన డ్రైవర్‌ను ఆర్జీఐఏ ట్రాఫిక్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఔటర్ రింగ్ రోడ్డుపై రెడీ మిక్స్ కాంక్రీట్ ఆర్ఎంసీ లారీ టిఎస్08యుఎచ్8667 ను రాంగ్ డైరెక్షన్‌లో నిర్లక్ష్యంగా నడుపుతూ ఇతర వాహనదారుల ప్రాణాలకు ప్రమాదం కలిగించిన వీడియో సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో వైరల్ అయింది. దీంతో విచారణ చేపట్టిన ఆర్జీఐఏ ట్రాఫిక్ పోలీసులు డ్రైవర్ లవ్‌కుష్ కుమార్ (22)ను గుర్తించి అదుపులోకి తీసుకుని, తదుపరి చట్టపరమైన చర్యల కోసం శంషాబాద్ లా అండ్ ఆర్డర్ పోలీసులకు అప్పగించారు.

# ఓటర్ల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలి

- ప్రజావాణి ఆర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి
- పిడిఎస్ బియ్యం పక్కదారి పట్టకుండా తరచూ తనిఖీలు చేయాలి
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**గద్వాల నడిగడ్డ, జూలై 21 (జనం సాక్షి) :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు సంబంధించి ఓటర్ల వివరాల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ఎస్ఐఆర్‌పై మంగళవారం రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి హైదరాబాదు నుంచి సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ లో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎలక్ట్రోరల్ ఓటర్ జాబితాలో తప్పిదాలకు చోటు లేకుండా పారదర్శకంగా రూపొందించి అర్హులైన ఓటర్ల అందరికీ ఓటు హక్కు కల్పించడమే ధ్యేయంగా కేంద్ర ఎన్నికల సంఘం ఎస్ఐఆర్ ప్రక్రియను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. మొదట ఇంటింటి సర్వే నిర్వహించి ఎన్యుమరేషన్ పత్రాలను ప్రతి ఓటరుకు అందజేసినందున సకాలంలో పూరించి ఇచ్చేలా పెద్ద ఎత్తున ప్రచారం కల్పించాలన్నారు.




ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత జిల్లా అధికారులతో కలిసి వీసీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ వీసీ అనంతరం వివిధ మండలాల తహసిల్దార్లు, ఇతర అధికారులతో మాట్లాడారు. జిల్లాలో ఇప్పటివరకు 79.75 శాతం డిజిటలైజేషన్ పూర్తి చేశారని, నిర్దేశిత గడువులోగా వంద శాతం పూర్తయ్యేలా ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. గద్వాల అర్బన్ లో 61 శాతం మాత్రమే డిజిటలైజేషన్ జరిగిందని, వార్డు అధికారులు, ఇతర వాలంటీర్ల సహకారం తీసుకొని ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ నిబంధనల ప్రకారం ఉండాలన్నారు. వలస వెళ్లిన, మృతి చెందిన, రెండు ఓట్లు కలిగిన ఓటర్ల వివరాలను రీవెరిఫికేషన్ చేసి ఓటరు జాబితాను తప్పులు లేకుండా పారదర్శకంగా రూపొందించాలన్నారు.

ప్రజావాణి ఆర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

సీఎం, జిల్లా ప్రజావాణికి వివిధ సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన ఆర్జీలను పెండింగ్ లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. విసి అనంతరం కలెక్టర్ అధికారులతో వివిధ అంశాలపై మాట్లాడారు. ప్రతి బుధవారం సంబంధిత శాఖల జిల్లా అధికారులు తమ సిబ్బందితో సమావేశాలు నిర్వహించి ప్రజావాణి పెండింగ్ దరఖాస్తుల క్లియరెన్స్ కు కృషి చేయాలన్నారు. భూభారతి, సాదా బైనామా, తదితర దరఖాస్తులు పెండింగ్ లో ఉంచకుండా త్వరితగతిన పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. రేషన్ దుకాణాలను తరచూ తనిఖీ చేస్తూ పిడిఎస్ బియ్యం పక్కదారి పెట్టకుండా నిఘా ఉంచాలన్నారు. తహసిల్దార్ లు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ వివిధ ధ్రువపత్రాలను నిబంధనల ప్రకారం జారీ చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధు మోహన్, ఆర్డీవో శ్రీనివాసరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి, రాజ్ కుమార్, ఎన్నికల విభాగం అధికారి మంజుల, వివిధ మండలాల తహసిల్దార్లు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించిన చిన్నారులను అభినందించిన ఎమ్మెల్యే జిఎంఆర్



**పటాన్‌చెరు, జూలై 21 (జనం సాక్షి) :** కరాటే పోటీలలో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సాధించిన చిన్నారులను పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అభినందించారు. ఇటీవల గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన కరాటే పోటీలలో బీరంగూడకు చెందిన క్రేజీ క్రూ కరాటే అకాడమీ విద్యార్థులు పాల్గొన్నారు. అద్భుతమైన ప్రదర్శనలతో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించారు. సోమవారం సాయంత్రం క్యాంపు కార్యాలయంలో చిన్నారులను జిఎంఆర్ అభినందించారు. విద్యార్థి స్థాయి నుండి క్రీడల పై ఆసక్తి పెంపొందించేలా తల్లిదండ్రులు, గురువులు ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరి రెడ్డి, సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, మల్లేష్, శివా రెడ్డి, వెంకటేష్, మేరాజ్ ఖాన్, రామచందర్, రామకృష్ణ, అకాడమీ నిర్వాహకులు సంతోష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# బాలికల విద్యాభివృద్ధికి అందరూ తోడ్పడాలి

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి బ్యూరో, జూలై 21 (జనంసాక్షి) :** బాలికల విద్యను ప్రోత్సహించేందుకు స్వచ్ఛంద సంస్థలు అండగా నిలిచి, ఉన్నత విద్యకు తోడ్పాటు అందించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. విలేజెస్ ఇన్ పార్ట్‌నర్‌షిప్ (విప్) గ్రామీణ భాగస్వామ్య స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన బాలికలకు మంగళవారం వనపర్తిలోని దాచా లక్ష్మయ్య ఫంక్షన్ హాల్లో ప్రతిభా పురస్కారాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ విజేతలకు ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులు, మొక్కలను అందజేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బాలికల విద్యాభివృద్ధి కోసం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో ప్రశంసనీయమని పేర్కొన్నారు. విద్యార్థినులు లభించిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి తమ లక్ష్యాలను సాధించాలని సూచించారు. సమాజానికి ఆదర్శంగా నిలిచేలా ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని, ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం విద్యార్థుల అభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా ఉంటాయని భరోసా ఇచ్చారు. ప్రతిభ కనబరిచిన కవిత వంటి విద్యార్థినులను స్ఫూర్తిగా తీసుకుని మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి మండలం నుంచి పదో తరగతిలో తెలుగు మాధ్యమంలో అత్యధిక మార్కులు సాధించిన 15 మంది విద్యార్థినులను ఈ సందర్భంగా సత్కరించారు. అలాగే ప్రతిభ కనబరిచిన విద్యార్థినుల తల్లిదండ్రులు, సంబంధిత పాఠశాల ఉపాధ్యాయులను కూడా ప్రత్యేకంగా సన్మానించారు. విప్ సంస్థ సహకారంతో ఉన్నత విద్యను అభ్యసించి తోటి విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచిన కవిత ప్రసంగం సభికులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య, జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ అధికారి సుధారాణి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రంజిత్ రెడ్డి, విప్ వ్యవస్థాపకులు నాగేంద్ర స్వామి తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ

- ఎస్పీ శ్రీనివాసరావు



**నర్సాపూర్, జూలై 21 (జనం సాక్షి) :** రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి.శ్రీనివాసరావు, ఐపీఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం నర్సాపూర్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఆయన, పోలీసు సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించి స్టేషన్ ఆవరణలో మొక్క నాటారు. అనంతరం పోలీస్‌స్టేషన్ పరిసరాలు, ఎఫ్ఐఆర్ రిజిస్టర్లు, క్రైమ్ రికార్డులు, కేసు డైరీలు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతిని సమీక్షించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో తరచుగా ప్రమాదాలు జరిగే బ్లాక్‌స్పాట్లను గుర్తించి సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, హెల్మెట్, సీటుబెల్ట్ వినియోగించకపోవడం వంటి ట్రాఫిక్ ఉల్లంఘనలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని సూచించారు. రాత్రి గస్తీ, పెట్రోలింగ్‌ను మరింత ముమ్మరం చేసి నేరస్తుల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని ఆదేశించారు. విలేజ్ పోలీస్ ఆఫీసర్లు తమ గ్రామాల్లో సైబర్ నేరాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎస్పీ సూచించారు. ఆన్‌లైన్, ఓటీపీ, బ్యాంకింగ్, ఫేక్ లింకుల ద్వారా జరిగే మోసాల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని, సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని ప్రజలకు తెలియజేయాలని పేర్కొన్నారు. ప్రజల భద్రత, నేరాల నియంత్రణ కోసం దుకాణాలు, వ్యాపార సముదాయాలు, ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటును విస్తృతంగా ప్రోత్సహించాలని ఎస్పీ తెలిపారు. సీసీ కెమెరాల ద్వారా నేరాల నియంత్రణతో పాటు నేరస్తులను గుర్తించడం, దర్యాప్తులో కీలక ఆధారాలు సేకరించడం సులభమవుతుందని చెప్పారు. ప్రజలు, వ్యాపారులు పోలీసు శాఖకు సహకరించి సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలని కోరారు. ఈ తనిఖీల్లో తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్, సీఐలు రంగా కృష్ణ, సందీప్ రెడ్డి, ఎస్ఐలు రంజిత్ రెడ్డి, జగన్మోహన్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్, బీఆర్ఎస్‌తోనే తెలంగాణకు అన్యాయం

- డీకే స్నిగ్ధా రెడ్డి
- కమీషన్లు ఇస్తేనే కాంట్రాక్టర్ల బిల్లులొచ్చే పరిస్థితి
- కేంద్ర నిధులతోనే గ్రామాల్లో అభివృద్ధి

**కేటీ దొడ్డి, జూలై 21 (జనం సాక్షి) :** బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల వైఫల్యాలు, వారి మధ్య నడుస్తున్న ఒప్పంద రాజకీయాల వల్లే తెలంగాణ రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందని బీజేపీ జిల్లా యువ నాయకురాలు డీకే స్నిగ్ధా రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం కేటీ దొడ్డి మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు శ్రీపాద రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన బీజేపీ మండల కార్యవర్గ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా అప్పుల్లో కూరుకుపోయిందని, ప్రస్తుతం గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులన్నీ కేవలం కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులతోనే సాధ్యమవుతున్నాయని ఆమె స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదని, కమీషన్లు చెల్లించకపోతే కాంట్రాక్టర్ల బిల్లులు కూడా రాని దుస్థితి రాష్ట్రంలో నెలకొందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ మరోసారి అధికారంలోకి రావడానికి అబద్ధపు హామీలు, జూటా మాటలతో ప్రజలను మోసం చేయడానికి సిద్ధమవుతోందని, కార్యకర్తలు ప్రజలను అప్రమత్తం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రజలు ఈ రెండు పార్టీల దుష్పరిపాలనతో విసిగిపోయారని, రాష్ట్రానికి పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన సుపరిపాలన అందించడం ఒక్క భారతీయ జనతా పార్టీ డబల్ ఇంజన్ సర్కార్‌తోనే సాధ్యమవుతుందని స్నిగ్ధా రెడ్డి పేర్కొన్నారు.



ప్రస్తుతం పార్టీ పరంగా కొనసాగుతున్న ప్రక్రియను పార్టీ శ్రేణులు బాధ్యతాయుతంగా తీసుకుని, చురుకుగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు బాబుల్ రెడ్డి, కౌన్సిలర్ శాలన్న, ఉపసర్పంచ్ ఎర్రభీం రెడ్డి, కేటీ దొడ్డి మండల సీనియర్ నాయకులు యార్సన్ దొడ్డి హనుమంతు, అశోక్, రఘు, దేవేందర్ రెడ్డి, ఉమిత్యాల కర్రెప్ప, పాగుంట సర్పంచ్ అంజనప్ప, ఉప సర్పంచ్ నర్సిరెడ్డి, కృష్ణకాంత్, కొండన్న, అంపిరెడ్డి, కుచినెర్ల నరసింహులు, రంగాపురం కృష్ణ, గోవిందు, శంకర్ నాయక్, వాచ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# రహదారి ప్రమాదాల నివారణకు కృషి చేయాలి

- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**గద్వాల నడిగడ్డ, జూలై 21 (జనం సాక్షి) :** రహదారి ప్రమాదాలతో ఏటా ఎంతో మంది మృత్యువాత పడడమే కాక క్షతగాత్రులుగా మారుతున్నారని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ రహదారి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. జాతీయ రహదారులపై రోడ్డు ప్రమాదాలపై మంగళవారం హైదరాబాద్ నుంచి బీసీ సంక్షేమ, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా రహదారుల భద్రతకు తమ వంతుగా కృషి చేస్తుందని, ఆయా జిల్లాల పరిధిలోని సంబంధిత శాఖల అధికారులు వారికి సహకరించాలన్నారు. రవాణా, పోలీస్, ఆర్ అండ్ బి, తదితర శాఖల అధికారులతో కలిసి జిల్లా రోడ్ సేఫ్టీ కమిటీలను ఎన్నుకోవాలన్నారు. జిల్లా రోడ్ సేఫ్టీ కమిటీలు, హైవే సేఫ్టీ టాస్క్ ఫోర్స్ కమిటీలతో కలిసి పని చేసేందుకు తరచూ సమావేశాలు నిర్వహించాలన్నారు. ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత శాఖల అధికారులతో కలిసి వీసీ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ వీసీ అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడారు. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా, రోడ్ సేఫ్టీ కమిటీలు ఇప్పటివరకు రహదారి



భద్రతపై నిర్వహించిన కార్యక్రమాల వివరాలను అడిగారు. హైవేలపై పెట్రోలింగ్ వాహనాల సేవలు, బ్లాక్ స్పాట్ల వద్ద తీసుకుంటున్న జాగ్రత్తలపై మాట్లాడారు. హైవే స్థలాలను ఆక్రమించి ఏర్పాటు చేసిన డాబాలు, ఇతర నిర్మాణాల యజమానులకు నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. హైవేల భద్రతకు సంబంధించి ఇదివరకు నిర్వహించిన కార్యక్రమాలు, సమావేశాలు, భవిష్యత్తులో చేయబోయే కార్యాచరణ ప్రణాళికపై ఎప్పటికప్పుడు సమగ్ర నివేదికలను సమర్పించాలని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ ఇన్చార్జి ఏవో మంజుల, నేషనల్ హైవే రేసిడెంట్ ఇంజనీర్ బాలచందర్, రవాణా, ఆర్ అండ్ బి శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పర్యాటక రంగంలో మెదక్ జిల్లా ఖ్యాతి జాతీయస్థాయికి ఎదగాలి

- జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్

**మెదక్, జూలై 21 (జనం సాక్షి) :** మెదక్ జిల్లాలో గల పర్యాటక, చారిత్రాత్మక వారసత్వ, ఆధ్యాత్మిక, అభయారణ్యాలతో పర్యాటక సర్క్యూట్ రూపొందించడం జరుగుతుంది. జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో సీనియర్ కన్సల్టెంట్స్ శవంతి గుప్తా, భువన్‌ల బృందం గత ఐదు రోజులుగా కొనసాగిన పలు పర్యాటక ప్రదేశాల సందర్శన ముగింపు తెలంగాణ పర్యాటక, సాంస్కృతిక మరియు పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు. సూచనలు సలహాలు,తెలంగాణ టూరిజం (పర్యాటక మరియు సాంస్కృతిక) శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎ. వాణీ ప్రసాద్, ప్రత్యేక చొరవ మెదక్ శాసనసభ్యులు, మైనంపల్లి రోహిత్ రావు ప్రత్యేక శ్రద్ధ, ప్రజా ప్రతినిధులు సహకారంతో పర్యాటక స్ఫూర్తితో ముందుకు పర్యాటక రంగంలో మెదక్ జిల్లా విశేష ఖ్యాతి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సోమవారం రాత్రి హవేలీ ఘన్పూర్ మండలం పోచారం అభయారణ్యంలో క్యాంప్ ఫైర్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతిమసింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ముఖ్యమంత్రివర్యులు ఆదేశాల మేరకు రాష్ట్ర పర్యాటక పురావస్తు శాఖ మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు సూచనలు సలహాలు,తెలంగాణ టూరిజం (పర్యాటక మరియు సాంస్కృతిక) శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎ. వాణీ ప్రసాద్, ప్రత్యేక చొరవ, మెదక్ నియోజకవర్గ శాసనసభ్యులు, మైనంపల్లి రోహిత్ రావు , ప్రత్యేక దృష్టితో ప్రజా ప్రతినిధులు సహకరించిన తీరు మరువలేనిదని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. మెదక్ జిల్లాలోని పర్యాటక సుందర ప్రకృతి రమణీయ వాతావరణానికి ప్రసిద్ధి చెందిన పోచారం అభయారణ్యంలో జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంప్ ఫైర్ కార్యక్రమం ఆహ్లాదకర వాతావరణంలో జరిగిందని తెలిపారు. మెదక్ జిల్లాలోని పర్యాటక, చారిత్రాత్మక వారసత్వ ఆధ్యాత్మిక అభయారణ్యాలతో ఒక సర్క్యూట్ రూపొందిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో పర్యాటక రంగ పర్యాటకశాఖ జిల్లాలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి పరచాలని ఉద్దేశంతో జిల్లాలో ఉన్న చారిత్రాత్మక ఆధ్యాత్మిక వారసత్వ కట్టడాలతో పాటుగా మెదక్ కు తల మాణికమైన పోచారం అభయారణ్యం ప్రాంతాలను అభివృద్ధిపరిచి పర్యాటక రంగంలో మెదక్ జిల్లాకు విశేష గుర్తింపులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో తీసుకురావడానికి కృషి ప్రయత్నంలో భాగంగా గత ఐదు రోజులుగా జిల్లాలోని అనేక ప్రాంతాలను జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో సీనియర్ కన్సల్టెంట్స్ శవంతి గుప్తా, భువన్ ల బృందం పర్యాటక ప్రదేశాల సందర్శన ముగింపు దశకు చేరుకున్నట్లు తెలిపారు. డీఎఫ్ఓ జోజి, జిల్లా పర్యాటక శాఖ అధికారి రమేష్ గంగాల, హవేలీ ఘనపూర్ తాహసిల్దార్ సింధు రేణుక, ఈడియం సందీప్, అధికారులు పాల్గొని ప్రకృతి అందాలను ఆస్వాదించారు. క్యాంప్ ఫైర్ చుట్టూ సమావేశమైన అధికారులు జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధి, పోచారం అభయారణ్యాన్ని మరింత ఆకర్షణీయమైన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చేపట్టాల్సిన చర్యలపై



పరస్పరం చర్చించారు.

ప్రకృతి ఒడిలో నిర్వహించిన ఈ కార్యక్రమం అందరికీ ఆహ్లాదాన్ని పంచడంతో పాటు పరస్పర సమన్వయాన్ని పెంపొందించేందుకు దోహదపడిందని అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పోచారం అభయారణ్యంలో పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించి అడవుల పరిశుభ్రతను కాపాడాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యంత్రాంగానికి చెందిన పలువురు ఉన్నతాధికారులు, అటవీ శాఖ అధికారులు, పర్యాటక శాఖ అధికారులు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను సస్పెండ్ చేయాలి

- యన్‌టిఏ సంస్థని పూర్తిగా రద్దు చేయాలి

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, జూలై 21 (జనం సాక్షి) :** మహబూబ్ నగర్ నిన్న ఢిల్లీ జంతర్ మంతర్ లో శాంతియుతంగా నిరసన చేస్తున్న విద్యార్థి నిరుద్యోగులపై లాఠీచార్జును వ్యతిరేకిస్తూ నేడు మహబూబ్ నగర్ యువజన సంఘం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్ సింగ్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ప్రశాంత్ మాట్లాడుతూ,, ఢిల్లీలో శాంతియుతంగా విద్యార్థులు నిరుద్యోగులు నిరసన కార్యక్రమం చేస్తుంటే ఆర్ఎస్ఎస్,బిజెపి, మరియు పోలీస్ లు వారిపై లాఠీచార్జ్ చేయడం తీవ్ర దుర్మార్గమైన పరిస్థితి అని అన్నారు. డిగ్రీలు,పీజీలు,చదివిన పట్టాలు వస్తున్నాయి తప్ప, పట్టాలు నిరుద్యోగ పొట్ట నింపడం లేదని తెలిపారు. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీకేజీ పై బిజెపి ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి ఆక్షన్ తీసుకోకపోవడం సిగ్గుచేటని అన్నారు. విద్యార్థి నిరుద్యోగుల పట్ల బిజెపి ప్రభుత్వం మొండి వైఖరి వహిస్తుందని అన్నారు. బిజెపి ప్రభుత్వ అధికారంలోకి వస్తే సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి నిరుద్యోగులను నమ్మించి మోసం చేసిందని తెలిపారు. దేశ వ్యాప్తంగా ఇప్పటికీ 12 కోట్ల ఉద్యోగాలు రావాల్సిన అవసరం ఉందని వారు అన్నారు. నిరుద్యోగుల విద్యార్థుల పట్ల బిజెపి సవితి తల్లి ప్రేమ చూపుతుందని వారు తెలిపారు. తక్షణమే బిజెపి ప్రభుత్వం స్పందించి కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేసి నిరుద్యోగులకు విద్యార్థులకు ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేసి న్యాయం చేయాలని తెలిపారు. లేని దేశవ్యాప్తంగా ఆందోళనకు దిగుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో సురేష్,మనోహర్, రవి,శివ,రాజు,లక్ష్మణ్,సురేందర్, తదితరులు పాల్గొన్నారు.



# అంబులెన్స్ సిబ్బంది సేవలు భేష్

- కాలిబాటన వెళ్లి డోలీలో రోగి తరలింపు!
- సిబ్బందిపై సర్వత్రా వెల్లువెత్తుతున్న ప్రశంసలు



మంగపేట జూలై 21(జనంసాక్షి) : ఏజెన్సీ మారుమూల గిరిజన ప్రాంతాల్లో కనీస రోడ్డు సౌకర్యాలు లేక గిరిజనులు పడుతున్న నరకయాతన మరోసారి వెలుగులోకి వచ్చింది. అత్యవసర సమయంలో సరైన రవాణా సౌకర్యం లేక ప్రాణాలు గాల్లో కలుస్తున్న వేళ, 108 అంబులెన్స్ సిబ్బంది మాత్రం తమ బాధ్యతను దాటి మానవత్వాన్ని చాటుకున్నారు. రోడ్డు లేని మారుమూల గ్రామానికి కాలినడకన వెళ్లి, ఓ గిరిజన యువకుడికి ప్రాథమిక చికిత్స అందించి, డోలీ సాయంతో మోసుకొచ్చి చికిత్స అందించారు. వివరాల్లోకి వెళితే మంగపేట మండలం బాలన్నగూడెం గ్రామపంచాయతీ పరిధిలో గల ప్రాజెక్టు నగర్ (గుత్తేకోయ గూడెం) గ్రామం అటవీ పరిధిలో ఉండడంతో ఆ గ్రామానికి కనీస రోడ్డు సౌకర్యం లేదు. ఆ గ్రామానికి చెందిన గొత్తికోయ యువకుడు శ్రీను అకస్మాత్తుగా తీవ్ర అనారోగ్య బారిన పడ్డాడు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకున్నారు. కానీ గ్రామానికి వెళ్లేందుకు రోడ్డు మార్గం లేకపోవడంతో అంబులెన్స్ ను ప్రధాన రహదారిపైనే నిలిపివేశారు. సమయం వృథా చేయకుండా అంబులెన్స్ ఈఎంటి రామగాని రాము, పైలెట్ మధు ఆ అడవి లో కాలిబాట గుండా నడుచుకుంటూ గ్రామానికి చేరుకొని ముందుగా రోగి శ్రీను కు అక్కడే ప్రాథమిక చికిత్స అందించారు. అతడి మెరుగైన చికిత్స అవసరమని ఎలాగైనా ఆస్పత్రికి చేర్చాలనే పట్టుదలతో గ్రామస్తుల సహాయంతో ఓ డోలీని ఏర్పాటు చేశారు. ఈఎంటి రాము, పైలెట్ మధు స్వయంగా రోగిని డోలీలో మోసుకుంటూ, కాలిబాటన నడిచి ప్రధాన రోడ్డు వద్ద సిద్ధంగా ఉన్న అంబులెన్స్ వద్దకు చేర్చారు. ఆ తర్వాత రోగిని మెరుగైన చికిత్స నిమిత్తం ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి తరలించారు. అత్యవసర సమయాల్లో వైద్యం అందడం గగనంగా మారిన ఆ గూడెం ప్రజలకు అంబులెన్స్ సిబ్బంది దేవుళ్లలా కనిపించారు. విధి నిర్వహణలో అంకితభావాన్ని ప్రదర్శించి, సమయస్ఫూర్తితో వ్యవహరించి యువకుడి ప్రాణాలు నిలబెట్టిన ఈఎంటి రాము, పైలెట్ మధులను గ్రామస్తులు అభినందించారు.

# జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు చర్యలు

- రాష్ట్ర రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్




కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జూలై 21(జనంసాక్షి) : జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని రాష్ట్ర రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్ అన్నారు. మంగళవారం హైదరాబాద్ లోని రాష్ట్ర సచివాలయం నుండి అదనపు కార్యదర్శి ఇలంబర్తి, శాంతి భద్రతల అధికారులు, రవాణా, రహదారి భవనాలు, జాతీయ రహదారుల శాఖల అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్.పి. లు, రవాణా, రహదారులు భవనాల శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్రంలోని జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం జాతీయ రహదారులపై ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు తీసుకోవాలని, జిల్లాస్థాయి రహదారి భద్రత కమిటీ సమావేశాలు ప్రతినెల నిర్వహించాలని తెలిపారు. టాస్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేయాలని, జాతీయ రహదారిపై ప్రమాదాలు జరిగే ప్రాంతాలు, బ్లాక్ స్పాట్ లను గుర్తించి రక్షణ చర్యలు చేపట్టాలని అంబులెన్స్ లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. ప్రమాదాలు జరిగిన వెంటనే క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని, రహదారి భద్రతపై వాహనదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. వాహనదారులు తప్పకుండా సీట్ బెల్ట్, హెల్మెట్ ధరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ కె.హరిత, ఎస్.పి. నితికా పంత్, జిల్లా రవాణా శాఖ అధికారి వెంకట్ రెడ్డి లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 52 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి ఉందని, ప్రమాదాలు జరగకుండా పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతినెల రహదారి భద్రత కమిటీ సమావేశాలు నిర్వహించి భద్రతాపరమైన చర్యలు తీసుకుంటున్నామని, రహదారిపై ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్ ప్రాంతాలను గుర్తించి రక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జాతీయ రహదారిపై పెట్రోలింగ్, వాహనాలు, అంబులెన్స్ అందుబాటులో ఉన్నాయని, ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అనంతరం లారీ డ్రైవర్లకు కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆశలన్నీ ఆగస్టు పైనే..

- ఎల్‌నినో ప్రభావంతో వెనకడుగు వేసిన వర్షాలు
- అడుగంటిపోతున్న సాగునీటి వనరులు
- అయోమయంలో అన్నదాతలు



వెంకటాపూర్(రామప్ప), జూలై 21 (జనంసాక్షి): రైతే దేశానికి వెన్నెముక..రైతు లేనిదే రాజ్యం లేదు అని గొప్ప పేరుగాంచిన అన్నదాతలు నేడు అయోమయంలో పడ్డారు. వర్షాకాలం ప్రారంభమై నెలలు గడుస్తున్న ప్పటికీ వెంకటాపూర్ మండలంలో విస్తారంగా వర్షాలు కురువకపోవడం మూలంగా సాగునీటి వనరులు (కుంటలు, చెరువులు) అడుగంటి పోతున్నాయి.ఎల్ నినో ప్రభావం మూలంగా మండలంలో ఆశించిన వర్షాలు కురువకపోవడంతో చెరువులు, కుంటల్లో నీటి శాతం తగ్గుతుంది.గతంలో జూలై మాసం ప్రారంభ దశలోనే మత్తడి పోసిన చెరువులు,కుంటలు నేడు వెలవెలబోయి కనబడుతున్నాయి.బోరు సౌకర్యం ఉన్న మండలం లోని కొంతమంది రైతులు నాటుకు దుక్కులను సిద్ధం చేసుకుంటున్నారు. అలాగే చెరువులు, కుంటల ఆధారంగా వ్యవసాయం చేసే మండలం లోని మరికొందరు రైతులు మాత్రం సరిపడ నీరు లేకపోవడంతో ఎండుతున్న నారు మడులను చూసి ఆందోళన చెందుతున్నారు.ఆరుతడి పంటలను మాత్రమే సాగు చేయాలని అధికారులు గ్రామాల్లోని రైతులకు అవగాహన కల్పిస్తున్నప్పటికీ వారు మాత్రం అంతగా ఆసక్తి కనబరచడం లేదు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వచ్చే నెలలోనైనా పెద్ద పెద్ద వర్షాలు కురువక పోతాయా అనే కోణంలో రైతులు ఆగస్టు పైనే ఆశలు పెట్టుకుంటున్నారు.


# పచ్చదనమే మా లక్ష్యం

- సింగరేణి డైరెక్టర్ కె. వెంకటేశ్వర్లు..
- కేటీకే ఓసీ- 3లో మెగా ప్లాంటేషన్ కార్యక్రమం..



జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి): పచ్చదనమే మా లక్ష్యమని, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, మొక్కల పెంపకం ద్వారా భావితరాలకు స్వచ్ఛమైన, పచ్చని వాతావరణాన్ని అందించవచ్చు అని సింగరేణి సంస్థ డైరెక్టర్ (ప్లానింగ్, ప్రాజెక్ట్స్) కొప్పుల వెంకటేశ్వర్లు అన్నారు. బొగ్గు మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు సింగరేణి భూపాలపల్లి ఏరియాలోని కేటీకే ఓసి--3 ప్రాజెక్టులో నిర్వహించిన మెగా ప్లాంటేషన్ కార్యక్రమంలో డైరెక్టర్ కె. వెంకటేశ్వర్లు, భూపాలపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గనుల ప్రాంతాల్లో పచ్చదనాన్ని పెంపొందించేందుకు సింగరేణి సంస్థ ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, నాటిన ప్రతి మొక్కను సంరక్షించి మహావృక్షాలుగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. మొదట కేటీకే ఓసీ--3 వ్యూ పాయింట్ కు చేరుకున్న డైరెక్టర్ సర్వేస్ మైన్ లో జరుగుతున్న బొగ్గు ఉత్పత్తి, ఓవర్ బర్డెన్ తొలగింపు, యంత్రాల పనితీరు, భద్రతా చర్యలను క్షుణ్ణంగా పరిశీలించారు. గనిలో అమలవుతున్న పనితీరుపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని గనిలో వర్షపు నీరు నిల్వ కాకుండా సమర్థవంతమైన డ్రైనేజీ సిస్టంను నిర్వహించాలని, స్లోప్స్ స్థిరత్వంపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, సేఫ్టీ స్టాండర్డ్స్ పాటిస్తూ ఎలాంటి రాజీ పడకూడదని అధికారులకు సూచించారు. అనంతరం సీసీఓ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న మెగా ప్లాంటేషన్ డ్రైవ్ కార్యక్రమంలో పాల్గొని అధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులతో కలిసి పర్యావరణ పరిరక్షణకు ప్రతీకగా పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. తదుపరి ప్రతిపాదిత తాడిచర్ల ఓసీ–2 ప్రాజెక్టు ప్రారంభించనున్న ప్రాంతాన్ని సందర్శించి సైట్ పరిస్థితులు, ప్రాజెక్ట్ పురోగతికి సంబంధించిన అంశాలను పరిశీలించారు. అనంతరం తాడిచర్ల ఓసీ–2 ప్రాజెక్టు పరిధిలోని శాత్రాజ్‌పల్లి గ్రామాన్ని సందర్శించి గ్రామ పరిస్థితులు, మౌలిక సదుపాయాలు, పునరావాసంకు సంబంధించిన అంశాలపై అధికారులతో సమీక్షించారు. స్థానిక ప్రజల ప్రయోజనాలకు ప్రాధాన్యతనిస్తూ అన్ని చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం(సివిల్) రవికుమార్, ఏజీఎం(ఇఅండ్ఎం) జోతి, కెటికె ఓసి - 2 పీఓ శ్యామ్ సుందర్, ఓసి–3 పీఓ డి.రామస్వామి, డీజీఎం పి.రాజేశ్వర్, ఏరియా ఇంజనీర్ పి.వి సాంబశివరావు, ఏరియా సర్వే ఆఫీసర్ శైలేంద్ర కుమార్, గ్రూప్ ఏజెంట్ ఎం. తిరుపతి, ప్రాజెక్టు మేనేజర్ డి. రాంబాబు, వివిధ మేనేజర్లు సంపత్, సునీల్ కుమార్, కావూరి మారుతి, ఆఫీసర్లు పోశమల్లు, రాహుల్, ఇతర అధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# వ్యవసాయ బావిలో మొసలి పిల్ల!



చెన్నారావుపేట, జూలై 21 (జనం సాక్షి) : వ్యవసాయ బావిలో మొసలి పిల్ల ప్రత్యక్షమైంది. చెన్నారావుపేట మండలంలోని అక్కల్ చెడ గ్రామానికి చెందిన పదిరం మల్లయ్యకు గ్రామ శివారులో మగ్దంపురం ఊర చెరువు సమీపంలో వ్యవసాయ బావి ఉంది. ఆ వ్యవసాయ బావిలో మంగళవారం మొసలి పిల్ల అటువైపుగా వెళ్లిన యువకులకు కనిపించింది. దీంతో వారు గ్రామస్తులకు, ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. గ్రామస్తులు, ఫారెస్ట్ అధికారులు వ్యవసాయ బావి వద్దకు చేరుకొని మొసలి పిల్లను పరిశీలించారు. గ్రామస్తుల సహాయంతో వ్యవసాయ బావిలోని నీటిని మోటార్ల సహాయంతో బయటకి పంపిస్తున్నారు. వ్యవసాయ బావిలో నీళ్లు మొత్తం బయటికి వెళ్లాక అనంతరం ఆ మొసలి పిల్లను స్వాధీనం చేసుకొని ఖానాపురం మండలంలోని పాకాల సరస్సులో వదిలివే యనున్నట్లు పేర్కొన్నారు. సమీపంలోని పచ్చర్ల మాటు వరద నీటి ద్వారా వ్యవసాయ బావిలోకి మొసలి పిల్ల వచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు.

# ఉపాధి హామీ పథకం అమలుపై కేంద్రాన్ని ప్రశ్నించిన ఎంపీ కడియం కావ్య



వరంగల్ బ్యూరో, జూలై 21 (జనంసాక్షి) : వరంగల్ జిల్లాలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ ఈజీఎస్) అమలు, ఉపాధి కల్పన, వేతనాల చెల్లింపుల స్థితిగతులపై వరంగల్ లోక్‌సభ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పార్లమెంట్‌లో ప్రశ్నించారు. ఉపాధి కోరిన కుటుంబాలకు ఎంత మేర పని కల్పించారు? సగటున ఎన్ని పనిదినాలు లభించాయి? వేతనాల చెల్లింపుల్లో ఏమైనా బకాయిలు ఉన్నాయా? అనే అంశాలపై కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖను ఆమె వివరణ కోరారు. వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి కమలేశ్ పాస్వాన్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. మంత్రి వెల్లడించిన వివరాల ప్రకారం, వరంగల్ జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి కోరిన అర్హ కుటుంబాల్లో 99.99 శాతం మందికి, 2025-26 ఆర్థిక సంవత్సరంలో 99.97 శాతం మందికి పని కల్పించారు. ఒక్కో కుటుంబానికి సగటున 2024-25లో 41.12 పనిదినాలు, 2025-26లో 27.89 పనిదినాలు లభించాయన్నారు.ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ కుటుంబాలకు ఉపాధి భద్రత కల్పించడంలో వరంగల్ జిల్లా మెరుగైన ఫలితాలు సాధించడం సంతోషకరమన్నారు. గ్రామీణ ప్రజల సమస్యలను పార్లమెంట్ వేదికగా ప్రస్తావిస్తూ, వారి హక్కులు, సంక్షేమ పథకాల అమలుపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నామని తెలిపారు.వేతనాల చెల్లింపుల విషయంలో కూడా వరంగల్ జిల్లాలో ఎలాంటి పెండింగ్ బకాయిలు లేవని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేయడం సానుకూల పరిణామమని కడియం కావ్య పేర్కొన్నారు. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా కూలీల ఖాతాల్లోకి నేరుగా వేతనాలు జమ కావడం వల్ల పారదర్శకత పెరిగిందన్నారు. భవిష్యత్తులో ఉపాధి కల్పన రోజులను మరింత పెంచడంతో పాటు మహిళలు, బలహీన వర్గాల భాగస్వామ్యాన్ని విస్తరించాల్సిన అవసరం ఉందని వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య అభిప్రాయపడ్డారు. గ్రామీణ ప్రాంతాల్లో స్థిరమైన ఆస్తుల సృష్టి, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల అమలుపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని ఈ సందర్భంగా కోరారు.

# ప్రజలకు వేగవంతమైన పోలీసు సేవలందిద్దాం

- ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే పోలీసింగ్ నిర్వహించాలి
- హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్ఐలకు దిశానిర్దేశం
- జిల్లా ఎస్పీ శబరీష్



మహబూబాబాద్ బ్యూరో, జూలై 21 (జనం సాక్షి): మహబూబాబాద్ జిల్లా పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుళ్లు, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లు (ఏఎస్ఐలు)తో పీవీ ఫంక్షన్ హాల్ లో జిల్లా ఎస్పీ డా. శబరీష్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్ఐలు పోలీస్ స్టేషన్ వ్యవస్థలో కీలకమైన బాధ్యతలు నిర్వహిస్తారని, తమ సీనియారిటీ, అనుభవాన్ని సమర్థవంతమైన కార్యాచరణగా మార్చి ప్రజలకు వేగవంతమైన, నాణ్యమైన పోలీసు సేవలు అందించాలని సూచించారు. విధుల నిర్వహణలో భావోద్వేగాలకు, రాగద్వేషాలకు లోనుకాకుండా చట్టబద్ధంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలని తెలిపారు. పోలీస్ స్టేషన్ కు వచ్చే ప్రతి ఒక్కరితో మర్యాదగా, సహనంతో, గౌరవప్రదంగా వ్యవహరిస్తూ ప్రజల్లో పోలీస్ శాఖపై విశ్వాసాన్ని మరింత పెంపొందించాలని సూచించారు. ప్రతి ఫిర్యాదు, వినతిని బాధ్యతాయుతంగా స్వీకరించి, సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని, పెండింగ్ పనులను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలకు అవసరమైన సేవలు ఆలస్యం కాకుండా అందించేలా సమయ పాలన పాటించాలని సూచించారు. పోలీస్ స్టేషన్లో ప్రతి పని వ్యవస్థీకృతంగా ఉండేలా చూడాలని పేర్కొన్నారు. స్టేషన్లో పనిచేసే అధికారులు, సిబ్బంది మధ్య సమన్వయం పెంపొందించి టీమ్‌వర్క్‌తో పనిచేయాలని, స్మార్ట్ వర్క్, సమయ నిర్వహణ, వృత్తి నైపుణ్యాలతో పోలీస్ స్టేషన్ పనితీరును మరింత మెరుగుపర్చాలని సూచించారు. పోలీస్ స్టేషన్ ప్రజలకు న్యాయం, భరోసా అందించే కేంద్రంగా ఉండాలని, ప్రతి అధికారి బాధ్యత, క్రమశిక్షణ, సేవాభావంతో విధులు నిర్వర్తిస్తూ పోలీస్ శాఖ ప్రతిష్ఠను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు.

# మున్సిపాలిటీలలో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ బ్యూరో జూలై 21 (జనంసాక్షి) : జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో, కలెక్టర్ మున్సిపాలిటీకి సంబంధించిన అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలలో నిరంతరం మెరుగైన పారిశుద్ధ్య పనులు కొనసాగించాలని అన్నారు. వర్షాకాలం ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. సుప్రీం కోర్టు మార్గదర్శకాల మేరకు ఘన వ్యర్థాల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని తెలిపారు. ప్లాస్టిక్ నిషేధం పకడ్బందీగా అమలు చేయాలని అన్నారు. మౌలిక సదుపాయాల కల్పన పనులన్నీ వేగవంతంగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ లు రవి బాబు, సుందర్ సింగ్, యాదయ్య, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# సాదా బైనమా, భూభారతి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

- కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె.హరిత




కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జూలై 21(జనంసాక్షి): సాదా బైనమా, భూభారతి, రెవెన్యూ సదస్సులలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు లతో కలిసి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా ఆసిఫాబాద్, కాగజ్ నగర్ రాజస్వ మండల అధికారులు, తహసిల్దార్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూభారతిలో వచ్చే దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి నిర్ణీత గడువులోగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సాదా బైనమాల క్రమబద్ధీకరణ క్రింద దరఖాస్తు చేసుకున్న వాటిని రికార్డులతో సరిచూసి క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని తెలిపారు. రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులు చాలా మండలాల్లో ఇంకా పెండింగ్ దశలో ఉన్నాయని, తిరస్కరించే దరఖాస్తులను తిరస్కరణకు గల కారణాలు నమోదు చేయాలని తెలిపారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ఈనెల 25 లోగా ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియ, ఎ.ఎస్.డి. జాబితాను రూపొందించాలని తెలిపారు.



# తాడిచర్ల కోల్ బ్లాక్-01 మైనింగ్ పనుల పరిశీలన

- ఓపెన్ గనిలో బొగ్గు ఉత్పత్తిని పెంచాలి టీజీజెన్కో డైరెక్టర్ బి.నాగియా

మల్హర్,జూలై 21(జనంసాక్షి) : భూపాలపల్లి జిల్లా లోని తాడిచర్ల కోల్ బ్లాక్ 01 ఓపెన్ కాస్ట్ మైన్ ను మంగళవారం టీజీజెన్కో కోల్ & లాజిస్టిక్ డైరెక్టర్ బి.నాగియా సందర్శించారు. ఈ పర్యటనలో ఆయన వెంట టీజీజెన్కో జీఎం బి.మోహన్ రావు, కేటీపీపీ సీఈ ఓఅండ్‌ఎం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మైన్ సీనియర్ అధికారులు ఏఎమ్మార్ ప్రాజెక్టు హెడ్ ప్రభాకర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ కేవీఎస్ఎన్ మూర్తి గని యొక్క ప్రస్తుత స్థితిగతులు, బొగ్గు మైనింగ్ ప్రక్రియను డైరెక్టర్‌కు డిజిటల్ ప్రెజెంటేషన్ ద్వారా క్షుణ్ణంగా వివరించారు. అనంతరం మైన్ వ్యూ పాయింట్ నుండి గని పనులను పరిశీలించిన డైరెక్టర్ బి.నాగియా, బొగ్గు ఉత్పత్తిని మరింత పెంచడానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు తగు సూచనలు మరియు ఆదేశాలు జారీ చేశారు.

# వ్యవసాయ బోరు బావి వద్ద ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం

- రైతుల ఆందోళన



తాండూర్, జూలై 21(జనం సాక్షి) : మంచిర్యాల జిల్లా, బెల్లంపల్లిలోని తాండూర్ మండలం కొత్తపల్లి గ్రామ శివారులో, కొత్తకొండ ఆశమ్మకు చెందిన వ్యవసాయ బోరు వద్ద గుర్తు తెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి, వాటిలోని కాపర్, కాయిల్, ఆయిల్ను దొంగిలించారు. ఈ సంఘటనతో ఆ ప్రాంతంలోని పొలాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వర్షాకాలంలో పంటలకు నీరు అందక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఘటనపై రైతులు పోలీసులకు, విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసి, దొంగలను వెంటనే పట్టుకోవాలని కోరారు.

# భారీ వర్షంతో పత్తి పంట ధ్వంసం



తాండూర్, జూలై 21 (జనం సాక్షి) : మంచిర్యాల జిల్లా, తాండూర్ మండలంలో సోమవారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షం కారణంగా గోపాల్ నగర్, గ్రామాల్లో గజ్జల సత్యనారాయణ, గాజుల అంకన్న పత్తి పంట తీవ్రంగా దెబ్బతింది. ఏకధాటిగా కురిసిన వర్షానికి వరద నీరు పొలాల్లోకి చేరడంతో పత్తి మొక్కలు కొట్టుకుపోయాయి, కొన్ని చోట్ల పంట నీటిలో మునిగిపోయింది. దీంతో రైతులు లక్షల రూపాయల నష్టపోయినట్లు తెలిపారు. పంట నష్టంతో ఆందోళన చెందుతున్న రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించి నష్టపరిహారం అందించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## ఓటరు నమోదు ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలి

- పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి



**మహమ్మదాబాద్, జూలై 21 (జనంసాక్షి) :** మహమ్మదాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమావేశ మందిరంలో పరిగి ఎమ్మెల్యే డా.టి.రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక ఓటరు నమోదు(ఎస్ఐఆర్)ప్రక్రియతో పాటు మండల అభివృద్ధి పనులపై సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియను ఎలాంటి లోపాలకు తావులేకుండా పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.అర్హులైన ప్రతి ఒక్కరి ఓటరు వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా అధికారులు,ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.ప్రతి అర్హుడికి ఓటు హక్కుకల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.అనంతరం మండలంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు,ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు,పెండింగ్‌లో ఉన్న పనుల పురోగతిపై శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు.ప్రజలకు మెరుగైన సేవలు అందేలా అన్ని అభివృద్ధి పనులను నాణ్యతతో,నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో తాసిల్దార్ విద్య సాగర్ రెడ్డి,ఎంపీడీవో నరేందర్ రెడ్డి,వ్యవసాయ శాఖ అధికారి ఏవో నరేందర్,పిఎసిఎస్ చైర్మన్ కమతం శ్రీనివాస్ రెడ్డి,వైస్ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కేఎం,నారాయణ,హౌసింగ్ ఏఈ మొతిమ్,సర్పంచల సంఘం అధ్యక్షుడు,జె రామ్ లాల్,కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

**ఖమ్మం కార్పొరేషన్, జూలై 21 (జనం సాక్షి) :** ఖమ్మం జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టి జాతీయ రహదారులపై రోడ్డు భద్రతా ప్రమాణాలను పూర్తి స్థాయిలో అమలు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర రవాణ శాఖ కమీషనర్ ఇల్లంబర్తి హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమీషనర్లు, సంబంధిత శాఖల అధికారులతో జాతీయ రహదారులపై రోడ్డు భద్రత చర్యలు, ప్రమాదాల నివారణ, సుప్రీం కోర్టు మార్గదర్శకాల అమలు, అనుసరణ (కంప్లయన్స్) నివేదికల సమర్పణ, ప్రమాదాల తగ్గింపునకు తీసుకోవాల్సిన చర్యలు, జాతీయ రహదారుల వెంట ఉన్న ఆసుపత్రుల మ్యాపింగ్, ఆక్రమణల తొలగింపు, అత్యవసర స్పందన వ్యవస్థ, తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లా అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్‌లి, ఖమ్మం పోలీస్ కమీషనరేట్ కార్యాలయం నుండి సిపి సునీల్ దత్‌లి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్‌లి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూలి జిల్లాలో ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలను ఇప్పటికే గుర్తించినవి, ఆయా ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు అవసరమైన అన్ని చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు. మున్సిపల్ ప్రాంతాల్లోని ప్రధాన



రహదారులు, క్రిటికల్ జంక్షన్లలో అవసరమైన రోడ్డు భద్రతా పనులను తక్షణమే చేపట్టాలని సూచించారు. జిల్లా పరిధిలోని జాతీయ రహదారుల వెంట వాహనాల కోసం అవసరమైన పార్కింగ్ ప్రాంతాలు, ప్రతి 40 నుంచి 50 కిలోమీటర్ల కు ఒకసారి ప్రజలకుఅవసరమైన పార్కింగ్, మరుగుదొడ్లు, ఇతర వే సైడ్ సదుపాయాల వివరాలతో కూడిన అనుసరణ నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ శాఖతో సమన్వయం చేసుకుని ట్రాఫిక్ నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ప్రతి ట్రాఫిక్ ఉల్లంఘనను నమోదు చేసి నిబంధనల ప్రకారం జరిమానాలు విధించే వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. పెట్రోలింగ్ వాహనాలు అందుబాటులో ఉంచి, జాతీయ రహదారులపై అత్యవసర పరిస్థితుల్లో తక్షణ స్పందన అందించాలని, అంబులెన్స్ సేవలు కూడా దానికి అనుసంధానమై ఉంచాలని తెలిపారు. జాతీయ రహదారులకు సమీపంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల మ్యాపింగ్ పూర్తిస్థాయిలో ఉండాలని ఆదేశించారు. జాతీయ రహదారులపై ఉన్న ఆక్రమణలను గుర్తించి వెంటనే తొలగించాలని, జాతీయ రహదారులకు అక్రమంగా ప్రవేశ మార్గాలు కల్పిస్తున్న దాబాలు, వాణిజ్య సంస్థలు, ఇతర నిర్మాణాలను కేంద్ర జాతీయ రహదారుల చట్టం ప్రకారం తొలగించాలని సూచించారు. జాతీయ రహదారుల సేఫ్టీ జోన్ పరిధిలో ఎలాంటి వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.జిల్లాలో గుర్తించిన బ్లాక్‌స్పాట్లను శాశ్వతంగా సరిదిద్దేందుకు అందుబాటులో ఉన్న నిధులను పూర్తిస్థాయిలో వినియోగించాలని కలెక్టర్ సూచించారు. బ్లాక్‌స్పాట్ల అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలను పోలీసు శాఖతో సమన్వయం చేసుకుని వెంటనే సిద్ధం చేసి అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్‌హెచ్‌ఏఐ, రోడ్లు-భవనాల శాఖ అధికారులు ఏటీఎంలు (అడ్వాన్స్ ట్రాఫిక్ మేనేజ్మెంట్ సిస్టమ్), ఆక్రమణలు, ఎమర్జెన్సీ రెస్పాన్స్ ప్లాన్, లే-బైలు (ఝఎ-ఎఎవం), వే సైడ్ అమెనిటీస్, బ్లాక్‌స్పాట్లు, తదితర అంశాలపై చేపట్టిన చర్యలకు సంబంధించిన సమగ్ర అనుసరణ నివేదికను సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించాలని సూచించారు. ఇకపై ప్రతి నెల మూడవ శుక్రవారం జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశాన్ని తప్పని సరిగా నిర్వహించి రోడ్డు భద్రత చర్యల పురోగతిని సమీక్షించాలని, ప్రతి శాఖ తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ ఎస్ఇ యుగంధర రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. రామారావు, నేషనల్ హైవే పిడి దివ్య, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల చిన్నారులపై ప్రత్యేక దృష్టి పెట్టండి

- ఐటీడీఏ పీవో బి. రాహుల్

**భద్రాచలం, జూలై 21 (జనంసాక్షి) :** గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిపిఎస్, ప్రైమరీ, ఎంపీపీ పాఠశాలలు, గురుకులాలలో చదువుతున్న చిన్నారులకు మెనూ ప్రకారము బలవర్ధకమైన ఆహారము అందిస్తున్నామని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ తెలిపారు. మంగళవారం నాడు ఐటిడిఏ కాన్ఫరెన్స్? హాలులో మర్యాదపూర్వకంగా కలిసిన ఇక్రి షాట్ నంగియా కంపెనీ డాక్టర్ల బృందం సభ్యులకు గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న పాఠశాలల స్థితిగతులు, సూక్ష్మ చిన్న తరహా పరిశ్రమలు నడిపిస్తున్న గిరిజన మహిళలకు ఆర్థికంగా చేయూత అందించడానికి భద్రగిరి మార్ట్? నెలకొల్పి పూర్తిస్థాయి ఆర్గానిక్ వస్తువులనే ప్రజలకు అందిస్తున్నామని పేర్కొన్నారు. గిరిజన మహిళలు తయారు చేస్తున్న నాణ్యతతో కూడిన మిల్లెట్ బిస్కెట్లు భారత ప్రధాని నరేంద్ర సింగ్ మోడీ మన్ కీ బాత్ లో ప్రశంసించడం వలన ఆ మహిళలు తయారు చేస్తున్న మిల్లెట్ బిస్కెట్లు లండన్ వరకు ఆన్లైన్లో అమ్మకాలు జరుపుతున్నారని అన్నారు. మీ సంస్థ ద్వారా గిరిజన బాలబాలికలకు అందించే



న్యూట్రిషన్ ఫుడ్ మారుమూల మండలాలైన దుమ్ముగూడెం, చెర్ల, అశ్వరావుపేట మండలాలలోని గ్రామాలలో ఉన్న జిపిఎస్ పాఠశాలలు, అంగన్వాడీ సెంటర్లు, ప్రైమరీ పాఠశాలల్లో చదువుతున్న చిన్నారులు అందరికీ అందించాలని అన్నారు. అదేవిధంగా పోషకాలు జోడించిన సంపూర్ణ తృణధాన్యాల గురించి గిరిజన గ్రామాలలోని చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని అన్నారు. అనంతరం ఇక్రి షాట్ నంగియా కంపెనీ బృందం వారు మాట్లాడుతూ గిరిజన గ్రామాలలోని చిన్నారులకు, గిరిజన సంక్షేమ పాఠశాలలో చదువుతున్న ఏడు నుంచి పది సంవత్సరాల పిల్లలకు పౌష్టికరమైన ఆహారము ఇక్రిశాట్ ఆధ్వర్యంలో పైలెట్ ప్రాజెక్టు కింద తీసుకొని చిన్నారులకు అందించడానికి రావడం జరిగిందన్నారు. ఎంపీపీ పాఠశాలల్లో చదివే చిన్నారులకు మధ్యాహ్న భోజన పథకం ద్వారా పోషకాహారం అందించడానికి న్యూట్రిషన్ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలించామని, తప్పనిసరిగా రక్తహీనతతో ఉన్న చిన్నారులను గుర్తించి న్యూట్రిషన్ ఫుడ్ అందించేలా ప్రణాళికల రూపొందిస్తామన్నారు. గిరిజన గ్రామాలలో ఉన్న పాఠశాలలను సందర్శించి, న్యూట్రిషన్ ప్రాసెసింగ్ యూనిట్ కు చిన్నారులందరికీ బలవర్ధకమైన ఆహారం అందించేలా సూచనలిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారిణి చందన, ఏడిఎంహెచ్ఓ సైదులు, భద్రాచలం ఇంచార్జి ఎంఈఓ రమ, ఇక్రిశాట్ నంగియా బృందం డాక్టర్లు మాసన్ స్వామి కన్నా, రూపా బెనర్జీ, జూడి థామస్, అభినవ్ ఎం సి పాల్గొన్నారు.

## రోడ్డు రోలర్‌తో మోటార్ బైక్ సైలెన్సర్లను తొక్కించిన ఎస్పీ

- యువత ఆదర్శంగా ఉంటూ ప్రమాదాలకు దూరంగా ఉండాలి
- సూర్యాపేట జిల్లా ఎస్పి నరసింహ



**కోదాడ, జూలై 21 (జనం సాక్షి) :** నిబంధనలకు విరుద్ధంగా మోటార్ బైక్‌ల సైలెన్సర్లు మార్చి, అధిక శబ్దాలతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న వాహనదారులపై కోదాడ పట్టణ, మరియు కోదాడ ట్రాఫిక్ పోలీసులు కఠిన చర్యలు తీసుకున్నారు. సైలెన్సర్ లు మార్చి అధిక శబ్దంతో పట్టణంలో ఇష్టారాజ్యంగా తిరుగుతున్న వాహనాలను గుర్తించి చర్యలు తీసుకోవడం కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు అని ఎస్పీ నరసింహ తెలిపినారు. ఈ ప్రత్యేక తనిఖీల ద్వారా సీజ్ చేసిన 40 మోడిఫైడ్ సైలెన్సర్లను మంగళవారం పోలీసులు రోడ్డు రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. కోదాడ పట్టణంలోని రంగా థియేటర్ చౌరస్తాలో జిల్లా ఎస్పీ నరసింహ ఆధ్వర్యంలో మంగళవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఎస్పీ నరసింహ మాట్లాడుతూ మితిమీరిన శబ్దాలు చేస్తూ ప్రజలకు, ముఖ్యంగా వృద్ధులు, రోగులు, చిన్న పిల్లలకు ఇబ్బంది కలిగిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత ఆదర్శంగా ఉండాలి రోడ్డు ప్రమాదాలకు గురి కావద్దు అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక డిఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, ఇన్స్పెక్టర్ శివ శంకర్, ట్రాఫిక్ ఎస్ఐ అంజిరెడ్డి పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చూడాలి

- బీజేపీ రాష్ట్ర నాయకులు అంటోని రెడ్డి



**కోహెడ, జూలై 21 (జనంసాక్షి) :** అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చూడాలని బిజెపి రాష్ట్ర నాయకులు ఆంటోనీ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం కోహెడ మండల కేంద్రంలోని సంఘం భవనంలో పార్టీ మండల అధ్యక్షుడు జాలిగం రమేష్ అధ్యక్షతన జరిగిన ఎస్ ఐ ఆర్ కార్యక్రమం పై సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి మెదక్ జిల్లాల బిజెపి పార్టీ సర్ ప్రోగ్రాం జోనల్ ఇంఛార్జీ హైకోర్టు న్యాయవాది ఆంటోని రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని సంఘం భవనంలో బిజెపి మండల అధ్యక్షుడు జాలిగం రమేష్ అధ్యక్షతన జరిగిన సర్ కార్యక్రమంపై ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశానికి హుస్నాబాద్ అసెంబ్లీ బిజెపి బి ఎల్ ఏ 1 గుర్రాల లక్ష్మారెడ్డి తో కలిసి ముఖ్యఅతిథిగా హాజరైన ఆంటోని రెడ్డి మాట్లాడుతూ మండలంలో సర్ కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పించడం ఇంటింటికీ వెళ్లి సర్ ప్రాముఖ్యతను వివరించాలని అవసరమైన పత్రాలు, దరఖాస్తు విధానం గురించి ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని అన్నారు. పార్టీ శ్రేణుల సమన్వయం బూత్ స్థాయి నుంచి మండల స్థాయి వరకు కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ప్రతి బూత్‌లో లక్ష్యాలను నిర్ణయించి రోజువారీ సమీక్ష నిర్వహించాలని ఆయన సూచించారు. అర్హులందరికీ న్యాయం చేసేలా ఎటువంటి రాజకీయ తారతమ్యాలు లేకుండా అర్హులైన ప్రతి ఓటరుకు సహాయం అందించాలని అన్నారు. ప్రజాస్వామ్య బలోపేతానికి ఖచ్చితమైన ఓటరు జాబితా ఎంతో అవసరమని వివరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మ్యాకల స్వర్ణలత -సురేందర్ రెడ్డి,బిజెపి మండల ప్రధాన కార్యదర్శి ఖమ్మం సత్యనారాయణ, పార్టీ మండల ఉపాధ్యక్షుడు తూటి బాపురెడ్డి, జిల్లా నాయకుడు పిల్లి నర్సయ్య, బిజెవైఎం మండల అధ్యక్షుడు నాగు అజయ్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు అన్నాడి లక్ష్మారెడ్డి, బూత్ గ్రామశాఖ అధ్యక్షులు బి ఎల్ ఏ 2 బండ సుమన్, ఎడమల రాజు, ముంజ సాగర్, పొన్నాల సాగర్, తదితరులున్నారు.

# ఓటర్ల వివరాల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**సంగారెడ్డి బ్యూరో, జూలై 21 (జనం సాక్షి) :** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో సమావేశంలో కార్యక్రమం పురోగతిని సమీక్షించారు. అనంతరం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమావేశమైన కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో ఇప్పటివరకు సగటున 70 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని తెలిపారు. నియోజకవర్గాల వారీగా నారాయణఖేడ్‌లో 85 శాతం, అందోల్‌లో 80 శాతం, జహీరాబాద్‌లో 75 శాతం, సంగారెడ్డిలో 71 శాతం, పటాన్‌చెరులో 52 శాతం ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పూర్తయినట్లు వెల్లడించారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం ఎన్నికల నమోదు అధికారులు, సహాయ ఎన్నికల నమోదు అధికారులతో నిర్వహించిన సమీక్షలో అన్ని నియోజకవర్గాల్లో డిజిటలైజేషన్ పనులను మరింత వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా పటాన్‌చెరు నియోజకవర్గంలో వార్డు అధికారులు, ఇతర స్వచ్ఛంద సేవకుల సహకారంతో ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అలాగే పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణను ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం చేపట్టాలని, వలస వెళ్లిన వారు, మరణించిన వారు, ద్వంద్వ ఓటర్లు వంటి వివరాలను క్షేత్రస్థాయిలో మరోసారి పరిశీలించి, తప్పులు లేని పారదర్శక ఓటరు జాబితాను రూపొందించాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండు, ఎన్నికల నమోదు అధికారులు, సహాయ ఎన్నికల నమోదు అధికారులు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

# నేరాల నిరోధానికి ప్రణాళికాబద్ధమైన చర్యలు

- సరిహద్దు వెంట పటిష్ట నిఘా
- మహిళల భద్రతకు, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రాధాన్యం
- సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ



**చింతలపాలెం, జూలై 21 (జనంసాక్షి) :** జిల్లాలోని పోలీస్ స్టేషన్ ల వార్షిక తనిఖీల్లో భాగంగా సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ మంగళవారం రోజున చింతలపాలెం పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీ చేశారు.పోలీస్ స్టేషన్‌కు విచ్చేసిన ఎస్పీకి చింతలపాలెం పోలీస్ సిబ్బంది గౌరవ వందన సమర్పణతో స్వాగతం పలికారు.ఈ సందర్భంగా సిబ్బంది నిర్వహించిన కవాతు,యూని ఫాం మరియు పోలీసు పరికరాలను పరిశీలించి సిబ్బందితో కలిసి స్టేషన్ అవరణలో మొక్కలు నాటారు.అనంత రం స్టేషన్‌లోని వివిధ రకాల రికార్డుల ను,కేసుల నమోదు,దర్యాప్తు వివరాల ను,పోలీసు సేవలను తనిఖీ చేసి, సిబ్బంది పనితీరును సమీక్షించారు. విధులు నిర్వహణ పోలీసు సేవలు అంశాలపై సిబ్బందికి సలహాలు సూచనలు అందించారు.ఈ సందర్భం గా ఎస్పి మాట్లాడుతూ బాధితుల నుండి వచ్చే ఫిర్యాదులు,కేసుల దర్యాప్తును పెండింగ్ ఉంచకుండా సిబ్బంది తమ సామర్థ్యంతో త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశిం చారు.ఆంధ్రా-తెలంగాణ రాష్ట్రాలకు మల్లారెడ్డిగూడెం ముఖ్యమైన సరిహద్దు ప్రాంతం.ఇక్కడ వివిధ పరిశ్రమలు ఉన్నాయి,మైనింగ్ కార్యకలాపాలు జరుగుతాయి,పులిచింతల ప్రాజెక్ట్ మరియు విద్యుత్ తయారీ కేంద్రం ఉన్నందున భౌగోళికంగా ఈ ప్రాంతం చాలా కీలకమైనది.అందువల్ల పోలీసు లు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ నిఘా ఉంచాం అన్నారు.సరిహద్దు గుండా గంజాయి రవాణా,అక్రమ కార్యకలాపాలు మరియు అసాంఘిక శక్తుల కదలికలు జరగకుండా నిరంతర తనిఖీలు చేస్తున్నాం.రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్ల ప్రస్తుత జీవనశైలిపై ప్రత్యేక నిఘా ఉంచామని, వాళ్ళు మళ్లీ నేరాలకు పాల్పడకుండా,ప్రజలను ఇబ్బంది పెట్టకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.గత మూడేళ్లుగా ఈ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన నేరాల సరళిని పరిశీలించి, వాటి నిర్మూలనకు ప్రత్యేక ప్రణాళికతో పనిచేస్తున్నామని వివరించారు.సైబర్ మోసాలు,మహిళలపై వేధింపులు అరికట్టడం మరియు రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసు శాఖ ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు.నూతన పోలీస్ స్టేషన్ భవనం నుండి త్వరలో ప్రజలకు సేవలు అందిస్తామని అన్నారు.నూతన జిల్లాలో నూతనంగా ఏర్పడిన మల్లారెడ్డిగూడెం పోలీస్ స్టేషన్ కు మంత్రి ప్రత్యేక చొరవతో పక్క భవనాన్ని నిర్మించడం జరుగుతుందని ఈ నిర్మాణం త్వరగా పూర్తిచేసి ఇక్కడ నుండి ప్రజలకు వేగవంతమైన సేవలు అందిస్తామని అన్నారు.ఈ కార్యక్రమం లో కోదాడ డివిజన్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి,ఇన్చార్జ్ సీఐ రామకృష్ణారెడ్డి, డిసిఆర్బి ఇన్స్పెక్టర్ మగ్దూమ్ అలీ,చింతలపాలెం సబ్ ఇన్స్పెక్టర్ పరమేష్,స్పెషల్ బ్రాంచ్ సబ్ ఇన్స్పెక్టర్ రాంబాబు,స్టోర్ ఆర్ఎస్ఐ అన్వర్, డిసిఆర్బి సిబ్బంది అంజన్ రెడ్డి,శేఖర్ రెడ్డి,ఎస్పీ సీసీ సందీప్,టెక్నికల్ టీమ్ కానిస్టేబుల్ సురేందర్ రెడ్డి మరియు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# సీపీఎస్ వెంటనే రద్దు చేయాలి

- ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌కు వినతి



**సంగారెడ్డి, జూలై 21 (జనం సాక్షి) :** ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ సిపిఎస్ ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం ఓ పి ఎస్)ను అమలు చేయాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ డిమాండ్ చేశారు. టీఎస్ సీపీఎస్ఈయూ) ఆధ్వర్యంలో మంగళవారం ఉద్యోగులు సంగారెడ్డి చౌరస్తా నుంచి భారీ బైక్ ర్యాలీ నిర్వహించి సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఉద్యోగులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని అన్నారు అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే సీపీఎస్‌ను రద్దు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చినా, రెండున్నర సంవత్సరాలు గడిచినా ఆ హామీ అమలు కాలేదని ఆయన విమర్శించారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, ఉద్యోగులకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకుని సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సీపీఎస్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లకు తాను పూర్తి మద్దతు ఇస్తానని, వారి సమస్యలను రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి బలంగా వినిపిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీఎస్ సీపీఎస్ఈయూ నాయకులు, ఉద్యోగులు, బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.






# మారుతీ సుజుకీ షాక్..

## మరోసారి రూ.30 వేల వరకు ధరల పెంపు

ప్రముఖ కార్ల తయారీ సంస్థ మారుతీ సుజుకీ వినియోగదారులకు మళ్లీ షాక్ ఇచ్చింది జూన్ నెలలోనే అన్ని మోడళ్లపై రూ.30 వేల వరకు ధరలు పెంచిన కంపెనీ.. మరోసారి రూ.30 వేలు పెంచుతున్నట్లు ప్రకటించింది. ఆగస్టు నుంచి ఇది అమలవుతుందని తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో కంపెనీ వెల్లడించింది. దీంతో ఈ కార్ల ధరలు మరింత ప్రియం కానున్నాయి. ఉత్పత్తి వ్యయాలు పెరగడమే ఇందుకు కారణంగా కంపెనీ పేర్కొంది. "కొన్ని నెలలుగా ధరలను తగ్గించేందుకే ప్రయత్నిస్తున్నాం. కానీ ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో ధరలు పెంచాల్సిన పరిస్థితి వచ్చింది. వినియోగదారులపై సాధ్యమైనంత మేర తక్కువ స్థాయిలోనే ఆ ప్రభావం ఉండేలా చూసుకుంటాం" అని కంపెనీ తెలిపింది. మారుతీ సుజుకీ ప్రస్తుతం ఎస్‌-ప్రెస్సో వంటి ఎంట్రీలెవల్ మోడళ్ల నుంచి ప్రీమియం యుటిలిటీ వెహికల్ అయిన ఇన్విక్టో వరకు పలు మోడళ్లను విక్రయిస్తోంది. వీటి ధరలు రూ.3.5 లక్షల నుంచి ప్రారంభమై రూ.28.7 లక్షల (ఎక్స్‌షోరూం) వరకు ఉన్నాయి.

# దేశీయ ఫార్మా దిగ్గజాల్లో దివీస్ ఎండీకే అత్యధిక పారితోషికం



దిల్లీ: గత ఆర్థిక సంవత్సరం (2025-26) దేశంలోని దిగ్గజ నమోదిత ఔషధ కంపెనీల్లో దివీస్ లేబొరేటరీస్ మేనేజింగ్ డైరెక్టరు మురళీ కె దివి నే అత్యధిక పారితోషికాన్ని అందుకున్నారు. ఆయనకు రూ.100.26 కోట్ల పారితోషికం లభించింది. రెండో స్థానంలో సిప్లా మాజీ ఎండీ, గ్లోబల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ)గా పనిచేసిన ఉమంగ్ వోహ్రా నిలిచారు. ఈయన రూ.45.73 కోట్ల పారితోషికాన్ని పొందారు. వోహ్రాతో పోలిస్తే మురళీ కె దివి పారితోషికం రెట్టింపునకు పైగా ఉండటం గమనార్హం. 2025-26 ఆర్థిక సంవత్సరానికి తొమ్మిది దిగ్గజ నమోదిత ఔషధ తయారీ సంస్థలు- బయోకాన్, సిప్లా, డాక్టర్ రెడ్డీస్, దివీస్ లేబొరేటరీస్, లుపిన్, మ్యాన్‌కైండ్ ఫార్మా, సన్ ఫార్మా, టొరెంట్ ఫార్మా, జైడస్ లైఫ్ సైన్సెస్‌ల వార్షిక నివేదికల ఆధారంగా పై విశ్లేషణ చేశారు.

# ప్రైవేట్ బ్యాంకులు పడేశాయ్

### ఎఫ్‌ఐఐ విక్రయాలు: రూ.1,121 కోట్లు

### డీఐఐ కొనుగోళ్లు: రూ.1,312 కోట్లు



**న్యూఢిల్లీ:** హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ వంటి బ్లూచిప్ బ్యాంకింగ్ షేర్లకు అమ్మకాలు వెల్లువెత్తడంతో సోమవారం సెన్సెక్స్, నిఫ్టీ నష్టపోయాయి. అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు పెరగడం ఇందుకు తోడైంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి 6 పైసలు తగ్గి 96.36 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 0.1% పెరిగి 88.20 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బీఎస్‌ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.1.70 లక్షల కోట్లు పెరిగి రూ.482.62 లక్షల కోట్ల (5 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది. సెన్సెక్స్ ఉదయం 78151.45 పాయింట్ల వద్ద స్తబ్దుగా ప్రారంభమైంది. వెంటనే నష్టాల్లోకి జారుకున్న సూచీ, ఇంట్రాడేలో 77,368.29 పాయింట్ల వద్ద కనిష్ఠానికి పడిపోయింది. చివరకు 442.93 పాయింట్ల నష్టంతో 77,708.52 వద్ద ముగిసింది. నిఫ్టీ 95.80 పాయింట్లు కోల్పోయి 24,238.50 దగ్గర స్థిరపడింది. సెన్సెక్స్ 30 షేర్లలో 19 లాభపడ్డాయి. ట్రెంట్ 2.98%, పవర్‌గ్రిడ్ 1.82%, భారతీ ఎయిర్‌టెల్ 1.68%, ఎన్‌టీపీసీ 1.57%, ఎస్‌బీఐ 1.51%, అల్ట్రాటెక్ 1.47% పెరిగాయి. యాక్సిస్ బ్యాంక్ 5.48%, మారుతీ 2.18%, కోటక్ బ్యాంక్ 2%, ఇన్ఫోసిస్ 0.92%, టీసీఎస్ 0.80% నష్టపోయాయి. రంగాల వారీ సూచీల్లో.. ప్రైవేట్ బ్యాంక్స్ 2.15%, ఆర్థిక సేవలు 0.97%, బ్యాంకింగ్ 0.77% తగ్గాయి. బీఎస్‌ఈలో 2120 షేర్లు నష్టపోగా, 2164 స్క్రిప్‌లు లాభపడ్డాయి. 236 షేర్లలో ఎటువంటి మార్పులేదు. ఐపీఓ ద్వారా నిధులు సమీకరించేందుకు అబ్సొల్యూ ట్ ప్రాజెక్ట్స్, జిందాల్ సుప్రీం ఇండియా లిమిటెడ్‌లకు మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ అనుమతి ఇచ్చింది. ఈ రెండు సంస్థ ఈ ఏడాది ఏప్రిల్- మేలో ఐపీఓ పత్రాలు దాఖలు చేశాయి. లోహియా కార్ప్ ఐపీఓ ఈ నెల 23న ప్రారంభమై 27న ముగియనుంది. ఇందుకు ధరల శ్రేణిగా రూ.404- 425 నిర్ణయించారు. గరిష్ఠ ధర వద్ద కంపెనీ రూ.1102 కోట్లు సమీకరించ నుంది. యాంకర్ మదుపర్లు ఈ నెల 22న బిడ్లు దాఖలు చేయొచ్చు. ఇండో ఎంఐఎం ఐపీఓ ఈ నెల 23న ప్రారంభమై 27న ముగియనుంది. ధరల శ్రేణిగా రూ.461- 485 నిర్ణయించారు. గరిష్ఠ ధర వద్ద కంపెనీ రూ.3,812 కోట్లు సమీకరించనుంది. కంపెనీ మార్కెట్ విలువ రూ.24,000 కోట్లుగా నమోదయ్యే అవకాశం ఉంది. రిటెయిల్ మదుపర్లు కనీసం 30 షేర్లకు బిడ్లు దాఖలు చేయాలి. జూన్ త్రైమాసిక ఫలితాలు మదుపర్లను నిరాశపరచడంతో యాక్సిస్ బ్యాంక్ షేరు 5.48% కుదేలై రూ.1256.10 వద్ద ముగిసింది. సంస్థ మార్కెట్ విలువ రూ.22,638.33 కోట్లు తగ్గి రూ.3.90 లక్షల కోట్లకు చేరింది. ఆశించిన స్థాయిలో మార్జిన్ వృద్ధి లేకపోవడంతో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేరు 5.12% క్షీణించి రూ.777.65 దగ్గర స్థిరపడింది. సంస్థ మార్కెట్ విలువ రూ.64,685.58 కోట్లు ఆవిరై రూ.11.97 లక్షల కోట్లకు పరిమితమైంది. ఐసీఐసీఐ బ్యాంక్ షేరు 1.32% పెరిగి రూ.1461 వద్ద ముగిసింది. సంస్థ మార్కెట్ విలువ రూ.13,716.46 కోట్లు పెరిగి రూ.10.48 లక్షల కోట్లకు చేరింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు ఆరంభంలో రూ.1346.25 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరకు 0.31% తగ్గి రూ.1323.10 దగ్గర ముగిసింది.

# రెండో రోజూ నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్ సూచీలు

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు రెండో రోజూ నష్టాల్లో ముగిశాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతలు, చమురు ధరలు పెరగడం, విదేశీ మదుపర్ల విక్రయాలు జరపడం మార్కెట్‌పై ప్రతికూల ప్రభావాన్ని చూపాయి. దీంతో సెన్సెక్స్ 238 పాయింట్లు కోల్పోగా.. సెన్సెక్స్ 50 పాయింట్ల మేర పతనమైంది. సెన్సెక్స్ 238.41 పాయింట్ల నష్టంతో 77,470.11 వద్ద ముగిసింది. నిఫ్టీ 50.80 పాయింట్లు పతనమై 24,187.70 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్30 సూచీలో బజాజ్‌ఫైనాన్స్, ఇండిగో, అల్ట్రాటెక్ సిమెంట్, హెచ్‌సీఎల్, మహీంద్రా అండ్ మహీంద్రా, టైటాన్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. హెచ్‌డీఎఫ్‌సీ, రిలయన్స్, ఎస్‌బీఐ, టీసీఎస్, ఇన్ఫోసిస్ షేర్లు నష్టాలను చవిచూశాయి. డాలరుతో పోలిస్తే రుపాయి విలువ 96.24 వద్ద ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 89.33 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్స్ ధర 4,066 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.



## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

**బంగారం ధరలు (10 గ్రాములు)**
హైదరాబాద్

| ₹ 1,53,140 | ₹ 1,67,064 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 2,60,000

# బ్యాంకులకు పశ్చిమాసియా సెగ

పశ్చిమాసియాలో మళ్లీ పెరుగుతున్న ఉద్రిక్తతలు భారత్ బ్యాంకుల్లోని విదేశీ కరెన్సీ నాన్-రెసిడెంట్ (ఎఫ్‌సీఎన్‌ఆర్-బి) డిపాజిట్ల సమీకరణపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. విదేశీ మూలధనాన్ని ఆకర్షించేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) పలు ప్రోత్సాహకాలు ప్రకటించినప్పటికీ, పరిస్థితులు అనుకూలించకపోవడంతో ఆశించిన స్థాయిలో నిధులు రావడం లేదు. డిపాజిట్లను పెంచేందుకు వీలు కల్పించే లివరేజ్ పథకాన్ని అమలు చేయడంలో ఆలస్యం కావడమూ ఈ మందగమనానికి దారి తీసిందని బ్యాంకింగ్ నిపుణులు పేర్కొంటున్నారు.



ఇవీ కారణాలు: పశ్చిమాసియాలో ఉద్యోగాలు చేస్తున్న ప్రవాసులు అక్కడి భౌగోళిక రాజకీయ అనిశ్చితి వల్ల దీర్ఘకాలిక డిపాజిట్లపై నిర్ణయాలు వాయిదా వేస్తున్నారు. అమెరికా, ఇరాన్‌ల మధ్య దాడులు జరుగుతుండటం, కొందరి ఉద్యోగాలు పోతుండటంతో వారు ఆందోళన చెందుతున్నారు. దీనివల్ల దీర్ఘకాలిక కాలపరిమితి ఉన్న ఎఫ్‌సీఎన్‌ఆర్ (బి) డిపాజిట్లలో పెట్టుబడులకు విముఖత చూపుతున్నారు. లాక్-ఇన్ వ్యవధి ఉండే ఈ డిపాజిట్లతో పోలిస్తే, ఎప్పుడైనా వెనక్కి తీసుకునే వీలున్న సాధారణ ఫిక్స్‌డ్ డిపాజిట్లలో డబ్బులు దాచుకునేందుకే ఎన్‌ఆర్‌ఐలు మొగ్గు చూపిస్తున్నారు. నిధులను ఆకర్షించేందుకు బ్యాంకులు వడ్డీ రేట్లను పెంచినప్పటికీ, విదేశీ బ్రాంచీల్లో తగినంత మూలధనం లేకపోవడంతో ప్రభుత్వ బ్యాంకులు వినియోగదారులకు లివరేజ్ సదుపాయాన్ని కల్పించలేకపోతున్నాయి. విదేశాల్లో నిధుల సమీకరణ వ్యయమూ పెరిగింది. కొన్ని బ్యాంకులు మాత్రమే ఇప్పటివరకూ డాలర్ల బాండ్ల ద్వారా నిధులు సమీరించగా, ఇతర బ్యాంకులు తమ ప్రణాళికలను వాయిదా వేసుకోవడం, ఇంకా చర్చలు జరుపుతుండటం చేస్తున్నాయి.

**బ్యాంకర్ల ధీమా**

నిధుల సమీకరణ వేగవంతం చేయడం కోసం ఆర్థిక మంత్రి, ఆర్‌బీఐ ఉన్నతాధికారులు బ్యాంకుల అధికారులతో సమావేశాలు నిర్వహిస్తూనే ఉన్నారు. సెప్టెంబరు 30 గడువు ముగిసేలోపు నిధుల సమీకరణ పుంజుకుంటుందని బ్యాంకర్లు ధీమా వ్యక్తం చేస్తున్నారు. 2013 పథకంలోనూ చివరి నెలలోనే అత్యధిక నిధులు వచ్చాయని అంటున్నారు.

# ఐటీఆర్-1, ఐటీఆర్-2.. ఏది ఫైల్ చేయాలి?

**న్యూఢిల్లీ:** ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేయడానికి గడువు దగ్గరపడింది. పట్టుమని 10 రోజులు కూడా లేకపోవడంతో రిటర్నులు దాఖలు చేయడానికి చాలా మంది ఇప్పుడిప్పుడే త్వరపడుతున్నారు. ఈ హడావుడిలో కొందరు ఫారాలు ఎంపిక చేసుకోవడంలో పొరపడుతుంటారు. వేతనం ద్వారా ఆదాయం వస్తోంది కాబట్టి ఐటీఆర్-1 దాఖలు చేస్తే సరిపోతుందని భావిస్తుంటారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో కొన్ని లావాదేవీలు, పెట్టుబడుల కారణంగా మీకు ఐటీఆర్-1 సరిపోకపోవచ్చు. ఒకవేళ పొరపాటున తప్పుడు ఫారం ద్వారా రిటర్నులు సమర్పిస్తే ఆదాయపు పన్ను విభాగం 'డిఫెక్టివ్ రిటర్న్'గా పరిగణించే ప్రమాదం ఉంది. కాబట్టి వేతన జీవులు ఐటీఆర్-1, ఐటీఆర్-2లో ఏది ఎంపిక చేసుకోవాలనే విషయంలో స్పష్టత కలిగి ఉండడం మంచిది.

**ఐటీఆర్-1 ఎవరికి?**

వేతనం, లేదా పెన్షన్‌పై ఆదాయం వచ్చే వారు ఐటీఆర్-1 దాఖలు చేయాలి. పన్ను చెల్లింపుదారుల వార్షికాదాయం కచ్చితంగా రూ.50లక్షలలోపే ఉండాలి. రెండు సొంతిళ్ల నుంచి ఆదాయం కలిగిన వారు సెక్షన్ 112ఏ కింద దీర్ఘకాలిక మూలధన





లాభాల రూ.1.25 లక్షలలోపు ఉన్నవారు వ్యవసాయ ఆదాయం రూ.5వేలులోపు ఉండాలి. పొదుపు ఖాతా, ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ, ఆదాయపు పన్ను రీఫండ్, ఇతర వడ్డీ ఆదాయాలు ఉన్నవారు ఐటీఆర్-1ను ఎంపిక చేసుకోవచ్చు. ఐటీఆర్-2 ఎవరు దాఖలు చేయాలి? వార్షికాదాయం రూ.50 లక్షలలోపు ఉన్నవారు స్టార్టప్ కంపెనీలో ఇూాఖబపై పన్ను చెల్లింపు వాయిదా పడినప్పుడు ఏదైనా కంపెనీలో డైరెక్టర్‌గా ఉన్న సందర్భాల్లో రెండు కంటే ఎక్కువ సొంతిళ్లు కలిగినవారు రూ.1.25 లక్షల కంటే ఎక్కువ దీర్ఘకాలిక మూలధన లాభాలు కలిగినవారు స్వల్పకాలిక మూలధన లాభాలు (ఎస్‌టీసీజీ) ఉన్నప్పుడు (స్టాక్ మార్కెట్/ మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు పెట్టినవారు) గత సంవత్సరంలో ఎప్పుడైనా అన్‌లిస్టెడ్ ఈక్విటీ షేర్లను కలిగి ఉండడం పన్ను పరిధిలోకి వచ్చే ఇతర మూలధన నష్టాలను తదుపరి సంవత్సరాలకు బదిలీ చేసుకోవాల్సిన సందర్భాల్లో విదేశీ ఆదాయం, రూ.5వేల కంటే ఎక్కువ వ్యవసాయ ఆదాయం ఉన్నప్పుడు కరెంట్ ఖాతాలో రూ.1 కోటి కంటే ఎక్కువ డిపాజిట్లు విదేశీ ప్రయాణాల కోసం రూ.2 లక్షల కంటే ఎక్కువ ఖర్చు చేసినప్పుడు ఏడాదికి రూ.1 లక్ష కంటే ఎక్కువ కరెంట్ బిల్లు చెల్లించినప్పుడు ఐటీఆర్-2 దాఖలు చేయాల్సి ఉంటుంది.

**తప్పుడు ఐటీఆర్ ఫారం ఫైల్ చేస్తే ఏమౌతుంది?**

ఒకవేళ మీరు పొరపాటున తప్పుడు ఐటీఆర్ ఫారాన్ని ఎంచుకుని సబ్‌మిట్ చేస్తే, ఆదాయపు పన్ను విభాగం దాన్ని సెక్షన్ 139 (9) కింద డిఫెక్టివ్ రిటర్న్‌గా (లోపభూయిష్టమైనది) పరిగణిస్తుంది. ఐటీ నోటీసు పంపి ఆ తప్పును సరిదిద్దుకోవడానికి సాధారణంగా 15 రోజుల సమయం ఇస్తుంది. ఆ లోపాన్ని సరిచేసే వరకు మీ ఐటీఆర్ ప్రాసెస్ అవ్వదు. దీనివల్ల మీ రీఫండ్ ఆలస్యమవుతుంది. ఇచ్చిన సమయంలోగా లోపాన్ని సరిచేయకపోతే, అసలు మీరు ఐటీఆరే ఫైల్ చేయనట్లుగా పరిగణిస్తారు. దీనివల్ల పెనాల్టీలు, వడ్డీ భారం పడుతుంది. కాబట్టి జులై 31లోపు సరైన ఫారాన్ని ఎంచుకుని రిటర్నులు దాఖలు చేయండి. చివరి నిమిషం వరకు వేచి చూడొద్దు.

# 5 ఏళ్లలో 273% పెరిగిన యూపీఐ లావాదేవీల విలువ

దిల్లీ: యూపీఐ లావాదేవీలు గత అయిదేళ్లలో భారీగా విస్తరించాయి. లావాదేవీల సంఖ్య పరంగా 425%, విలువలో 273% మేర వృద్ధి నమోదైంది. సోమవారం లోక్‌సభకు కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి పంకజ్‌చౌధరి ఈ సమాచారాన్ని అందించారు. 2026 జూన్ నాటికి యూపీఐ వినియోగదారుల సంఖ్య 55.49 కోట్లకు చేరింది. యూపీఐ చెల్లింపులను భద్రంగా, సురక్షితంగా మార్చేందుకు ఆర్‌బీఐ, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్‌పీసీఐ) నిరంతరం చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి వెల్లడించారు. ప్రస్తుతం 10 దేశాలు 12 భాగస్వామ్య సంస్థలతో కలిసి యూపీఐని ఉపయోగిస్తున్నట్లు వెల్లడించారు. ఇందులో భూటాన్, సింగపూర్, యూఏఈ, ఫ్రాన్స్ మారిషస్, శ్రీలంక, నేపాల్, ఖతార్, గ్రీస్, కాంబోడియా ఉన్నాయని చెప్పారు.






# ఎస్‌బీఐ.. లిస్టింగ్‌లో నిరాశే

**న్యూఢిల్లీ:** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) అనుబంధ ఎస్‌బీఐ ఫండ్స్ మేనేజ్‌మెంట్ దలాల్ స్ట్రీట్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. ఐపీఓలో అనూహ్య స్పందన లభించినప్పటికీ.. లిస్టింగ్‌లో మాత్రం అంతగా ఆకట్టుకోలేకపోయింది. దీంతో వాటాదారులకు నిరాశే ఎదురైంది. మంగళవారం ఎస్‌బీఐ ఫండ్స్ షేర్ ఇష్యూ ధర రూ.574 పోలిస్తే.. కేవలం 6 శాతం ప్రీమియంతో ఎన్‌ఎస్‌ఈలో రూ.613 వద్ద ట్రేడింగ్ మొదలెట్టింది. బీఎస్‌ఈలో రూ.610 వద్ద లిస్ట్ అయ్యింది. అనంతరం దాదాపు 9 శాతం ప్రీమియంతో రూ.625 వద్ద గరిష్ఠాన్ని తాకింది. మధ్యాహ్నం 2 గంటల సమయంలో బీఎస్‌ఈలో రూ.616 వద్ద ట్రేడవుతోంది. ఎస్‌బీఐ ఫండ్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ సుమారు రూ.1.17 లక్షల కోట్ల మార్కెట్ విలువతో ఐపీఓకు వచ్చింది. రూ.11,693 కోట్ల నిధులను సమీకరించింది. ఐపీఓ ధరల శ్రేణిని రూ.545-574గా ప్రకటించింది. జులై 14 నుంచి 16 వరకు జరిగిన సబ్‌స్క్రిప్షన్‌కు అనూహ్య స్పందన లభించింది. 41.66 రెట్ల బిడ్డింగ్‌లను అందుకుంది. పూర్తి ఆఫర్ ఫర్ సేల్ రూపంలో ఈ పబ్లిక్ ఇష్యూ జరిగింది. ఎస్‌బీఐ, అముండీ ఇండియా హోల్డింగ్ ఐపీఓలో భాగంగా తమ వాటాలు విక్రయించాయి.

ఉద్యోగులను కోటీశ్వరులుగా మార్చిన ఐపీవో

ఎస్‌బీఐ ఫండ్స్ ఐపీఓ ద్వారా 13 మంది ఉద్యోగులు కోటీశ్వరులుగా మారారు. 2018 నుంచి అమలు చేసిన ఉద్యోగ స్టాక్ ఆప్షన్ల వల్ల పలువురు సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లకు కేటాయించిన షేర్లు భారీ లాభాలను ఆర్జించాయి. వీరిలో డిప్యూటీ ఎండీ దేవేందర్ పాల్ సింగ్‌కు చెందిన వెస్టెడ్ షేర్ విలువ రూ. 21.14 లక్షల నుంచి రూ.121 కోట్లకు పెరిగింది. ఫండ్ హౌస్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ శ్రీనివాసన్ రామ అయ్యర్ షేర్ విలువ రూ.105 కోట్లుగా ఉంది. మొత్తంగా 13 మందికి పైగా ఉద్యోగుల షేర్ల విలువ రూ.1 కోటి కంటే ఎక్కువగా ఉండటం గమనార్హం.



# దేశ సరిహద్దు దాటితే వాహన బీమా వర్తిస్తుందా?

## స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వండి

## ఐఆర్‌డీఏఐకి సుప్రీంకోర్టు సూచన

**దిల్లీ:** దేశ సరిహద్దు దాటి ప్రయాణించే వాహనాల బీమా రక్షణ నిబంధనలను సరళీకరిస్తూ, అన్ని వాహన బీమా పాలసీల్లో ఒకే రకమైన నిబంధనలు ఉండేలా సమగ్ర మార్గదర్శకాలు జారీ చేయాలని ఐఆర్‌డీఏఐకు సుప్రీంకోర్టు సూచించింది. బీమా పత్రాల్లోని భాష ఎలాంటి అస్పష్టత లేకుండా విదేశీ పరిధి వర్తిస్తుందో లేదో తెలియజేయాలని జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. బీమా చేసిన వాహనానికి ఇతర దేశాలకు వెళ్లేందుకు అనుమతి ఉన్నప్పటికీ.. తమ పాలసీ భారత భౌగోళిక సరిహద్దుల వెలుపల వర్తించదనే విషయాన్ని బీమా సంస్థ పాలసీ పత్రాల్లోనే అత్యంత స్పష్టంగా పేర్కొని ఉండాల్సిందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. 2010లో దుర్గ్ నుంచి నేపాల్ తీర్థయాత్రకు వెళ్లిన బస్సు కొండను ఢీకొన్న ఘటనలో డ్రైవర్ సహా ముగ్గురు చనిపోయారు. ఈ ప్రమాదంలో మరణించిన వ్యక్తి కుటుంబానికి రూ.32.67 లక్షల పరిహారం చెల్లించాలన్న ఛత్తీస్‌గఢ్ హైకోర్టు ఉత్తర్వులను సవాలు చేస్తూ బీమా సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. విదేశాలకు వెళ్లేటప్పుడు తీసుకునే ఆరోగ్య బీమా మాదిరిగానే, ఈ అదనపు కవరేజీ సమాచారాన్ని పాలసీదారుకు ముందే తెలియజేయాల్సిందని ధర్మాసనం పేర్కొంది.

# ఎన్‌టీపీసీ నుంచి బొండాడకు బీఈఎస్‌ఎస్ ప్రాజెక్టు

హైదరాబాద్: మౌలిక వసతుల రంగంలోని హైదరాబాద్ సంస్థ బొండాడ ఇంజినీరింగ్‌కు ఎన్‌టీపీసీ రెన్యూవబుల్ ఎనర్జీ నుంచి కీలక ప్రాజెక్టు దక్కింది. గుజరాత్‌లోని ఖవ్డా సోలార్ పార్కులో 100 మెగావాట్ల అవర్ (ఎండబ్ల్యూహెచ్) వెనేడియం రిడాక్స్ ఫ్లో బ్యాటరీ (వీఆర్ఎఫ్‌బీ) ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ (బీఈఎస్‌ఎస్) ఏర్పాటుకు ఈ ఒప్పందం కుదిరింది. డీలెక్ట్రిక్ సిస్టమ్స్ సాంకేతిక భాగస్వామ్యంతో దీనిని చేపట్టనున్నారు. పది నెలల కాల పరిమితిలో ఈ ప్రాజెక్టును పూర్తి చేయాల్సి ఉంటుంది. దీని విలువను కంపెనీ వెల్లడించ లేదు. పదేళ్లపాటు దీని నిర్వహణ బాధ్యతలనూ బొండాడ చూసుకుంటుంది. ప్రస్తుతం దేశంలో వాడుతున్న లిథియం బ్యాటరీలతో పోలిస్తే ఇవి సురక్షితమైనవనీ, 25-30 ఏళ్లపాటు పనిచేస్తాయని బొండాడ గ్రూపు సీఎండీ బొండాడ రాఘవేంద్రరావు, సీఈఓ ఆర్.శ్రీనివాస్ తెలిపారు. దేశీయంగా లభించే వెనేడియం ఖనిజాన్ని వాడటం వల్ల చైనా దిగుమతులపై ఆధారపడటం తగ్గుతుందని పేర్కొన్నారు. దేశ ఇంధన రంగంలో ఈ ప్రాజెక్టు ఒక మైలురాయిగా నిలుస్తుందని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.10,000 కోట్లుగా ఉన్న ఆర్డరు పుస్తకం 2026-27 చివరకు రూ.15,000 కోట్లకు చేరొచ్చని కంపెనీ అంచనా కట్టింది. ప్రస్తుతం 1.2 గిగావాట్‌అవర్ బ్యాటరీ నిల్వ సామర్థ్యం సంస్థకుంది. డేటా సెంటర్లు, రక్షణ రంగంలోకి కంపెనీ అడుగుపెట్టడం ద్వారా 2030 నాటికి ఈ విభాగాల నుంచి 30% ఆదాయాన్ని లక్ష్యంగా పెట్టుకుంది.

# పాక్‌తో సింధూనదీ జలాల ఒప్పందంలో మార్పులు తప్పనిసరి

### ఇప్పుడున్నట్లుగా కొనసగాడం కుదరదు: కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ,జులై21(జనంసాక్షి): సింధూ జలాల ఒప్పందం ప్రస్తుత రూపంలోనే మళ్లీ అమల్లోకి వచ్చే అవకాశమే లేదని తెలుస్తోంది. ఈ ఒప్పందాన్ని పునరుద్ధరించాల్సి వస్తే.. మార్పులు తప్పనిసరి అని భారత ప్రభుత్వం స్పష్టమైన వైఖరి ప్రదర్శిస్తోంది. అది కూడా పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని విడనాడితేనే సాధ్యమవు తుందని చెబుతోంది. ఈ మేరకు ప్రభుత్వవర్గాలను ఉటంకిస్తూ ఓ జాతీయ మీడియా కథనం పేర్కొంది. గతేడాది పహల్గాం దాడి తర్వాత భారత ప్రభుత్వం ఆపరేషన్ సిందూర్‌తో పాక్‌కు గట్టి బుద్ధి చెప్పింది. ఇరు దేశాల మధ్య ఆరు దశాబ్దాలకుపైగా ఉన్న సింధూజలాల ఒప్పందాన్ని నిలిపివేసింది . అయితే.. ప్రస్తుతానికి ఆ ఒప్పందం నుంచి వైదొలగాలని ప్రభుత్వం ఆలోచించడం లేదని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. ఏ అంతర్జాతీయ ఒప్పందమైనా దేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉన్నట్లు తేలితే.. ఒక సార్వభౌమ దేశంగా దానిని రద్దు చేసే హక్కు భారత్‌కు ఉందని పేర్కొన్నాయి. సింధూ జలాల విషయంలో భారత నిర్ణయం పాకిస్థాన్ చర్యలపైనే ఆధారపడి ఉంటుందన్నాయి. ఆ ఒప్పందం నిలిపివేసినప్పటి నుంచి ఉక్కిరిబిక్కిరి అవుతోన్న పాక్.. సింధూ జలాల్లో తమ వాటా తీసుకుంటే తీవ్రపరిణామాలు తప్పవని ప్రేలాపనలు చేస్తోంది. ఒప్పందం నిలిపివేత వల్ల ఆ దేశంలో నీటికొరత ఏర్పడుతోందని చేస్తోన్న ప్రకటనలను భారత్ ఖండిస్తోంది. నీటిని నిల్వ చేసే సామర్థ్యాలు లేకనే భారతదేశాన్ని నిందిస్తూ.. పాక్ తప్పుడు ప్రచారం చేస్తోందని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. భారత్ పదేపదే ఆందోళన వ్యక్తం చేసినప్పటికీ.. ఉగ్రవాదాన్ని అరికట్టడానికి దాయాది అర్థవంతమైన చర్యలు తీసుకున్న దాఖలాలు ఏవీ లేవన్నాయి. అదీగాక ఐక్యరాజ్యసమితి నిషేధిత జాబితాలో ఉన్న వ్యక్తులు పాక్‌లో బహిరంగ కార్యక్రమాల్లో కనిపిస్తున్నారని ఎండగట్టాయి. పశ్చిమ నదులైన జీలం, చినాబ్‌లపై జమ్మూకశ్మీర్‌లో నిర్మితమవుతున్న జల విద్యుత్ కేంద్రాలపై పాకిస్థాన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. ఆ ప్రాజెక్టులను ఆలస్యం చేసేందుకు ఒప్పందంలోని వివాదాల పరిష్కారాలకు సంబంధించిన నిబంధనలను పాక్ దుర్వినియోగం చేస్తోందని ప్రభుత్వ వర్గాలు ఆరోపించాయి.

# మిషన్ మోడ్‌తో ఎల్‌నినోను ఎదుర్కొందాం

- అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్
- రాష్ట్రంలో తక్కువ వర్షపాతం అవకాశాలు
- రైతులు, ప్రజల రక్షణే ప్రభుత్వ లక్ష్యం
- అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి





రంగారెడ్డి, జూలై 21 (జనంసాక్షి) : ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని రైతులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో మిషన్ మోడ్‌లో పని చేయాలని రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని గుర్తు చేశారు. ఈ తరుణంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అప్పుడే కరువు పరిస్థితులను అధిగమించవచ్చని తెలిపారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అధ్యక్షతన ఎల్-నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రూపొందించిన ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికపై నిర్వహించిన ఉమ్మడి సమీక్షా సమావేశంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ, సంభావ్య వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రతి శాఖ ముందస్తు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసి, కంటింజెన్సీ ప్లాన్‌లను పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించడం, అవసరమైన విత్తనాల సరఫరా, తాగునీటి ఏర్పాట్లు, పశువులకు మేత, ఉపాధి హామీ పనులు, నిరంతర విద్యుత్ సరఫరా, వైద్య సేవలు వంటి అంశాల్లో ఎలాంటి లోటు లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. వరికి బదులుగా తక్కువ నీటితో సాగయ్యే పెసర, కంది, జొన్న, రాగులు వంటి పంటలను ప్రోత్సహించాలని, రైతులకు అవసరమైన ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను వెంటనే అందుబాటులో ఉంచాలని సూచించారు. పశువులకు పశుగ్రాసం కొరత తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా జల వనరులను ప్రణాళికాబద్ధంగా వినియోగించాలన్నారు. అవసరమైన చోట కొత్త బోర్లు తవ్వించడం, తాగునీటి బోర్లకు నిరంతర విద్యుత్ సరఫరా కల్పించడం, స్థానిక సమస్యలను వెంటనే పరిష్కరించేలా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ప్రకృతి వైపరీత్యాలను నివారించడం సాధ్యం కాకపోయినా, ముందస్తు ప్రణాళికలు, సమన్వయంతో వాటి ప్రభావాన్ని గణనీయంగా తగ్గించవచ్చని స్పీకర్ పేర్కొన్నారు. ఎల్-నినో ప్రభావంతో ఏర్పడే అనావృష్టి పరిస్థితుల నుంచి ప్రజలను రక్షించడం జిల్లా యంత్రాంగం బాధ్యతని, అన్ని శాఖలు సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ, తక్కువ వర్షపాతం పరిస్థితుల్లో రైతులు వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో సాగయ్యే పంటలు, ఉద్యాన పంటలు, పండ్ల తోటలు, పూల సాగుపై దృష్టి సారించాలన్నారు. మండల స్థాయిలో వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు ప్రత్యేక సమావేశాలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించాలన్నారు.

జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి మాట్లాడుతూ, అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు కార్యాచరణ ప్రణాళికలను అమలు చేయాలని సూచించారు. తాగునీటి కొరత తలెత్తకుండా ప్రత్యామ్నాయ నీటి వనరులను సిద్ధం చేయాలన్నారు. గ్రామాలు, పట్టణాల్లో నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు తమ శాఖల యాక్షన్ ప్లాన్‌లు, కంటింజెన్సీ ప్రణాళికలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం తెలంగాణ జలసిరి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా స్పెషల్ ఆఫీసర్లు సవ్యసాచి, వికాస్ రాజ్, శాసన సభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి, కాలే యాదయ్య, వీర్లపల్లి శంకర్, మనోహర్ రెడ్డి, హెచ్‌ఎండబ్ల్యూఎస్ ఎస్‌బీ మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి, శాసన మండలి సభ్యులు దయానంద్, జిల్లా అదనపు కలెక్టర్లు కె. కిరణ్మయి, చంద్రారెడ్డి, డీఆర్ఓ శారద, మున్సిపల్ చైర్మన్లు, ఆర్డీఓలు, వ్యవసాయం, ఉద్యానవనం, పశు సంవర్ధక, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, మున్సిపల్, రెవెన్యూ, వైద్య ఆరోగ్య, భూగర్భ జలాలు, నీటిపారుదల తదితర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రెనోవా బిబి క్యాన్సర్ హాస్పిటల్స్‌లో అత్యాధునిక బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్, సెల్యులార్ థెరపీ సేవలు

- బ్లడ్ క్యాన్సర్లు, తీవ్రమైన రక్త రుగ్మతలకు అత్యాధునిక చికిత్సలు
- అందుబాటులో.. విప్లవాత్మక కార్-టి సెల్ థెరపీ
- హెపా ఫిల్టర్ సౌకర్యంతో కూడిన అత్యంత సురక్షితమైన చికిత్సా విభాగాలు



ముషీరాబాద్, జూలై 21 (జనం సాక్షి): బ్లడ్ క్యాన్సర్లు, క్లిష్టమైన రక్త సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న చిన్నారులు, పెద్దలకు అత్యాధునిక చికిత్సలు అందించేందుకు హైదరాబాద్ లో రెనోవా బిబి క్యాన్సర్ హాస్పిటల్స్‌లో బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ (బీఎమ్‌టీ), సెల్యులార్ థెరపీ సేవలు రోగులకు అందుబాటులోకి తీసుకొచ్చింది. దీంతో హైదరాబాద్ లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు పొరుగు రాష్ట్రాల రోగులు అంతర్జాతీయ ప్రమాణాల చికిత్సను అందుబాటు ధరల్లో, తమకు చేరువలోనే పొందే అవకాశం లభిస్తుంది. ఈ సందర్భంగా సీనియర్ కన్సల్టెంట్ మెడికల్ ఄ హీమాటో-ఆంకాలజిస్ట్, క్లినికల్ లీడ్ ఄ బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ ఄ సెల్యులార్ థెరపీ, డాక్టర్ ఎం.డి. నదీమ్ అహ్మద్ మాట్లాడుతూ... బ్లడ్ క్యాన్సర్లను ప్రారంభ దశలోనే గుర్తించి, సకాలంలో అత్యాధునిక చికిత్స అందించడం ద్వారా మెరుగైన చికిత్స ఫలితాలు సాధ్యమవుతాయని తెలిపారు. . రోగి శరీరంలోని రోగనిరోధక కణాలైన టీ-సెల్స్‌ను జన్యుపరంగా మార్పులు చేసి, క్యాన్సర్ కణాలను గుర్తించి వాటిని లక్ష్యంగా చేసుకుని నాశనం చేసే కార్-టి సెల్ థెరపీ ద్వారా ల్యుకేమియా, లింఫోమా వంటి బ్లడ్ క్యాన్సర్ల చికిత్సలో ఆశాజనక ఫలితాలు లభిస్తున్నాయని తెలిపారు. హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్, సీనియర్ కన్సల్టెంట్ రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ సయ్యద్ అక్బర్ కోత్వాల్ మాట్లాడుతూ...అధునాతన క్యాన్సర్ వైద్యాన్ని సామాన్యులకు సైతం అందుబాటులోకి తేవాలనే మా సంకల్పానికి ఈ బీఎమ్‌టీ కేంద్రం నిదర్శనం అని చెప్పారు. హాస్పిటల్ సీఓఓ ప్రొఫెసర్ మహ్మద్ మసూద్ అహ్మద్ మాట్లాడుతూ... ఆసుపత్రి ప్రస్థానాన్ని వివరిస్తూ, దేశంలోనే కాక ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ఇటువంటి అత్యాధునిక క్యాన్సర్ చికిత్సా కేంద్రాల అవసరం మరింత పెరిగిందని అన్నారు. ప్రతి రోగికి సకాలంలో నాణ్యమైన క్యాన్సర్ చికిత్స అందుబాటులో ఉండేలా చేయడమే తమ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. నిపుణులైన వైద్య బృందంతో ప్రపంచ స్థాయి క్యాన్సర్ వైద్య సేవలను మరింత మంది రోగులకు చేరువ చేయడానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.

## 'సఫాయి అప్నా... భీమారీ భగావో' పోస్టర్ ఆవిష్కరణ

- జూలై 31 వరకు నగరవ్యాప్తంగా ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్
- సీజనల్ వ్యాధుల నివారణకు విస్తృత కార్యాచరణ
- దోమల నియంత్రణ, డ్రైనేజీల శుభ్రతపై ప్రత్యేక దృష్టి
- ప్రజల భాగస్వామ్యంతో కరీంనగర్‌ను పరిశుభ్ర నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యం : మేయర్, కమిషనర్



కరీంనగర్ బ్యూరో, జూలై 21 (జనంసాక్షి) : వర్షాకాలంలో సీజనల్, అంటువ్యాధులను నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "సఫాయి అప్నా... భీమారీ భగావో" ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం పోస్టర్‌ను మంగళవారం కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పారిశుధ్య, పర్యావరణ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్, కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జూలై 31 వరకు నగరవ్యాప్తంగా ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహిస్తామని తెలిపారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రతిరోజూ పారిశుద్ధ్య పనులను మరింత సమర్థవంతంగా చేపట్టి ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో భాగంగా నగరంలోని జీవీపీ పాయింట్లు, మార్కెట్లు, బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లు, ఇతర ప్రజా ప్రదేశాల్లో ప్రత్యేక శుభ్రత కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి శుభ్రపరచడంతో పాటు డ్రైనేజీల్లో పేరుకుపోయిన సిల్ట్, చెత్తను తొలగించి వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా దోమల నియంత్రణ కోసం యాంటీ లార్వా ఆపరేషన్లు, ఫాగింగ్, స్ప్రేయింగ్ కార్యక్రమాలను ముమ్మరం చేస్తామని వెల్లడించారు. అలాగే నగరంలోని ఖాళీ స్థలాలను గుర్తించి పరిశుభ్రం చేయడంతో పాటు స్లమ్ ప్రాంతాల్లో వంద శాతం డోర్-టు-డోర్ చెత్త సేకరణ, మెరుగైన పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్ కార్యక్రమాల్లో భాగంగా పాఠశాలలు, కళాశాలలు, స్వచ్ఛంద సంస్థలు, హోటళ్లు, రెస్టారెంట్లు, మార్కెట్ సంఘాల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి నగర పరిశుభ్రత, తడి-పొడి చెత్త వేరు చేయడం, వ్యర్థాల నిర్వహణ, చేతుల పరిశుభ్రత వంటి అంశాలపై అవగాహన కల్పిస్తామని చెప్పారు. అలాగే పారిశుధ్య కార్మికులకు తడి-పొడి చెత్త వేరు చేయడం, డోర్-టు-డోర్ చెత్త సేకరణ, సురక్షిత పరికరాల (పీ.పీ.ఈ కిట్లు) వినియోగంపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. జూలై 31 వరకు కొనసాగనున్న ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాల్లో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని, కరీంనగర్‌ను పరిశుభ్రమైన నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మేయర్ కొలగాని శ్రీనివాస్, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ అదనపు కమిషనర్లు ఆయాజ్, సువార్త, అసిస్టెంట్ కమిషనర్ రాజమనోహర్, డీఈ లచ్చిరెడ్డి, వెటర్నరీ అధికారి దుర్గాప్రసాద్ రెడ్డి, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ స్వామి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి

### టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ వెంకటరత్నం




వికారాబాద్, జూలై21 (జనంసాక్షి): నీట్ పేపర్ లీకేజీ, సీబీఎస్ఈ వాల్యుయేషన్‌లో చోటుచేసుకున్న అవకతవకలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని టీఎస్ యూటీఎఫ్ వికారాబాద్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ వెంకటరత్నం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర విద్యా మంత్రి రాజీనామా చేయాలనే డిమాండ్‌తో జూన్ 28 నుంచి ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరాహార దీక్ష చేపట్టిన సోనమ్ వాంగ్‌చుక్‌ను జూలై 19న బలవంతంగా ఆసుపత్రికి తరలించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని విమర్శించారు. అదే దీక్షా శిబిరంలో కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే, ఎస్ఎఫ్ఐ నాయకులు నిరాహార దీక్షను కొనసాగిస్తున్నారని తెలిపారు. ఆదివారం ఎస్ఎఫ్ఐ నాయకులు దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారని, వారి దీక్షలకు మద్దతుగా మరియు కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలకు ఎస్ఎఫ్ఐ పిలుపునిచ్చిందని పేర్కొన్నారు. ఈ పిలుపులో భాగంగా మంగళవారం సాయంత్రం వికారాబాద్ పట్టణంలోని ఎన్టీఆర్ ప్రధాన కూడలిలో టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్న కేంద్ర ప్రభుత్వం వెంటనే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ. రాములు, జిల్లా కార్యదర్శులు రత్నం, వికారాబాద్ మండల అధ్యక్షుడు ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి తిరుపతయ్య, నవాపేట్ మండల అధ్యక్షుడు రవీందర్, ప్రధాన కార్యదర్శి పరమేష్, కోట్‌పల్లి మండల అధ్యక్షుడు రామచందర్, జిల్లా నాయకులు వినోద్ కుమార్, వెంకటయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు తేజ, దీపక్, వెంకటయ్య, అనిల్, సీఐటీయూ నాయకులు మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

### పోచారం డివిజన్‌లో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ సమీక్ష

పోచారం , జూలై 21 (జనం సాక్షి): మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని పోచారం డివిజన్‌లో ఆర్‌జికేలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) సమీక్ష సమావేశంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు), బూత్ స్థాయి ఏజెంట్లు (బీఎల్ఏలు), పోచారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరు జాబితాలో తప్పనిసరిగా నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని, ఎలాంటి అర్హుల పేర్లు అన్యాయంగా తొలగించబడకుండా బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ఏజెంట్లు పరస్పర సమన్వయంతో బాధ్యతాయుతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఓటరు జాబితా స్వచ్ఛంగా, ఖచ్చితంగా ఉండేలా ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం పరిశీలించాలని సూచించారు.

## అన్నోజిగూడలో తల్లి ఇద్దరు చిన్నారులతో అదృశ్యం

- కుటుంబ కలహాల నేపథ్యంలో ఇంటి నుంచి వెళ్లిన మహిళ
- ఆచూకీ కోసం పోలీసుల గాలింపు

ఘట్‌కేసర్, జూలై 21 (జనం సాక్షి): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ మండలం అన్నోజిగూడలో ఓ మహిళ తన ఇద్దరు చిన్నారులతో కలిసి అదృశ్యమైన ఘటన కలకలం రేపింది. ఈ ఘటనపై పోచారం పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఎన్ఎఫ్‌సీఎస్ కాలనీకి చెందిన ఒర్సు లింగం తన భార్య సరిత (31)ను 2009లో వివాహం చేసుకొన్నా, వారికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఈ నెల 19వ తేదీ సాయంత్రం ఇంట్లో మంచానికి సంబంధించిన చిన్న కుటుంబ వివాదం జరగడంతో సరిత, రెండో అమ్మాయి (12), రిషిత్ (9)తో కలిసి కుటుంబ సభ్యులకు చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. భార్యకు పలుమార్లు ఫోన్ చేయగా తొలుత రింగ్ అయినప్పటికీ అనంతరం మొబైల్ స్విచ్ ఆఫ్ అయిందని భర్త ఫిర్యాదులో పేర్కొన్నాడు. బంధువుల ఇళ్లతో పాటు పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదని తెలిపాడు. గతంలో కూడా కుటుంబ కలహాల కారణంగా భార్య ఇంటి నుంచి వెళ్లి రెండు మూడు రోజుల తర్వాత తిరిగి వచ్చిన సందర్భాలు ఉండటంతో ఈసారి కూడా వస్తుందని భావించి వేచి చూశానని, అయితే ఇప్పటికీ తిరిగి రాకపోవడంతో పోలీసులను ఆశ్రయించినట్లు వివరించాడు. ఫిర్యాదు ఆధారంగా పోచారం పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి తల్లి, ఇద్దరు చిన్నారుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసులు కేసు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## ఉప్పల్ నియోజకవర్గంలోని చెరువుల అభివృద్ధిపై హైడ్రా కమిషనర్‌తో మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చర్చలు

### చెరువుల పరిరక్షణ, నీటి నిల్వ సామర్థ్యం పెంపు, సుందరీకరణకు పలు సూచనలు



ఉప్పల్, జూలై 21 (జనం సాక్షి): ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో ఇటీవల హైడ్రా ఆధ్వర్యంలో చేపట్టిన ఉప్పల్ నల్ల చెరువు, రామంతాపూర్ పెద్ద చెరువుల అభివృద్ధి పనులపై హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో మాజీ శాసన సభ్యుడు ప్రభాకర్ చర్చించారు. ఈ సందర్భంగా ఇంజినీర్గా, మాజీ శాసన సభ్యుడిగా తన అనుభవంతో చెరువుల అభివృద్ధికి సంబంధించిన పలు సూచనలు చేశారు. ముఖ్యంగా చెరువుల నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడం, చెరువుల సరిహద్దులను పరిరక్షించడం, టిడిఆర్‌ల కేటాయింపు, చెరువుల పరిధిలోని గుడిసెల్లో నివసిస్తున్న వారికి పునరావాసం కల్పించడం, సుందరీకరణ పనులను చేపట్టడం వంటి అంశాలపై కమిషనర్‌తో చర్చించారు.

ప్రభాకర్ చేసిన సూచనలను హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్వాగతించి, వాటిని పరిశీలిస్తామని తెలిపారు. త్వరలోనే రామంతాపూర్ చిన్న చెరువు, నాచారం ఎర్రగుంట చెరువులను కూడా అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా చేపట్టనున్నట్లు ప్రభాకర్‌కు కమిషనర్ తెలియజేశారు. అదేవిధంగా చెరువుల ఎఫ్‌టీఎల్ ప్రాంతాల్లో ఎస్టీపీల నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ప్రభాకర్ హైడ్రా కమిషనర్‌ను కోరారు. చెరువుల పరిరక్షణతో పాటు మురుగునీరు చెరువుల్లో కలవకుండా ఎస్టీపీలను ఏర్పాటు చేయడం ద్వారా చెరువులను సురక్షితంగా కాపాడుకోవచ్చని ఆయన సూచించారు.

## సైబర్ మోసాల బాధితులకు రూ.25 కోట్లకుపైగా రీఫండ్

- ఏడు నెలల్లో సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసుల విశేష ఫలితం
- వేగవంతమైన దర్యాప్తు, బ్యాంకులతో సమన్వయమే విజయానికి కారణం
- మోసానికి గురైన వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలని డీసీపీ పుష్ప సూచన

శేరిలింగంపల్లి, జూలై 21 (జనంసాక్షి): సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఈ ఏడాది జనవరి నుంచి జూలై వరకు సైబర్ ఆర్థిక మోసాలకు గురైన బాధితులకు రూ.25 కోట్లకుపైగా నగదును తిరిగి అందించేందుకు సైబర్ క్రైమ్ పోలీసులు విజయవంతంగా చర్యలు చేపట్టినట్లు సైబరాబాద్ సైబర్ క్రైమ్ డీసీపీ పుష్ప తెలిపారు. మంగళవారం సైబర్ క్రైమ్ విభాగం గత ఏడు నెలల పనితీరు నివేదికను విడుదల చేసిన సందర్భంగా ఆమె ఈ వివరాలను వెల్లడించారు. సైబర్ మోసాలకు సంబంధించిన కేసుల్లో వేగవంతమైన దర్యాప్తు, మోసపూరిత లావాదేవీలను సకాలంలో ఫ్రీజ్ చేయడం, బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో సమన్వయం, న్యాయస్థానాల ఆదేశాల మేరకు చట్టపరమైన ప్రక్రియలను సమర్థంగా పూర్తి చేయడం వల్లే ఈ స్థాయిలో బాధితులకు నగదు రీఫండ్ సాధ్యమైందని డీసీపీ తెలిపారు. సంబంధిత బ్యాంకు రీఫండ్‌కు అవసరమైన మొత్తాన్ని గుర్తించిన తర్వాత బాధితులకు ఎస్ఎంఎస్, ఈ-మెయిల్ ద్వారా ఎన్‌సీఆర్‌పీ పోర్టల్ లింక్ పంపుతారని, బాధితుడు ఎన్సీఆర్పీ అక్‌నాలెడ్జ్‌మెంట్ నంబర్, ఓటీపీతో లాగిన్ అయి బ్యాంకు ఖాతా వివరాలను ధృవీకరించడం లేదా నవీకరించడం, అవసరమైతే పాన్ కార్డు, కోర్టు ఉత్తర్వులను అప్‌లోడ్ చేసి దరఖాస్తు సమర్పించాల్సి ఉంటుందని వివరించారు. ఈ సాంకేతిక ఆధారిత విధానం ద్వారా రీఫండ్ ప్రక్రియ మరింత వేగవంతంగా, పారదర్శకంగా మారుతోందని పేర్కొన్నారు. డీసీపీ పుష్ప, గత నెలరోజుల్లోనే ఎన్‌సీఆర్‌పీ పోర్టల్ ద్వారా దాదాపు రూ.2 కోట్ల రీఫండ్ ప్రక్రియను ప్రారంభించి సైబర్ మోసాల బాధితులకు త్వరితగతిన న్యాయం అందించే దిశగా మరో కీలక అడుగు వేసినట్లు వెల్లడించారు.

## ఘనంగా బాల్కంపేట ఎల్లమ్మ కల్యాణ మహోత్సవం

### అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన ముఖ్యమంత్రి సతీమణి గీతారెడ్డి, కుమార్తె నియమిషారెడ్డి



బాల్కంపేట, జూలై 21 (జనం సాక్షి): బాల్కంపేట శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి కల్యాణ మహోత్సవం మంగళవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కల్యాణోత్సవంలో ముఖ్యమంత్రి సతీమణి గీతారెడ్డి, కుమార్తె నియమిషారెడ్డి పాల్గొని అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ అదంకి దయాకర్, మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, దేవాదాయ శాఖ కమిషనర్ హన్మంతరావు, ఆలయ కార్యనిర్వహణ అధికారి వినోద్ రెడ్డి, ఆలయ చైర్మన్ కొత్త సాయిబాబా గౌడ్ తదితరులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కల్యాణ మహోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. బాల్కంపేట పరిసర ప్రాంతాల్లో స్థానికుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ, మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతుల మోహాల్లో చిరునవ్వులు వెల్లివిరియాలని అమ్మవారిని మనసారా ప్రార్థించినట్లు తెలిపారు. తెలంగాణ ప్రజలు సుఖసంతోషాలతో, సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు వరుణ యాగాలు నిర్వహిస్తున్నామని, సమృద్ధిగా వర్షాలు కురిసి రాష్ట్రం పాడిపంటలతో కళకళలాడాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. కల్యాణ మహోత్సవం సందర్భంగా డీసీపీ రమణారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అడిషనల్ డీసీపీ శ్రీకాంత్, ఎస్ఆర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సనత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ అశోక్, ఎస్ఐలు మధుసూదన్ తదితరులు బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్, శాంతిభద్రతలను పోలీసులు పకడ్బందీగా పర్యవేక్షించారు.

## అనుమతులు లేకుండానే తరగతులా?

- మహేశ్వరంలో ప్రైవేట్ పాఠశాలలపై ఆరోపణలు
- శ్రీ చైతన్య టెక్నో స్కూల్, వశిష్ఠ కో-స్కూల్‌పై విద్యార్థి సంఘాల విమర్శలు
- విద్యాశాఖ నోటీసులు జారీ చేసినా తరగతులు కొనసాగుతున్నాయన్న ఆరోపణ
- అనుమతులు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్
- ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలని తెలంగాణ సోషల్ స్టూడెంట్ ఆర్గనైజేషన్ విజ్ఞప్తి



మహేశ్వరం, జూలై 21 (జనంసాక్షి): మహేశ్వరం గేట్ సమీపంలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్, వశిష్ఠ కో-స్కూల్‌లు విద్యాశాఖ అనుమతులు లేకుండానే తరగతులు నిర్వహిస్తున్నాయని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపించారు. ఈ మేరకు విద్యాశాఖ అధికారులు తక్షణ చర్యలు తీసుకుని విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని వారు డిమాండ్ చేశారు. విద్యార్థులకు నీతి, నిజాయితీ, చట్టాలను గౌరవించే విలువలను బోధించే విద్యాసంస్థలే ప్రభుత్వ అనుమతులు లేకుండా తరగతులు నిర్వహించడం విచారకరమని విద్యార్థి సంఘాల నేతలు పేర్కొన్నారు. సంబంధిత పాఠశాలలకు విద్యాశాఖ నుంచి అవసరమైన అనుమతులు లేకపోయినా అడ్మిషన్లు చేపట్టి తరగతులు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. మహేశ్వరం అసిస్టెంట్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ (ఏఈఓ) ఈ నెల 1న సంబంధిత పాఠశాలలకు నోటీసులు జారీ చేసినప్పటికీ ఇప్పటివరకు పరిస్థితిలో ఎలాంటి మార్పు లేదని, విద్యాశాఖ అనుమతులు లేకుండానే తరగతులు కొనసాగుతున్నాయని విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. నోటీసులను యాజమాన్యాలు పట్టించుకోవడం లేదని, అధికారులు కూడా తదుపరి చర్యలు తీసుకోవడంలో ఆలస్యం చేస్తున్నారని విమర్శించారు. తల్లిదండ్రుల నుంచి భారీ మొత్తంలో ఫీజులు వసూలు చేస్తూ అనుమతులు లేకుండానే విద్యా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విద్యార్థులు, తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. నెల రోజులుగా తరగతులు కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారుల నుంచి కఠిన చర్యలు కనిపించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు. తెలంగాణ సోషల్ స్టూడెంట్ ఆర్గనైజేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెస్త యాదగిరి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఫీజు నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. అనుమతులు లేకుండా పాఠశాలలు నిర్వహిస్తున్న యాజమాన్యాలపై విద్యాశాఖ చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, విద్యను వ్యాపారంగా మార్చే ధోరణిని ప్రభుత్వం అరికట్టాలని ఆయన కోరారు.



### ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు మధుయాష్కీ గౌడ్ జన్మదిన శుభాకాంక్షలు

హయత్ నగర్, జూలై 21 (జనం సాక్షి) : ఏఐసీసీ అధ్యక్షుడు, రాజ్య సభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గేకు టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం ఢిల్లీలోని పార్లమెంట్ హౌస్‌లో ఖర్గేను మర్యాదపూర్వకంగా కలిసిన మధుయాష్కీ గౌడ్, పుష్పగుచ్ఛం అందజేసి, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఖర్గే ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు కలగాలని ఆకాంక్షిస్తూ, ప్రజాసేవలో మరింత విజయవంతంగా కొనసాగాలని కోరుకున్నారు.

# మూడు నెలల బియ్యం ఒకేసారి

- ఈకేవైసీ చేసుకున్న వారికి సన్నబియ్యం పంపిణీ
- ఎల్నినో ప్రభావంతో కేంద్రం ముందు జాగ్రత్తలు



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జులై 21 (జనంసాక్షి) :** రాష్ట్రంలో ఎలినో ప్రభావంతో ప్రజా పంపిణీకి సంబంధించి కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మూడు నెలల రేషన్ బియ్యం ఒకేసారి పంపిణీ చేయాలని నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబరు నెలలకు సంబంధించిన సన్నబియ్యం ఒకేసారి అందించనున్నారు. కేంద్రం ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయటంతో ఆగస్టు నుండి మూడు నెలల బియ్యం పంపిణీకి పౌర సరఫరాల శాఖ ఏర్పాట్లు చేస్తోంది.సాధారణంగా ప్రతినెల మొదటి 15 రోజులు మాత్రమే డీలర్లు రేషన్ బియ్యం ఇచ్చేవారు.వచ్చే నెలలో 3 నెలల రేషన్ ఒకేసారి ఇవ్వనుండటంతో ఆగస్టులో 31 రోజులు దుకాణాలు తెరచి బియ్యం అందించాల్సి ఉంటుంది. ప్రతి రేషన్ కార్డుదారు మూడుసార్లు వేలి ముద్రలు వేయాల్సి ఉంటుంది. ఎంఎల్ఎస్ పాయింట్ల నుండి రేషను దుకాణలకు రెండు, మూడుసార్లు సరిపడ బియ్యం రవాణ చేయనున్నారు.రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా 345 రేషన్ దుకాణాలు వున్నాయి. విటిలో జిల్లా వ్యాప్తంగా ఫుడ్ సేఫ్టీ కార్డులు 1.96 వేలు, అంత్యోదయ కార్డులు 13,830, అన్నపూర్ణ కార్డులు 199 ఉన్నాయి.అందులో ఫుడ్ సెక్యూరిటీ కార్డులోని ఒక వ్యక్తికి ఆరు కిలోల చొప్పున, అంత్యోదయ కార్డు కలిగిన వారికి 35 కిలోలు,కిలో చక్కెర, అన్నపూర్ణ కార్డు ఉన్న వారికి 10 కిలోల సన్నబియ్యం పంపిణీచేస్తారు.లబ్దిదారులు రేషన్ పొందేందుకు ఈ-కేవైసీని తప్పనిసరి సరి చేశారు.కేవైసీ పూర్తి చేసుకున్న వారికి మాత్రమే బియ్యం సరఫరా చేస్తారు. ఈ నెల 31 వరకు ఈ కేవైసీ చేయించుకోవడానికి గడువు ఉంది.

**డీలర్లకు సమస్యలు...**

రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో రేషన్ డీలర్లకు పెద్ద తలనొప్పిగా మారింది.ఒకేసారి మూడు నెలలకు సరిపడా స్టాక్ అందుబాటులో ఉంచుకు నేందుకు రేషన్ దుకాణాల్లో సరిపడా స్థలం లేకపోవడంతో పలు ఇబ్బందులు పడుతున్నారు. ఒకేసారి వందల క్వింటాళ్ల బియ్యాన్ని తమ వద్ద ఉంచుకునేంత పరిస్థితి లేకపోవడంతో డిమాండ్ కు తగ్గట్లు రేషన్ డీలర్లకు బియ్యం సరఫరా చేయలని పౌరసరఫరాల శాఖ అధికారులు భావిస్తున్నారు. అదే విధంగా ఈ-పాస్ యంత్రాల్లో సాంకేతిక లోపాలు, ప్రతి ఒక్కరికి బయోమెట్రిక్ చేయడం ద్వారా పంపిణీలో జాప్యం జరగనుంది. ఒకేసారి ఎక్కువ పరిమాణంలో బియ్యం పంపిణీ చేయడంతో తూకం వేయడంలో డీలర్లకు ఇబ్బందులు ఎదురవుతాయి. ప్రతి నెలా అవసరమైన దానికంటే మూడింతల ఎక్కువ బియ్యం ఒకేసారి తరలించడం, వాటిని లబ్దిదారులకు అందించడంలో డీలర్లు నెల రోజులపాటు పంపిణీ చేయాల్సి ఉంటుంది.

# ప్రభుత్వ సేవల నాణ్యత పెంపే లక్ష్యం

- ఆగస్టు 1 నుంచి కమాన్‌పూర్ నూతన తహసీల్దార్ కార్యాలయం నుంచి సేవలు
- ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య, ప్రాథమిక నైపుణ్యాలపై దృష్టి
- ఆసుపత్రి పనితీరు మెరుగుపరచి నాణ్యమైన వైద్య సేవలు
- పర్యటనలో అధికారులకు కలెక్టర్ సూచనలు



**కమాన్‌పూర్/రామగిరి, జూలై 21 (జనంసాక్షి) :** ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత సమర్థవంతంగా, నాణ్యంగా అందించడమే లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. మంగళవారం కమాన్‌పూర్, రామగిరి మండలాల్లో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్ గుండారం ఎంపీపీఎస్ పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, కమాన్‌పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, నూతన తహసీల్దార్ కార్యాలయం, ఎసఐఆర్ ఓటరు నమోదు ప్రక్రియ, పెంచికల్ పేట్ గ్రామంలోని సింగరేణి భూములు, రామగిరి నూతన తహసీల్దార్ కార్యాలయం, మేడిపల్లి ఇండస్ట్రియల్ పార్క్ స్థలాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, గుండారం ఎంపీపీఎస్ పాఠశాలలో ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి అదనపు బోధన అందించాలని, ప్రాథమిక పాఠశాల స్థాయిలోనే ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం వంటి ప్రాథమిక నైపుణ్యాలు పూర్తిస్థాయిలో అలవడేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. గుండారం ప్రభుత్వ జూనియర్ కళాశాలను పరిశీలించిన కలెక్టర్ బోధన, విద్యార్థుల హాజరు, అందుబాటులో ఉన్న మౌలిక వసతులను పరిశీలించి విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడేలా అధ్యాపకులు కృషి చేయాలని సూచించారు. కమాన్‌పూర్ మండలంలో నూతనంగా నిర్మించిన తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించిన అనంతరం, మిగిలి ఉన్న చిన్నచిన్న పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి 2026 ఆగస్టు 1వ తేదీ నుంచి కొత్త భవనం నుంచే తహసీల్దార్ కార్యాలయ కార్యకలాపాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రామగిరి మండలంలో నిర్మాణంలో ఉన్న నూతన తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని పరిశీలించిన కలెక్టర్, నిర్మాణ పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. రామగిరి మండలంలోని మేడిపల్లి గ్రామ శివారులో ప్రతిపాదిత ఇండస్ట్రియల్ పార్క్ స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్, పారిశ్రామిక పార్కుకు సంబంధించిన ఫెన్సింగ్ పనులు, అప్రోచ్ రోడ్డు నిర్మాణాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో కమాన్‌పూర్ తహసీల్దార్ వాసంతి, రామగిరి తహసీల్దార్ సుమన్, ఎంపీడీఓ శైలజారాణి, ఈఈ పంచాయతీరాజ్ అధికారి వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్లు వరలక్ష్మి, జగదీశ్, రామగిరి అధికారులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

*ఆర్జీ-3 జీఎం సుంకర మధుసూదన్*




**రామగిరి జూలై 21 (జనం సాక్షి):** ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ పిలుపునిచ్చారు.కేంద్ర ప్రభుత్వం చేపట్టిన “ఏక్ పెడ్ మాకే నామ్” కార్యక్రమంలో భాగంగా కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ, కోల్ కంట్రోలర్ ఆర్గనైజేషన్ ఆదేశాల మేరకు మంగళవారం సింగరేణి సంస్థ వ్యాప్తంగా ప్రతి ఏరియాలో 10 వేల మొక్కలు నాటే “మాసివ్ ప్లాంటేషన్ డ్రైవ్” నిర్వహించారు. ఇందులో భాగంగా రామగుండం-3 ఏరియాలోని ఓసిపి-1, ఓసిపి-2 ఉపరితల గనుల ఆవరణలో విస్తృత స్థాయిలో వృక్షారోపణ కార్యక్రమం చేపట్టారు.ఓసిపి-2 ఉపరితల గని ఆవరణలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జీఎం సుంకర మధుసూదన్ మొక్కను నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సింగరేణి సంస్థ పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ఉద్యోగుల చేత లక్షలాది మొక్కలు నాటించి వాటిని సంరక్షిస్తున్నట్లు తెలిపారు. చెట్ల పెంపకం వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ పరిసర గ్రామాల ప్రజలకు మొక్కలను పంపిణీ చేసి నాటిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాల్లో వీలైనన్ని మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా జీవ వైవిధ్య పరిరక్షణకు తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య కార్మిక సంఘాల నాయకులు ఎం. రామచంద్రారెడ్డి, కోట రవీందర్ రెడ్డి, అధికారుల సంఘం అధ్యక్షుడు కోల శ్రీనివాస్, ఎస్‌వోటు జీఎం ఎం. రామ్మోహన్, ఏరియా ఇంజనీర్ ఏ. ఉదయ భాస్కర్, ప్రాజెక్ట్ ఆఫీసర్ జె. రాజశేఖర్, ఏరియా పర్యావరణ అధికారి పి. రాజారెడ్డి, విభాగాధిపతులు బి.టి. మురళీకృష్ణ, బి. సుదర్శనం, కె. ఐలయ్య, షబ్బీరుద్దీన్, ఆసిఫ్ యాసిన్, ఆర్. రాజేశ్వరి, మేఘన, భరత్ కుమార్‌తో పాటు వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తాం

**చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**

**గంగాధర జనంసాక్షి :** అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి పేద ప్రజల సొంతింటి కలను నిజం చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపడమే ప్రభుత్వం లక్ష్యమని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు.మంగళవారం మధురానగర్ లోని ప్రజాకార్యాలయంలో మండలంలోని కొండయ్యపల్లి గ్రామానికి నాలుగు ఇస్లాంపూర్ రెండు రంగారావుపల్లి గ్రామానికి ఒకటి ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు చొప్పదండి నియోజకవర్గంలో ఇప్పటి వరకు 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని అన్నారు రాబోయే రోజుల్లో మరిన్ని ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసి ఇండ్లు లేని వారికి కేటాయిస్తామని నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడానికి కృషి చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ దమ్మని రాము,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంత్రి మహేందర్,మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు చిరుత మంగ,సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు ముద్దం నగేష్,ఆయా గ్రామాల సర్పంచులు వేముల భాస్కర్,బీర్ల ఆనంద్,మల్యాల తిరుపతి,బారాజు ప్రభాకర్ రెడ్డి,పడాల భాగ్యలక్ష్మీరాజన్న,దీకొండ బాబా లక్ష్మీ మధు,సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిరుమల్ రావు,నాయకులు పురుమల్ల మనోహర్,సత్తు కనకయ్య,గునుకొండ బాబు,గుజ్జుల బాపు రెడ్డి,కంకణాల రాజగోపాల్ రెడ్డి,రొమాల రమేష్,గడ్డం అంజయ్య,జారతి సత్తయ్య,గుండవేని తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీలో శాంతియుతంగా పోరాడుతున్న విద్యార్థులపై లాఠీచార్జి అమానుషం

- కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను భర్తరఫ్ చేయాలి
- నీట్‌ను రద్దు చేయాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి



**జమ్మికుంట, జూలై 21 (జనం సాక్షి):** ఢిల్లీలో నిరసనకారులపై లాఠీచార్జి, దౌర్జన్య కాండను నిరసి స్తూ జమ్మికుంట మండల కేంద్రంలోని గాంధీ చౌరస్తాలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేశారు. ఈ సందర్భంగా వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం విద్యార్థి,నిరుద్యోగుల పట్ల వ్యవహరిస్తున్న తీరుకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున ఉద్యమిస్తున్నారని అన్నారు. ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా పోరాడుతున్న విద్యార్థులు, యువతపై పోలీసులు టియర్ గ్యాస్, వాటర్ కెనాన్లు ప్రయోగించి, లాఠీచార్జ్ చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. ప్రశ్నపత్రాల లీకేజీలకు బాధ్యత వహిస్తూ తన కేబినెట్‌లోని మంత్రిని కూడా రాజీనామా చేయించలేని దుస్థితిలో ప్రధానమంత్రి ఉన్నారని విమర్శించారు. పేపర్ లీకేజీల వల్ల 21 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకుని, ప్రాణాలు కోల్పోయినా కేంద్ర ప్రభుత్వం, బీజేపీ నాయకత్వం స్పందించకపోవడం అత్యంత బాధాకరమన్నారు. ప్రతి అంశాన్నిహోరాజకీయాలు చేసే బీజేపీ నాయకులు ప్రశ్న పత్రాల లీకేజీలో ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. రాష్ట్రాల హక్కులను దెబ్బతీస్తున్నహొవిన్ టి ఏనుహొరద్దు చేయాలని డిమాండ్ చేశారు.తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు, ఎంపీలు పేపర్ లీకేజీలపై విద్యార్థుల భవిష్యత్తుపై ఎందుకు స్పందించడం లేదని విమర్శించారు.గాయపడిన విద్యార్థి, నిరుద్యోగులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు.నీట్ పేపర్ లీకేజీ కుంభకోణంపై దేశవ్యాప్తంగా చెలరేగిన విద్యార్థి, యువజన ఉద్యమం చారిత్రాత్మకమైనదన్నారు.

నీట్ పేపర్ లీకేజీతో లక్షలాది మంది విద్యార్థుల జీవితాలను అంధకారంలోకి నెట్టిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలన్నారు.హొ విద్యార్థులపై జరిగిన నిరంకుశ దమనకాండకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా పూర్తి బాధ్యత వహించాలన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి జక్కుల రమేష్ యాదవ్, మండల కమిటీ సభ్యులు దండిగారి సతీష్, గడ్డం శోభన్, మారేపల్లి కిరణ్, సిరికొండ పోచయ్య, వేషాల రమేష్, పుల్ల కరుణాకర్, నిమ్మల నాగరాజు, పుల్ల నరేష్, నిమ్మలహొనాగరాజు, కేసాని రమేష్, ఉడుత నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత

- అవసరమైన అదనపు తరగతి గదుల నిర్మాణంపై అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి : జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్



**మల్లాపూర్, జూలై 21(జనంసాక్షి) :** జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవసరమైన మౌలిక వసతులను యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మల్లాపూర్ మండలం సాతారం గ్రామంలోని జడ్పీ హై స్కూల్ పాఠశాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం పాఠశాలకు మొత్తం 39 తరగతి గదులు అవసరం కాగా, ప్రస్తుతం 16 తరగతి గదులు అందుబాటులో ఉన్నాయని, ఇంకా 23 అదనపు తరగతి గదులు నిర్మించాల్సిన అవసరం ఉందని వివరించారు. ఇందుకు సుమారు రూ.12 కోట్ల అంచనా వ్యయం ఉంటుందని తెలిపారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తగిన తరగతి గదులు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అవసరమైన ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యత అని పేర్కొన్న కలెక్టర్, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సౌకర్యవంతమైన విద్యా వాతావరణం కల్పించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ పరిశీలనలో మెట్ పెల్లి ఆర్డీవో నరసింహ రావు పేట, తహసీల్దార్ రాంచందర్, ఏఈఈ శేష కుమార్, ధనుంజయ్ టీజీఈడబ్ల్యూఐడీసీ , సంబంధిత అధికారులు, సర్పంచ్ పోతావేణి నారాయణ గౌడ్, ఉపా సర్పంచ్ భేతి జగన్ రెడ్డి, గ్రామస్థులు తదితర అధికారులు పాల్గొన్నారు.

# వెన్కేపల్లిలో భర్త కోసం భార్య పోరాటం

**ఇంటి ముందు చిన్నారి పాపతో కలిసి బైఠాయింపు**



**సైదాపూర్ జులై 21( జనం సాక్షి) :** మాయమాటలతో తననునమ్మించి,జీవితాంతం తోడుంటానని ప్రమాణం చేసిన భర్త.. మరో మహిళ మోజులో పడి తనను,తన కన్న బిడ్డను రోడ్డున పడేశాడంటూ కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం వెన్కేపల్లి గ్రామానికి చెందిన ఈరాల మేఘన రోదిస్తూ తన భర్త ఇంటి ఎదుట బైఠాయించి మంగళవారం ధర్నాకు దిగిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపుతుంది.వివరాల్లోకి వెళ్తే సిద్దిపేట జిల్లా కోహెడ మండలం నాగసముద్రాల గ్రామానికి చెందిన మేఘనను సైదాపూర్ మండలం వెన్కేపల్లికి చెందిన ఈరాల రాజు అనే వ్యక్తితో 2022లో ఇరు కుటుంబాల పెద్దల సమక్షంలో కట్న కానుకలతో వివాహం జరిపించారు.వీరికి ఒక చిన్నారి కూతురు క్రిత్యశ్రీ(3) జన్మించింది.పెళ్లికి ముందే రాజు మరో యువతీతో ప్రేమాయణం నడిపించాడని,ఇదంతా తెలిసి తనతో పెళ్లి చేయించి తనను,తన కుటుంబాన్ని నానా ఇబ్బందులు పెడుతున్నారని మేఘన రోధించారు.భర్త ప్రవర్తనలో మార్పును గమనించి భర్తను నిలదీయాగ భార్యాపిల్లలను నిర్లక్ష్యం చేస్తూ,మానసికంగా,శారీరకంగా వేధించడం ప్రారంభించారని తెలిపారు.ఈ క్రమంలోనే సదరు భర్త..భార్యకు తెలియకుండా రహస్యంగా మరో మహిళను వివాహం చేసుకున్నాడని బాధితురాలు ఆరోపిస్తుంది. రెండో పెళ్లి చేసుకున్నప్పటి నుంచి తమను పూర్తిగా వదిలేసి హైదరాబాదులో రహస్యంగా జీవిస్తున్నారని,విషయం తెలిసి తన తండ్రి గుండెపోటుతో మృతి చెందారని మేఘన కన్నీరు మున్నీరైంది. పంచాయతీలు పెట్టి ప్రజాప్రతినిధులు,కులపెద్దలు చెప్పినా తన భర్త రాజు వినకపోవడం తో.. విసిగిపోయిన బాధితురాలు తన చిన్నారి కూతురిని ఎత్తుకుని భర్త నివాసం ఉంటున్న ఇంటి ముందుకు చేరుకొని ధర్నాకు దిగారు.న్యాయం జరిగే వరకు ఇక్కడి నుండి కదిలేది లేదంటూ తన కుటుంబ సభ్యులతో అక్కడే బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్నారు.చిన్నారితో కలిసి తల్లి ఇంటి వద్ద ధర్నా చేయడం చూసి స్థానికులు అయ్యో పాపం అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.తమకు న్యాయం చేయాల్సిన పోలీసులు తనపై, తమ కుటుంబ సభ్యులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బాధితులు మండిపడుతున్నారు.ఇట్టి విషయమై బాధితురాలి భర్త రాజును వివరణ కోరగా తాను అందుబాటులో లేనని తాను ఎవరిని వివాహం చేసుకోలేదని,తనపై చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని స్పష్టం చేశారు.

# ఒకే రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి

**మరణంలోను వీడని ముగ్గురు స్నేహబంధం**


గంభీరావుపేట, జూలై 21: రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలో విషాద ఛాయలు అలముకున్నాయి. గత నెల 27వ తేదీన కామారెడ్డి నుండి స్వగ్రామానికి వస్తున్న సమయంలో నర్మల రహదారి మధ్యలో కాకుల గుట్ట తండా సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అనిల్ యాదవ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మరుసటి చికిత్స పొందుతూ బంగ్లా అన్వేష్ గౌడ్ మృతి చెందగా, దుంపల వికాస్ (23) తీవ్ర గాయాలతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. మృతి చెందిన ముగ్గురూ చిన్ననాటి నుంచి ప్రాణ స్నేహితులుగా కలిసి పెరిగి, ప్రతి సందర్భంలో ఒకరికొకరు అండగా నిలిచేవారు. విధి వక్రించి ఒకే ప్రమాదంలో ముగ్గురూ ప్రాణాలు కోల్పోవడంతో వారి స్నేహబంధం మరణంలోనూ వీడలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు శోకసంద్రంలో మునిగిపోయారు. మండల కేంద్రంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

# డ్రై డే కార్యక్రమాన్ని పరిశీలించిన జిల్లా వైద్య ఆరోగ్య అధికారి

**రాజన్న సిరిసిల్ల జిల్లాప్రతినిధి జులై 21(జనంసాక్షి) :** వేములవాడ అర్బన్ మండలంలోని చీర్లవంచ గ్రామంలో నిర్వహించిన డ్రై డే కార్యక్రమాలను మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. ఏంజెలా ఆల్ఫ్రెడ్ పరిశీలించారు. గ్రామంలోని నివాస ప్రాంతాలు,నీరు నిల్వ ఉండే ప్రదేశాలు,ఇంటింటి పరిసరాలను తనిఖీ చేసి, దోమల నివారణ చర్యలను క్షేత్రస్థాయిలో సమీక్షించారు. డెంగ్యూ, మలేరియా, చికున్ గున్యా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను నివారించేందుకు ప్రతి మంగళవారం, శుక్రవారం తప్పనిసరిగా డ్రై డే నిర్వహించాలని క్షేత్ర స్థాయి సిబ్బంది కి సూచించారు. జ్వరం, తలనొప్పి, ఒళ్లునొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ,దోమల లార్వా నిర్మూలన కొరకు నీరు నిల్వ వుండే ప్రదేశాల్లో ఆయిల్ బాల్ ను వినియోగించాలని దోమల నివారణకు పాసింగ్ చర్యలను మరింత సమర్థవంతంగా చేపట్టాలని సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.గ్రామ ప్రజలు కూడా ఆరోగ్య శాఖతో కలిసి డ్రై డే కార్యక్రమాలను విజయవంతం చేయాలని జిల్లా వైద్యాధికారి తెలిపారు.ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

# జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు

- సుప్రీంకోర్టు మార్గదర్శకాలు తూచా తప్పక పాటించాలి
- తీసుకున్న చర్యలపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలి
- జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్ బ్యూరో జూలై 21 (జనంసాక్షి) :** జాతీయ రహదారుల పై ప్రమాదాల నివారణకు సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటించేందుకు రవాణా, పోలీస్, నేషనల్ హైవే అధికారులు సమన్వయంతో తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. జాతీయ రహదారుల పై రోడ్డు భద్రత ప్రమాదాల నివారణ, సుప్రీంకోర్టు మార్గదర్శకాల అమలు తదితర అంశాల పై ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి వికాస్ రాజ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. పోలీసు, రవాణా, ఎన్.హెచ్.ఎ.ఐ అధికారులు సమన్వయంతో రహదారుల భద్రత, ప్రమాదాల నివారణకు తగిన కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. “జిల్లా రహదారి భద్రతా టాస్క్ ఫోర్స్” ఆధ్వర్యంలో జిల్లా రోడ్డు భద్రతకు సంబంధించి చేపట్టిన చర్యలపై సమగ్ర నివేదికను సిద్ధం చేయాలని ఆదేశించారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం “రైట్ ఆఫ్ వే” మార్గం వెంబడి కొత్తగా ఎలాంటి వాణిజ్య నిర్మాణాలు అనుమతించరాదని, మునిసిపల్, ట్రేడ్ లైసెన్స్ వంటివి “రైట్ ఆఫ్ వే” వెలుపల ఏర్పాటు చేయకుండా చూడాలని, ఎలాంటి కొత్త అనుమతులూ ఇవ్వరాదని పేర్కొన్నారు. జాతీయ రహదారుల వెంట ఆక్రమణలు పరిశీలించేందుకు, రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు డ్రోన్ ద్వారా నిఘా ఉంచాలని తెలిపారు. రోడ్డు భద్రత చర్యలకు అవసరమైన నిధులు కేటాయిస్తామని అన్నారు. జాతీయ రహదారుల వెంట గట్టి నిఘా, పెట్రోలింగ్, అక్రమ పార్కింగ్ వంటి అంశాలను పర్యవేక్షించాలని పోలీస్, రవాణా, నేషనల్ హైవే అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారి పెట్రోలింగ్ కోసం పోలీస్ రవాణా శాఖ సిబ్బందితో కూడిన ప్రత్యేక హైవే నిఘా బృందాలను ఏర్పాటు చేయాలని అన్నారు. స్పీడ్ డిటెక్టర్లు, కెమెరాలు, సైన్ బోర్డులు, ఎమర్జెన్సీ కాల్ బాక్సులు వంటివి పరిశీలించాలని తెలిపారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పాట్స్ గుర్తించి ప్రమాద నివారణ చర్యలు తీసుకోవాలని అన్నారు. బ్లాక్ స్పాట్ వద్ద హైమాస్ట్ లైటింగ్, స్పీడ్ ఎన్ ఫోర్స్ మెంట్ కెమెరాలు, మెట్రో రిఫ్లెక్టివ్ హెచ్చరిక సంకేతాలు వంటివి ఏర్పాటు చేయాలని అన్నారు. భారీ వాహన డ్రైవర్లకు విశ్రాంతి సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. ప్రమాదాలు జరిగినప్పుడు తక్షణ వైద్య సహాయం కోసం సమీప ఆసుపత్రులను మ్యాపింగ్ చేయాలని తెలిపారు. ఈ సౌకర్యాలను పరిశీలించాలని, లేని చోట్ల అవసరమైన చర్యలు తీసుకుని నివేదిక సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలని పేర్కొన్నారు.

# నీట్ పేపర్ లీకేజీపై ప్రశ్నిస్తే విద్యార్థులపై లాఠీచార్జ్ చేస్తారా?




- కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి : చాడ వెంకటరెడ్డి
- కరీంనగర్‌కు సాగు, తాగునీరు అందించడంపై రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలి

**కరీంనగర్ టౌన్, జూలై 21, (జనం సాక్షి) :** నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై ప్రశ్నించిన విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వం లాఠీచార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగించడం దారుణమని సీపీఐ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి విమర్శించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.కరీంనగర్‌లోని సీపీఐ జిల్లా కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నీట్ పేపర్ లీకేజీతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందన్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఢిల్లీలో నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు, వృద్ధులపై పోలీసులు బలప్రయోగం చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు.నైతిక విలువలు, రామరాజ్యం గురించి మాట్లాడే ప్రధాని నరేంద్ర మోదీ వాటిని ఆచరణలో ఎందుకు చూపించడం లేదని ప్రశ్నించారు.తెలంగాణలో సాగు, తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని పేర్కొన్న చాడ వెంకటరెడ్డి, గోదావరి జలాలను మెట్ట ప్రాంతాలకు మళ్లించేందుకు గతంలో సీపీఐ, రైతు సంఘాలు దీర్ఘకాలంగా పోరాటాలు చేశాయని గుర్తు చేశారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో జలయజ్ఞం ద్వారా శ్రీరాంసాగర్ వరద కాలువ, మిడ్ మానేరు, గౌరవెల్లి, గండిపల్లి ప్రాజెక్టుల పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు.

కరీంనగర్ దిగువ మానేరు జలాశయంలో నీటి మట్టం కనిష్ఠ స్థాయికి చేరుకుందని ఆందోళన వ్యక్తం చేసిన ఆయన, ఎల్లంపల్లి, మిడ్ మానేరు నుంచి ఎల్ఎండీకి వెంటనే నీటిని తరలించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి చొరవతో మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి తుమ్మిడిహట్టి ప్రాజెక్టు నిర్మాణాన్ని వేగవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్, బోయిని అశోక్, గూడెం లక్ష్మి, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, న్యాలపట్ల రాజు, జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, బీర్ల పద్మ, కొట్టె అంజలి, నగర నాయకులు బాకం ఆంజనేయులు, కసిబొజుల సంతోష్ చారి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారులను ప్రత్యేకంగా గౌరవిస్తాం

- వాళ్ల సంక్షేమానికి సంబంధించి ప్రభుత్వానికి సిఫార్సు చేస్తాం
- తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ చైర్మన్ కే కేశరావు, సభ్యులు కోదండరాం హామీ



**హైదరాబాద్, జూలై 21 (జనంసాక్షి) :** తెలంగాణ ఉద్యమంలో న్యాయవాదులు, డాక్టర్లు, పాత్రికేయుల పాత్ర ఎన్నటికీ మరువలేనిదని, ఈ ఉద్యమకారులను ప్రత్యేకంగా గుర్తించడంతో పాటు గౌరవించేలా చర్యలు చేపడతామని తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ చైర్మన్ కే కేశవరావు, కమిటీ సభ్యులు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం హామీనిచ్చారు. ఉద్యమ కారుల సంక్షేమానికి సంబంధించిన అంశాలను ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామని చెప్పారు. హైదరాబాద్ నగరంలోని అమరవీరుల స్మారకం (అమరజ్యోతి) కార్యాలయంలో 'తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు – గౌరవం – సంక్షేమం' పై మంగళవారం సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా పాల్గొన్న న్యాయవాదులు, వైద్యులు, పాత్రికేయుల పాత్రను గుర్తుచేస్తూ.. వారి నుంచి పలు సలహాలు సూచనలను స్వీకరించారు. ఈ సందర్భంగా కేకే, కోదండ రాం మాట్లాడుతూ.. ఉద్యమ కాలంలో ఎంతోమంది పాత్రికేయులు తమ వృత్తిని కూడా వదులుకునేందుకు సిద్ధపడ్డారని, యాజమాన్యాల ఒత్తిడిని, సర్కారు నిర్బంధాన్ని తట్టుకుని నిలబడ్డారని గుర్తుచేశారు. అన్నివిధాలా నష్టపోయినప్పటికీ వెనుకడుగు వేయకుం డా తెలంగాణవాదానికి కట్టుబడి పనిచేశారని తెలిపారు. అలాంటి ఉద్యమకారులను ప్రజాపాలన ప్రభుత్వంలో ప్రత్యేకంగా గౌరవించేం దుకు తమవంతు చర్యలు తీసుకుంటామన్నారు. ఉద్యమకారుల సంక్షేమం, ఆరోగ్యం, భవిష్యత్ భరోసా కోసం ప్రభుత్వానికి సిఫార్సు చేసి పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు.



సమావేశంలో పాల్గొన్న టీఆర్ఎస్ అధ్యక్షురా లు కల్వకుంట కవిత మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం కోసం పోరాడిన ఉద్యమకారులకు న్యాయం చేసే విషయంలో ఆలస్యం చేయవద్దని తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీకి విజ్ఞప్తి చేశారు. ఉద్యమకారులకు న్యాయం చేయాలంటూ కవిత రూపొందించిన నివేదికను ఆ కమిటీకి అందజేశారు. స్వతంత్ర సైనిక సమ్మాన్, హైదరాబాద్ లిబరేషన్ మూమెంట్ రూల్ పొజిషన్‌ను స్టడీ చేయాలని ఆ కమిటీకి సూచించారు. వాటిలో ఉన్న విధంగా ఉద్యమకారులకు ప్రయోజనం కలిగించాలని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో ఉద్యమకారులకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. 1969 ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులను కూడా ఇందులో చేర్చాలని గుర్తింపు కమిటీకి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, మోతె శోభన్ రెడ్డి, న్యాయవాదులు, వైద్యులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

# ఉద్యమకారులకు ప్రత్యేక గుర్తింపు కార్డు ఇవ్వాలి

**300 గజాల స్థలంతో పాటు ఉద్యమ జర్నలిస్టుల కాలనీ నిర్మించాలి**

**కేకే కమిటీకి తెలంగాణ ఉద్యమ జర్నలిస్టుల సంఘం విజ్ఞప్తి**





**హైదరాబాద్, జూలై 21 (జనంసాక్షి) :** తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమ జర్నలిస్టులందరికీ స్వాతంత్ర సమరయోధులకు ఇచ్చినట్టుగా ప్రత్యేక గుర్తింపు కార్డు ఇవ్వాలని తెలంగాణ ఉద్యమ జర్నలిస్టుల సంఘం (టీయూజేఎస్) డిమాండ్ చేసింది. ఉద్యమకాలంలో పాల్గొన్న అందరికీ మొదటగా ప్రాథమిక గుర్తింపునివ్వాలని కోరింది. తెలంగాణ ఉద్యమ కారుల గుర్తింపు కమిటీ సమావేశంలో టీయూజేఎస్ అధ్యక్షుడు ఎంఎం రహమాన్ మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారుల కోసం ఉద్యమ జర్నలిస్టుల కాలనీ నిర్మించాలని, ఉద్యమ జర్నలిస్టులం దరికీ 300 గజాల స్థలం ఇవ్వాలని అన్నారు. ప్రస్తుత జీవోలు అనుకూలించకపోతే ప్రభుత్వమే కొనుగోలు చేసి, ఇళ్లు నిర్మించే బాధ్యత తీసుకోవాలన్నారు. యాభై ఏళ్లకే జర్నలిస్టులు రోగాలబారిన పడుతున్నారని, కాబట్టి వారందరికీ ప్రత్యేక పెన్షన్ సౌకర్యం కూడా కల్పించాలని కోరారు. హెల్త్ కార్డులు ఇచ్చినప్పటికీ వాటిని కార్పొరేట్ ఆసుపత్రుల్లో అమలయ్యేలా, కుటుంబ సభ్యులకు వర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రత్యేక చికిత్సతో పాటు ఉచితంగా మందులు ఇవ్వాలని సూచించారు. అదేవిధంగా తెలంగాణ యాస, భాసతో వచ్చే తెలంగాణ సంస్థలకు ప్రత్యేక ప్రాధాన్యతనివ్వాల్సిన అవసరం ఉందని సూచించారు. అనంతరం కమిటీ సభ్యులకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. టీయూజేఎస్ ప్రధాన కార్యదర్శి టి.రమేష్ బాబు, ఉపాధ్యక్షులు కందుకూరి రమేష్ బాబు, టీయూజేఎస్ నాయకులు సుమబాల, యాటకర్ల మల్లేశం, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీసుల అదుపు నుంచి నిందితుడు పరార్

- బాధ్యులైన పోలీసులకు ఛార్జ్ మెమో

**నిజామాబాద్, జూలై21 (జనంసాక్షి) :** పోలీసుల కళ్లుగప్పి ఓ నిందితుడు పరారయ్యాడు. తప్పించుకున్న ఒక నిందితుడి కోసం ఉన్న నిదితుడిని తీసుకుని బయలుదేరగా, అతను తప్పించుకున్నాడు. వివరాల్లోకి వెళితే నిజామాబాద్ జిల్లా కేంద్రంలో పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ఆదేశాల మేరకు ట్రాఫిక్ పోలీసులు శనివారం డ్రంక్ అండ్ తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో నంబర్ లేని బైక్ పై వచ్చిన ఇద్దరు అనుమానితులు పోలీసులను చూసి బైక్ అక్కడే వదిలేసి పరారయ్యారు. దీంతో ట్రాఫిక్ పోలీసులు వారిని వెంబడించగా ఒకరు తప్పించుకుపోగా మరో అనుమానితుడు పోలీసులకు చిక్కాడు. దీంతో అతని తనిఖీ చేయగా అతడి వద్ద బంగారు గొలుసు లభించడంతో అనుమానితునితోపాటు, బైక్ ను సైతం తదుపరి విచారణ నిమిత్తం సీసీఎస్ (సెంట్రల్ క్రైమ్ స్టేషన్) పోలీసులకు అప్పగించారు. పోలీసుల అదుపులో ఉన్న సదరు నిందితుని విచారించగా అతడు కరీంనగర్ జిల్లా గంగాధర మండలానికి చెందినవాడిగా పోలీసుల విచారణలో అంగీకరించారు. అయితే సదరు నిందితుడి వెంట ఉండి పరారైన మరో అనుమానితుడు అతడి సమీప బంధువేనని పోలీసుల విచారణలో తేలింది. అయితే అదుపులో ఉన్న అనుమానితుడి వద్ద లభించిన బంగారు గొలుసు ఎక్కడికైనా విచారించగా నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండల పరిధిలో ఓ మహిళ వద్ద నుండి చోరీ చేసినట్లుగా సీసీఎస్ పోలీసుల విచారణలో అనుమానితుడు అంగీకరించినట్లు తెలిసింది. అయితే అతడి వెంట ఉండి పరారైనా మరో నిందితుడి వివరాలు అడగగా, పారిపోయిన నిందితుడు తన సమీప బంధువని పోలీసుల విచారణలో తెలిపాడు. పరారైన మరో నిందితుడిని పట్టుకునేందుకు పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిజామాబాద్ సిసిఎస్ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వర్తిస్తున్న ఓ సీఐ ఆధ్వర్యంలో బృందాన్ని కరీంనగర్ జిల్లాకు పంపించారు. తమ అదుపులో ఉన్న అనుమానుతుని వెంటబెట్టుకొని అక్కడి వరకు వెళ్లిన సీసీఎస్ టీం కండ్లు కప్పి ఆ దొంగ పరారైనట్లు తెలిసింది. పోలీసులకు పట్టుబడిన 24 గంటల వ్యవధిలోనే అనుమానితుడు వారి చెర నుండి పారిపోవడంతో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య సీసీఎస్ బృందంపై సీరియస్ గా పరిగణించినట్లు తెలిసింది. అంతేకాకుండా క్రమశిక్షణ చర్యల్లో భాగంగా అనుమానితుడు పరారీకి బాధ్యులుగా చేస్తూ సీసీఎస్ సీఐ తో పాటు అతని వెంట వెళ్లిన సిబ్బందికి పోలీస్ బాస్ ఛార్జ్ మెమో ఇచ్చినట్లు పోలీస్ అధికారుల ద్వారా తెలిసింది.

# గోదావరి వంతెనపై మహిళ ఆత్మహత్యాయత్నం

- అడ్డుకుని ప్రాణాలు కాపాడిన స్థానికులు

**కొత్తగూడెం, జులై 21 (జనంసాక్షి) :** భద్రాచలం గోదావరి వంతెనపై ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మంగళవారం సారపాక బ్రిడ్జి వద్ద చోటుచేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ములకలపల్లి మండలం పొగళ్లపల్లి గ్రామానికి చెందిన గొల్లమూడి శైలజ గోదావరి వంతెనపై నుండి నదిలో దూకేందుకు సిద్ధపడింది. ఇది గమనించిన స్థానికులు, వాహనదారులు వెంటనే స్పందించి ఆమెను పట్టుకుని నదిలో దూకకుండా అడ్డుకున్నారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న బూర్గంపహాడ్ పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరవుతున్న శైలజను ఓదార్చి స్టేషన్‌కు తరలించారు. పోలీసుల విచారణలో బాధితురాలు శైలజ తన ఆవేదనను వ్యక్తపరిచింది. తన సొంత ఇంటి స్థలాన్ని ఆమె మరిది రమేశ్ అక్రమంగా ఆక్రమించుకున్నారని, తన భర్తపై పలు రకాల కేసులు పెట్టించి వేధింపులకు గురిచేస్తున్నారని, న్యాయం కోసం ఐదు నెలలుగా తిరుగుతున్నా అధికారుల నుంచి స్పందన లేకపోవడంతో మనస్థాపంతో గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు సిద్ధపడినట్లు తెలిపి కన్నీంటి పర్యంతమైంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం శైలజకు కౌన్సిలింగ్ ఇచ్చి విచారణ జరిపి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

## ప్రజల భావాలు ప్రతిబింబించే విధంగా

# పాత్రికేయులు పని చేయాలి

**ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్**



**గోదావరిఖని (జనంసాక్షి) :** ప్రజల భావాలను ప్రతిబింబించే విధంగా పాత్రికే యులు పనిచేయాలని ప్రెస్ అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాసరెడ్డి, రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ అన్నారు. గోదావరిఖని ప్రెస్ క్లబ్ ఆడిటోరియంలో మంగళవారం ప్రెస్ క్లబ్, అక్షర ఫౌండేషన్ సంయుక్త నిర్వహణలో దివంగత కోల్ బెల్ట్ సీనియర్ జర్నలిస్ట్ మునీర్ భాయ్ పుస్తక పరిచయ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రెస్ అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, విశిష్ట అతిథిగా రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ హాజరయ్యారు. ముందుగా మునీర్ భాయ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం మునీర్ భాయ్ జీవిత చరిత్రతో ముద్రించిన ప్రోలీటేరియన్ జర్నలిస్ట్ మునీర్ భాయ్ జీవిత పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుస్తక పరిచయాన్ని పుస్తక సహా ఎడిటర్ నక్క వెంకట్రావుతో కలిసి హెచ్.రమేష్ చేశారు. అనంతరం ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస రెడ్డి, రామగుండం ఎమ్మెల్యే రాజు ఠాకూర్ మాట్లాడుతూ మునీర్ భాయ్ జీవితమంతా పోరాటాలతోనే సరిపోయిందని, ఎన్నడూ కూడా తన కుటుంబం గురించి ఆలోచన చేయలేదని, చివరకు అనారోగ్యం బారిన పడి మనల్ని విడిచివెళ్లారని అన్నారు. మునీర్ భాయ్ ఒక జర్నలిస్ట్‌గా, కార్మిక ఉద్యమ నేతగా, విద్యార్థి, యువజన నాయకునిగా పని చేశారన్నారు. పెత్తందారులకు, యాజమా న్యాలకు ఎదురొడ్డి నిలిచారని తెలిపారు. అలాగే నేడు పాత్రికేయ రంగం గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటోందని, దానికి ముఖ్య కారణం సోషల్ మీడియా అని అన్నారు. పత్రికకు, మీడియాకు ఒక విధానపరమైన విధానాలు ఉంటాయని, కొన్ని చట్టాలు ఉంటా యని, యాజమాన్యాలు ఉంటారని వాటికి లోబడే వార్తలను ప్రచురించాల్సి ఉంటుంద న్నారు. కానీ సోషల్ మీడియాకు అలాంటివి ఏమి వర్తించవని అన్నారు. జర్నలిస్టుల సమస్యలపై, వారి ఇబ్బందులపై బెంగళూరులో ఆగస్టులో జరిగే ఇండియన్ జర్నలిస్ట్ యూని యన్ సమావేశాల్లో మాట్లాడతా నని ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం దిశగా కృషి చేస్తానని తెలిపారు. పుస్తక ఎడిటర్, అక్షర ఫౌండేషన్ వ్యవస్థాపకులు, సీనియర్ జర్నలిస్ట్ మాదాసి రామ్మూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్ర మంలో ఐజేయు నాయకులు నగునూరి శేఖర్, ప్రెస్‌క్లబ్ అద్యక్షులు మాధవరావు, ప్రధానకార్యదర్శి గడ్డం శ్యామ్, మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, ఇప్టా జాతీయ సమితి సభ్యులు కె.స్వామి, పలు కార్మిక సంఘాల నాయకులు పర్లపల్లి రవి, తుమ్మల రాజారెడ్డి, రియాజ్ అహ్మద్, ఐ.కృష్ణ, పీ.మల్లికార్జున్, తోకల రమేష్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాద్యక్షులు బుర్ర సంపత్ కుమార్ గౌడ్, జిల్లా అద్యక్షులు మల్లావఝుల వంశీ, అధిక సంఖ్యలో జర్నలి స్టులు, పలు పక్షాల బాధ్యులు పాల్గొన్నారు.

# బిఎల్‌వోలకు వెంటనే ఫాములు అందించాలి

**మరోమారు గడువు పొడిగించడం కుదరదు**

**హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్వీ కర్ణన్**


**హైదరాబాద్, జులై 21 (జనంసాక్షి) :** రాష్ట్రంలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ పొడిగింపు మళ్లీ ఉండదని జీహెచ్ఎంసీ కమిషనర్, హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్వీ కర్ణన్ స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ.. ఎన్యూమరేషన్ ఫామ్‌లు త్వరగా బీఎల్‌వోలకు ఇవ్వాలని నగరంలోని ఓటర్లకు సూచించారు. ఫామ్ తీసుకున్న ఓటర్లు ఆగస్టు 3వ తేదీ వరకు గడువు ఉందని చెబుతున్నారని.. కానీ వీటినన్నింటిని డిజిటలైజేషన్ చేయాల్సి ఉందన్నారు. ఈ నేపథ్యంలో సర్ ఫామ్‌లు సాధ్యమైనంత త్వరగా బీఎల్‌వోలకు అందించాలని ప్రజలకు ఆయన వివరించారు. చివరి రోజు వరకు ఆగితే.. డిజిటలైజేషన్ చేసే సమయంలో సర్వర్ డౌన్ అయ్యే అవకాశం ఉందని అన్నారు. పలు ప్రాంతాల్లో బీఎల్‌వోలు ఐదారుసార్లు ఇంటింటికి వెళ్లారని చెప్పారు. హైదరాబాద్ జిల్లాలో 9.59 శాతం మంది ఓటర్లు ఆన్‌లైన్‌లో ఎన్యూమరేషన్ ఫామ్‌లు నింపారని వివరించారు. జిల్లాలో ఇప్పటివరకు మొత్తం 43 శాతం ఎన్యూమరేషన్ ఫామ్‌లు రిసీవ్ చేసుకుని.. వాటి వివరాలను డిజిటలైజ్ చేశామని పేర్కొన్నారు. ఓటరును భయపెట్టి, ఎన్యూమరేషన్ ఫామ్ ఇవ్వకుండా చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎన్నికల అధికారి ఆర్వీ కర్ణన్ హెచ్చరించారు. ఓటు హక్కుకు, సంక్షేమ పథకాలకు ఎలాంటి సంబంధం లేదని ఆయన వివరించారు. మీ ఓటు హైదరాబాద్‌లో ఉన్నా లేక గ్రామాల్లో ఉన్నా సంక్షేమ పథకాలు ఎక్కడికి పోవని అన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో నిర్లక్ష్యంగా వహించిన ఓ ఐఈఓను ఇప్పటికే సస్పెండ్ చేశామని గుర్తు చేశారు. ఇంకొంత మంది బీఎల్‌వోలకు షోకాజ్ నోటీసులు ఇచ్చామని తెలిపారు. బీఎల్‌వోలు ఎలా పని చేస్తున్నారో చెక్ చేయడానికి విజిలెన్స్ అధికారులు ఫీల్డ్‌లో చెక్ చేస్తున్నారని ఆర్వీ కర్ణన్ వివరించారు.



# బీపీ ఆచార్య కార్టూన్ల పుస్తకం విడుదల

**గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా చేతుల మీదుగా 'ఆబ్ట్యూస్ యాంగిల్' ఆవిష్కరణ**

**హైదరాబాద్, జూలై 21 (జనంసాక్షి):** తెలంగాణ గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా మంగళవారం లోక్‌భవన్‌లో మాజీ ఐఏఎస్ అధికారి బీపీ ఆచార్య రచించిన "ఆబ్ట్యూస్ యాంగిల్" కార్టూన్ల పుస్తకం నూతన పేపర్‌బ్యాక్ ఎడిషన్‌ను ఆవిష్కరించారు. నాలుగు దశాబ్దాల పాటు సాగిన తన బ్యూరోక్రటిక్ జీవితంలోని అనుభవాలు, సంఘటనలను హాస్యరసభరిత కార్టూన్ల రూపంలో ఈ పుస్తకంలో బీపీ ఆచార్య ఆవిష్కరించారు. ఈ పుస్తకంలోని కార్టూన్లన్నీ ఆచార్య ప్రభుత్వ సేవలో ఉన్న సమయంలో రూపొందించినవే కావడం విశేషం. పరిపాలనా వ్యవస్థలోని విభిన్న కోణాలను వినోదాత్మకంగా ప్రతిబింబించే ఈ కార్టూన్లు పాఠకులను ఆలోచింపజేస్తూనే అలరిస్తాయి. ఈ పుస్తకం ప్రస్తుతం పేపర్‌బ్యాక్ ఎడిషన్‌లో అందుబాటులో ఉంది. ఈ సందర్భంగా కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ట్రస్టీగా ఉన్న బీపీ ఆచార్య, ట్రస్ట్ ప్రచురించిన పలు గ్రంథాలను గవర్నర్‌కు అందజేశారు. ట్రస్టీలైన ప్రొఫెసర్ పాండురంగారావు, వరంగల్‌కు చెందిన శ్రీధర్ రావు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.




# వరంగల్‌లో బీఐఎస్ హాల్‌మార్క్ వారి దాడి

**10 కోట్ల విలువైన బంగారు ఆభరణాలు, 5 కిలోల బంగారం సీజ్**

**వరంగల్ బ్యూరో, జులై 21 (జనం సాక్షి) :** వరంగల్ నగరంలోనీ బంగారం దుకాణాల్లో బి ఐ ఎస్ హాల్ మార్క్ వారు దాడులు చేసిన సంఘటన చోటుచేసుకుంది. దొరికింది సమాచారం. వరంగల్ హనుమకొండ నగరాల్లోని హాల్ మార్క్ లైసెన్స్ ఉన్నటువంటి కొన్ని షాపుల్లో రెండు రోజులపాటు హైదరాబాద్ హెడ్ ఆఫీస్ నుండి వచ్చినటువంటి బిఐఎస్ హాల్ మార్క్ వారు దాడులు నిర్వహించారు. వీరు ప్రధానంగా హాల్ మార్క్ యొక్క యూనిట్ కోడ్ ప్రతి బంగారు ఆభరణం మీద ఉండాలనే నిబంధన ఉంది కానీ దానిని పాటించకుండా వ్యాపారం చేస్తున్నటువంటి బంగారం షాపులను తనిఖీ చేశారు. ఇందులో వరంగల్ కు చెందిన ఓ షాపు లో 10 కోట్ల రూపాయల విలువైనటువంటి ఆభరణాలను సీజ్ చేశారు, అంతేకాకుండా ఐదు నుంచి ఆరు కిలోల బంగారాన్ని కూడా సీజ్ చేసినట్లు సమాచారం. ఇటీవల ఆంధ్ర ప్రాంతం, బొంబాయి ప్రాంతాల లో కూడా ఈ విధమైనటువంటి దాడులను బి ఐ ఎస్ హాల్ మార్క్ అధికారులు దాడులు చేసిన సంఘటన ఉంది. అయితే వరంగల్లో హాల్ మార్క్ యూనిక్ కోడ్ లేనటువంటి షాపులకు నోటీసులు ఇచ్చినట్లు తెలిసింది. బంగారం దుకాణాలు నడిపే ప్రతి వ్యాపారి బిఎస్ఐ హాల్ మార్క్ యూనిక్ కోడ్ ను తప్పనిసరి బంగారు ఆభరణాలపై వేయాలని సూచించినట్లు సమాచారం. ఈ సంఘటనతో వరంగల్లోని వందలాది బంగారం దుకాణ యజమానులు అప్రమాత్తమైనట్లు తెలిసింది.

# ములుగు జిల్లాలో విస్తారంగా వర్షాలు

**జోరు వానలకు తెగిపోయిన రోడ్డు**

**ములుగు, జూలై21 (జనంసాక్షి) :** ములుగు జిల్లాలో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. పలు చోట్ల వృక్షాలు నేలకూలాయి. వాజేడు మండలంలోని జాతీయ రహదారి 163 పై ఇసుక వాగు బ్రిడ్జి వద్ద తాత్కాలిక రోడ్డు వర్షానికి తెగిపోవడంతో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంతో పాటు తెలంగాణ రాష్ట్రానికి రాకపోకలు నిలిచిపోయాయి. ములుగు జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలు జనజీవనాన్ని అతలాకుతలం చేశాయి. జిల్లావ్యాప్తంగా సోమవారం నుంచి కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించడంతో పలుచోట్ల వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. జిల్లాలో సగటున 7.66 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. వాజేడు, వెంకటాపురం మండలాల్లో గరిష్ఠంగా 11 సెం.మీ.కు పైగా వర్షపాతం నమోదైంది. ఆయా చోట్ల మోస్తరు నుంచి భారీ వానలు కురవడంతో చెరువులు, కుంటలు, వాగులు నిండుకుండను తలపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితుల్ని పర్యవేక్షిస్తూ చర్యలు చేపడుతున్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370